ప్రజావీక్షణం దినపత్రిక
విలేకర్లు కావలెను
అసలైన అక్షర జ్ఞానాన్ని తెలియజేస్తూ విలువలతో కూడిన జీవన శైలిలో
ప్రేరణ కలిగించే విషయాలపై అవగాహన కలిగిస్తూ
ప్రజల పక్షాన నిలబడాలని అనుకుంటున్నారా.?
బాధ్యతయుతమైన జర్నలిజంలో రాణించాలనుకుంటున్నారా.?
అయితే రండి.. అక్షరాన్ని అనుకున్న విధంగా రాద్దాం..
తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల వ్యాప్తంగా
జిల్లాలు, మండలాల వారీగా నిబద్ధతతో
పని చేసే విలేకరులు కావలెను
PJV ప్రజా వీక్షణం టీవి
9866330400

# ప్రజావీక్షణం

దినపత్రిక


ఎడిటర్ : కె. శ్రావణ్ కుమార్

www.prajaveekshanam.in సంపుటి:16 సంచిక :86 17 మంగళవారం, ఫిబ్రవరి 2026 పేజీలు : 12 వెల:రూ.2/-

Published from : Vijayawada, Krishna, Guntur, Kakinada, Vishakhapatnam, Vijayanagaram, Prakasham, Kadapa, Kurnool, Tirupathi, Anantapur, East Godavari, West Godavari

PJV ప్రజా వీక్షణం టీవి
Subscribe

## మున్సిపల్ చైర్మన్ ఎన్నికల పరిశీలకులను ప్రకటించిన కేటీఆర్



ఫిబ్రవరి16(ప్రజా వీక్షణం)

మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికల ప్రక్రియలో అధికార కాంగ్రెస్ పార్టీ కొనసాగిస్తున్న అరాచకాలు, కుట్రల నేపథ్యంలో బీఆర్ఎస్ అప్రమత్తమైంది. రేపు ఎన్నికలు జరగనున్న కీలకమైన హంగ్ మున్సిపాలిటీల కోసం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రత్యేకంగా ఎన్నికల ఇంఛార్జిలను నియమించారు. ఈ మేరకు కేటీఆర్ ఆయా మున్సిపాలిటీల స్థానిక నాయకత్వం, నియోజకవర్గ ఎమ్మెల్యేలు, ఇంఛార్జిలతో స్వయంగా మాట్లాడి క్షేత్రస్థాయి పరిస్థితులను సమీక్షించారు. స్థానికంగా కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అక్రమ కిడ్నాప్‌లు, బెదిరింపులు, పోలీసుల దుర్వినియోగం వంటి అంశాలను అడిగి తెలుసుకున్న కేటీఆర్.. పార్టీ స్థానిక నాయకత్వానికి అండగా ఉంటుందన్నారు.




# హంగ్ మున్సిపాలిటీల్లో చక్రం తిప్పిన హస్తం

- గందరగోళంగా మున్సిపల్ చైర్మన్ల ఎంపిక
- మెజార్టీ చైర్మన్లు, వైస్ చైర్మన్లు హస్తగతం
- ఎంఐఎం మద్దతుతో నిజామాబాద్‌లో పాగా
- ఎక్స్ అఫీషియో సభ్యుల బలంతో కాంగ్రెస్ పైచేయి
- ఏడు కార్పోరేషన్లలో ఐదింటిని దక్కించుకున్న కాంగ్రెస్
- కొత్తగూడెంలో సిపిఐకి మద్దతు ప్రకటన
- కరీంనగర్ పీఠంపై జెండా పాతిన బిజెపి
- కోరం లేక 11 మున్సిపాలిటీల్లో ఎన్నిక వాయిదా

హైదరాబాద్,ఫిబ్రవరి16(ప్రజా వీక్షణం):

తెలంగాణలో మున్సిపల్ ఛైర్మన్లు, వైఎస్ ఛైర్మన్ల ఎన్నికలో తీవ్ర గందరగోళం నడిచింది. పలుచోట్ల ఫిరాయింపులు చోటుచేసుకున్నాయి. అత్యధిక సీట్లు సాధించినా కొన్నిచోట్ల ఎక్స్ ఆఫీషియో సభ్యుల మద్దతుతో కాంగ్రెస్ పలు మున్సిపాలిటీలను సొంతం చేసుకుంది. జనగామ, తొర్రూరు తదితర ప్రాంతాల్లో గందరగోళం వల్ల ఎన్నికను వాయిదా వేశారు. ఇకపోతే అధికార కాంగ్రెస్ పార్టీ అన్నిచోట్లా ఆధిక్యం ప్రదర్శించింది. హంగ్ ఏర్పడిన చోట్ల పైచేయి సాధించింది. సిఎం రేంవత్ ఆదేశాలతో కాంగ్రెస్ వ్యూహాత్మకంగా అడుగులు వేసింది. నిజామబాద్ కార్పోరేషన్ను కైవసం చేసుకుంది. మొత్తం ఏడు మున్సిపల్ కార్పొరేషన్లకు సోమవారం మేయర్, డిప్యూటీ మేయర్ల ఎన్నిక జరిగింది. మెజార్టీ ఛైర్మన్లు, వైస్ ఛర్మన్లు హస్తగతం అయ్యాయి. ఎంఐఎం మద్దతుతో నిజామాబాద్‌లో పాగావేసింది.



త్రిషపై వ్యాఖ్యలకు నయినార్ నాగేంద్రన్

- టీవీకే అధ్యక్షుడు విజయ్‌ను విమర్శించే క్రమంలో నటి త్రిషపై చేసిన వ్యాఖ్యలు దుమారం రేపడంతో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్ క్షమాపణలు తెలిపారు.
- పొరపాటు జరిగింది, చింతిస్తున్నా.. త్రిషపై వ్యాఖ్యలకు నయినార్ నాగేంద్రన్

# పొరపాటు జరిగింది, చింతిస్తున్నా..

చెన్నై:ఫిబ్రవరి16(ప్రజా వీక్షణం)

టీవీకే అధ్యక్షుడు విజయ్ ను విమర్శించే క్రమంలో నటి త్రిష పై చేసిన వ్యాఖ్యలు దుమారం రేపడంతో బీజేపీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్ క్షమాపణలు తెలిపారు. ఎవరినీ బాధ పట్టే ఉద్యేశం తనకులేదని, పొరపాటున ఈ వ్యాఖ్యలు చేశానని, అందుకు చింతిస్తున్నానని చెప్పారు. సోమవారంనాడిక్కడ మీడియాతో ఆయన మాట్లాడుతూ, తన రాజకీయ జీవితంలో ఎప్పుడూ వ్యక్తిగత ఆరోపణలు చేయలేదన్నారు. అయితే ఆరోజు తాను ఆ నిబంధనను అతిక్రమించానని తెలిపారు.

పాలనలో మెరుగైన

# సేవలే లక్ష్యం


-ఆర్టీజిఎస్ ద్వారా సేవల విస్తృతి

-ఎక్స్ వేదికగా సిఎం చంద్రబాబు వివరణ



అమరావతి,ఫిబ్రవరి16(ప్రజా వీక్షణం):

మానవజీవనాన్ని మెరుగుపరిచేందుకు సేవ చేయాలన్నదే తమ లక్ష్యమని సీఎం చంద్రబాబు అన్నారు. పరిపాలనలో వేగాన్ని, వ్యాపార సౌలభ్యాన్ని ఆర్టీజీఎస్ అందిస్తోందని చెప్పారు. ప్రత్యక్షంగా ప్రజల జీవితాల్లో మార్పు తీసుకొస్తోందని చెప్పారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్టు చేశారు.




కాంగ్రెస్ తీరు

# దుర్మార్గం

మండిపడ్డ

కేంద్రమంత్రి బండి

కరీంనగర్,ఫిబ్రవరి16(ప్రజా వీక్షణం):

కరీంనగర్ పట్టణ మేయర్ ఎన్నికల్లో కాంగ్రెస్ అనుసరించిన తీరుపై కేంద్ర మంత్రి, బీజేపీ నేత బండి సంజయ్ కుమార్ కాంగ్రెస్ పార్టీపై తీవ్ర విమర్శలు చేశారు. ప్రజల తీర్పును పక్కనబెట్టి కాంగ్రెస్ కుట్రలకు పాల్పడిందని ఆయన ఆరోపించారు. మున్సిపల్ చైర్మన్ ఎన్నిక విషయంలో అధికారాన్ని దుర్వినియోగం చేసి బీజేపీకి మేయర్ పదవి రాకుండా అడ్డుకుందని మండిపడ్డారు. బీజేపీ బలపడుతున్నందుకే కాంగ్రెస్ భయపడుతోందని అన్నారు. ప్రజల్లో బీజేపీకి పెరుగుతున్న ఆదరణను కాంగ్రెస్ తట్టుకోలేకపోతోందని పేర్కొన్నారు. తాను ప్రధాని నరేంద్ర మోదీకి మాటిచ్చానని, కరీంనగర్‌లో బీజేపీని గెలిపించి తన హామీని నిలబెట్టుకున్నానని తెలిపారు. కరీంనగర్ ప్రజలు ఎప్పటికీ బీజేపీతోనే ఉంటారని, భవిష్యత్తులో కూడా పార్టీ విజయాలను కొనసాగిస్తుందని బండి సంజయ్ పేర్కొన్నారు. బలం లేని చోట కూడా కాంగ్రెస్ కుట్రలకు తెరలేపిందన్నారు. ప్రలోభాలతో కార్పోరేటర్లను వశపరచుకునే ప్రయత్నం చేసిందన్నారు. సిఎం రేవంత్ రెడ్డి నీతిమాలిన పనులను ఆయన తప్పపట్టారు. కాగా, కరీంనగర్ కార్పొరేషన్‌ను బీజేపీ దక్కించుకుంది. 34 మంది కార్పొరేటర్ల మద్దతుతో ఆ పార్టీ నేత కొలగాని శ్రీనివాస్ మేయర్‌గా ఎన్నికయ్యారు. డిప్యూటీ మేయర్‌గా కూడా అదే పార్టీకి చెందిన సునీల్‌రావు అనే వ్యక్తి ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారి అధికారికంగా ఈ విషయాన్ని వెల్లడించారు. మేయర్ పదవిని సాధించేందుకు కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ కీలక పాత్ర పోషించారు.

## శబరిమల తదితర ప్రాంతాల్లో మహిళలకు ప్రవేశం

విచారణకు 9మంది న్యాయమూర్తులతో ధర్మాసనం

ఏప్రిల్ 7 నుంచి ఏప్రిల్ 22 వరకు సుప్రీం విచారణ

న్యూఢిల్లీ,ఫిబ్రవరి16(ప్రజా వీక్షణం):

కేరళలోని శబరిమల అయ్యప్ప ఆలయంలోకి అన్ని వయసుల మహిళలకు ప్రవేశం కల్పిస్తూ 2018లో సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన తీర్పును సమీక్షించాలని కోరుతూ దాఖలైన 67 పిటిషన్లపై త్వరలో విచారణ చేపట్టనున్నట్లు సుప్రీంకోర్టు వెల్లడించింది.



ఇక శరవేగంగా

# నిజామాబాద్ అభివృద్ధి

ప్రత్యేక నిధులతో

ప్రాధాన్యం ఇస్తామన్న మంత్రి ఉత్తమ్

నిజామాబాద్,ఫిబ్రవరి16(ప్రజా వీక్షణం):

నిజామాబాద్ నగర అభివృద్ధికి కట్టుబడి ఉన్నట్లు మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి తెలిపారు. అందుకోసం నిధులు ప్రత్యేక కేటాయించనున్నట్లు చెప్పారు. నిజామాబాద్‌లో ఎంఐఎంతో కలిసి కాంగ్రెస్ మేయర్ పీఠాన్ని దక్కించుకున్న సంగతి తెలిసిందే. మేయర్‌గా ఉమారాణి, డిప్యూటీ మేయర్‌గా సల్మా తహసీన్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌తో కలిసి ఉత్తమ్ మీడియాతో మాట్లాడారు. రహదారులు, అభివృద్ధి విషయంలో ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వబోతోందని చెప్పారు.

నేటినుంచి హైటెక్స్ వేదికగా

# బయో ఏషియా సదస్సు

రెండ్రోజుల పాటు జరుగనున్న అంతర్జాతీయ సదస్సు

సదస్సును ప్రారంభించనున్న సిఎం రేవంత్ రెడ్డి


హైదరాబాద్,ఫిబ్రవరి16(ప్రజా వీక్షణం):



తెలంగాణ ప్రభుత్వం ప్రపంచ స్థాయిలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 23వ బయో ఏషియా 2026 అంతర్జాతీయ సదస్సు ఫిబ్రవరి 17 మంగళవారం నుండి భాగ్యనగరంలో అట్ట హాసంగా ప్రారంభం కానుంది. హైదరా బాద్‌లోని హైటెక్స్ వేదికగా రెండు రోజుల పాటు జరగనున్న ఈ సదస్సును రాష్ట్ర ముఖ్య మంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రారంభించ నున్నారు. ఈ ఏడాది సదస్సును 'టెక్‌బయో అన్‌లీష్డ్ ఏఐ, ఆటోమేషన్, జీవశాస్త్ర రంగంలో వస్తున్న విప్లవాత్మక పరిణామాలు' అనే ప్రధాన ఇతివృత్తంతో నిర్వహిస్తున్నారు.

ప్రభుత్వంపై నమ్మకంతో

# ప్రజల తీర్పు



- పట్టణాల్లో కాంగ్రెస్‌కు ప్రజల భారీ మద్దతు
- రాజకీయాలకు అతీతంగా మధిర అభివృద్ధి
- మధిరలో మీడియాతో డిప్యూటి సిఎం భట్టి

ఖమ్మం,ఫిబ్రవరి16(ప్రజా వీక్షణం):

తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సాధించిన ఘనవిజయంపై ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క హర్షం వ్యక్తం చేశారు. సోమవారం మధిరలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీని భారీ మెజార్టీతో గెలిపించిన ఓటర్లకు ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర చరిత్రలోనే తొలిసారిగా పట్టణాల్లో కాంగ్రెస్‌కు ఈ స్థాయిలో ప్రజలు పట్టం కట్టడం చారిత్రాత్మకమని ఆయన అభివర్ణించారు. అభివృద్ధి, సంక్షేమం , ప్రభుత్వంపై ఉన్న నమ్మకంతోనే ప్రజలు ఈ తీర్పు ఇచ్చారని భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

## ఎఐ సమ్మిట్‌కు భారత్ వేదిక కావడంగర్వకారణం

ప్రపంచ దేశాలకు ప్రధాని మోడీ ఆహ్వానం

న్యూఢిల్లీ,ఫిబ్రవరి16(ప్రజా వీక్షణం):

దేశ రాజధాని ఢిల్లీలోని భారత్ మండపంలో ఏఐ ఇంపాక్ట్ సమిట్ ను నిర్వహిస్తుండడంపై ప్రధాని నరేంద్ర మోదీ హర్షం వ్యక్తంచేశారు. ఏఐ ఇంపాక్ట్ సమిట్‌లో పాల్గొనాల్సిందిగా ప్రపంచ దేశాలకు ఆహ్వానం పలికారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రపంచ దేశాలకు భారత యువత ప్రతిభ, సామర్థ్యం తెలుస్తాయని.. ప్రపంచ అభివృద్ధిలో భారత్ తన సహకారాన్ని మరింత పెంచు కునేందుకు ముందడుగు వేస్తోందన్నారు.

ప్రజావీక్షణం
దినపత్రిక

# ఢిల్లీలో ప్రారంభమైన 'ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్'

ఢిల్లీలో ప్రారంభమైన ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026

80 దేశాల ప్రతినిధులు, 500 మందికి పైగా ఏఐ నిపుణుల హాజరు

ఫిబ్రవరి 19న ప్రధాని మోదీ చేతుల మీదుగా ప్రారంభోత్సవ ప్రసంగం

గ్లోబల్ సౌత్‌లో ఈ స్థాయిలో ఏఐపై సదస్సు జరగడం ఇదే ప్రప్రథమం

ఏఐ ఛాలెంజ్‌ల ఫైనలిస్టులు తమ ఆవిష్కరణలను ప్రదర్శించనున్నారు

దేశ రాజధాని ఢిల్లీ వేదికగా 'ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026' సోమవారం ఘనంగా ప్రారంభమైంది. ఈ సదస్సులో 80కి పైగా దేశాల నేతలు, 500 మందికి పైగా గ్లోబల్ ఏఐ నిపుణులు, సీఈఓలు, పరిశోధకులు పాల్గొంటున్నారు. సమ్మిళిత వృద్ధి, సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనలో కృత్రిమ మేధ (ఏఐ) పాత్రపై ఈ సదస్సులో ప్రధానంగా చర్చిస్తారు. గ్లోబల్ సౌత్‌లో ఈ స్థాయిలో ఏఐపై సదస్సు జరగడం ఇదే ప్రప్రథమం కావడం విశేషం.ఫిబ్రవరి 20 వరకు ఐదు రోజుల పాటు ఈ సదస్సు కొనసాగుతుంది. ఫిబ్రవరి 19న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభోపన్యాసం చేస్తారు. సమ్మిళిత, బాధ్యతాయుతమైన ఏఐపై భారత్ విజన్‌ను, ప్రపంచ దేశాల సహకారంపై ఆయన తన ప్రసంగంలో దిశానిర్దేశం చేయనున్నారు. ఈ సదస్సులో 20 దేశాల అధినేతలు, 60 మంది మంత్రులు, ఉప మంత్రులు పాల్గొంటున్నారు.ఈ సదస్సులో భాగంగా నిర్వహిస్తున్న 'ఏఐ ఫర్ ఆల్', 'ఏఐ బై హర్', 'యువ ఏఐ' పేర్లతో మూడు గ్లోబల్ ఇంపాక్ట్ ఛాలెంజ్‌లు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. ఈ ఛాలెంజ్‌లకు 60 దేశాల నుంచి 4,650కి పైగా అప్లికేషన్లు రావడం, బాధ్యతాయుత ఏఐ ఆవిష్కరణలలో భారత్ గ్లోబల్ హబ్‌గా ఎదుగుతోందనడానికి నిదర్శనంగా నిపుణులు పేర్కొంటున్నారు. వీటిలో ఫైనలిస్టులుగా ఎంపికైన 70 బృందాలు ఫిబ్రవరి 16, 17 తేదీల్లో భారత్ మండపం, సుష్మా స్వరాజ్ భవన్‌లలో తమ ఆవిష్కరణలను ప్రదర్శిస్తాయి.ఇదే క్రమంలో, ఫిబ్రవరి 18న ఐఐటీ హైదరాబాద్ భాగస్వామ్యంతో 'ఏఐ, దాని ప్రభావం' అనే అంశంపై రీసెర్చ్ సింపోజియం జరుగుతుంది. ఈ కార్యక్రమానికి కేంద్ర ఐటీ శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్, ఎస్టోనియా అధ్యక్షుడు అలర్ కారిస్ హాజరవుతున్నారు. ఈ సింపోజియంలో ప్రపంచవ్యాప్తంగా ప్రఖ్యాత ఏఐ మార్గదర్శకులు, పరిశోధనా సంస్థలు పాల్గొని తమ అభిప్రాయాలను పంచుకోవడం జరుగుతుంది.




# సాగర తీరంలో నౌకాదళ విన్యాసాలు... రేపు విశాఖకు రాష్ట్రపతి ముర్ము

విశాఖలో అంతర్జాతీయ ఫ్లీట్ రివ్యూ.. హాజరుకానున్న రాష్ట్రపతి ముర్ము


70కి పైగా యుద్ధనౌకల ఫ్లీట్‌ను సమీక్షించనున్న సర్వ సైన్యాధ్యక్షురాలు

ఐఎన్ఎస్ విక్రాంత్ యుద్ధనౌక ఈసారి ప్రత్యేక ఆకర్షణ

ఐఎఫ్ఆర్‌తో పాటు మిలాన్, హిందూ మహాసముద్ర సింపోజియం కూడా

మూడు ప్రధాన నౌకాదళ ఈవెంట్లకు భారత్ ఆతిథ్యం ఇవ్వడం ఇదే తొలిసారి

అంతర్జాతీయ ఫ్లీట్ రివ్యూ (ఐఎఫ్ఆర్)లో పాల్గొనేందుకు భారత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము మంగళవారం విశాఖపట్నం రానున్నారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా ఆమె ఈ కార్యక్రమంలో పాల్గొంటారు. సాయుధ దళాల సర్వ సైన్యాధ్యక్షురాలి హోదాలో రాష్ట్రపతి ఈ విన్యాసాలను సమీక్షిస్తారు. అంతర్జాతీయ నౌకాదళ ప్రతినిధులు, యుద్ధనౌకలు, జలాంతర్గాములు, విమానాలు ఒకచోటకి చేరి తమ శక్తిసామర్థ్యాలను ప్రదర్శించడమే ఐఎఫ్ఆర్ ముఖ్య ఉద్దేశం.మంగళవారం రాష్ట్రపతి గౌరవార్థం ఇచ్చే విందుతో ఐఎఫ్ఆర్–2026 కార్యక్రమాలు ప్రారంభమవుతాయి. మరుసటి రోజు విశాఖ తీరంలో ఏర్పాటు చేసిన యాంకరేజ్ ప్రాంతంలో భారత్‌తో పాటు స్నేహపూర్వక దేశాలకు చెందిన సుమారు 70 యుద్ధనౌకల ఫ్లీట్‌ను రాష్ట్రపతి సమీక్షిస్తారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ గవర్నర్ జస్టిస్ ఎస్. అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా పాల్గొంటారు. దేశాల మధ్య సముద్రయాన శక్తిని, సహకారాన్ని, స్నేహాన్ని ప్రదర్శించడమే ఈ కార్యక్రమ లక్ష్యమని భారత నౌకాదళం వివరించింది.ఈసారి ఐఎఫ్ఆర్‌లో 'ఆపరేషన్ సిందూర్' హీరో, పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో నిర్మించిన విమాన వాహక నౌక ఐఎన్ఎస్ విక్రాంత్ ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. 'ఆపరేషన్ సిందూర్' సమయంలో పాకిస్థాన్ నౌకాదళాన్ని కట్టడి చేయడంలో ఈ యుద్ధనౌక వ్యూహాత్మకంగా కీలకపాత్ర పోషించింది. మిత్ర దేశాల నౌకాదళాలు ఈ విమాన వాహక నౌకను సమీపం నుంచి పరిశీలించనున్నాయి.ఈసారి విశాఖ కేవలం ఐఎఫ్ఆర్‌కే కాకుండా మరో రెండు కీలక కార్యక్రమాలకు కూడా వేదికైంది. భారత నౌకాదళం ఆధ్వర్యంలో 13వ ఎడిషన్ మిలాన్–2026, హిందూ మహాసముద్ర నౌకాదళ సింపోజియం సదస్సు కూడా ఇక్కడే జరుగుతున్నాయి. 135కి పైగా దేశాలను మిలాన్ విన్యాసాలకు ఆహ్వానించారు. భారత్ ఈ మూడు ప్రధాన సముద్రయాన కార్యక్రమాలను ఒకేసారి నిర్వహించడం ఇదే ప్రప్రథమం.భారత్‌లో తొలి ఐఎఫ్ఆర్‌ను 2001లో ముంబైలో నిర్వహించగా, అప్పటి రాష్ట్రపతి కేఆర్ నారాయణన్ సమీక్షించారు. రెండోసారి 2016లో విశాఖపట్నంలో నిర్వహించగా, అప్పటి రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ, ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొన్నారు. ఇప్పుడు మూడోసారి జరుగుతున్న ఈ కార్యక్రమం ద్వారా భారత నౌకాదళ శక్తి, అంతర్జాతీయ సంబంధాలు మరింత బలోపేతం కానున్నాయి.




## నేటినుంచి హైటెక్స్ వేదికగా
# బయో ఏషియా సదస్సు

మొదటిపేజీ తరువాయి

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానమైన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ), ఆటోమేషన్ వంటివి లైఫ్ సైన్సెస్ , హెల్త్‌కేర్ రంగాలను ఎలా ప్రభావితం చేస్తున్నాయనే అంశాలపై ఈ సదస్సులో లోతైన చర్చలు జరగనున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముందుగా అంతర్జాతీయ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించి, అనంతరం సదస్సును ఉద్దేశించి ప్రసంగించనున్నారు. ఈ సదస్సులో పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తో పాటు అంతర్జాతీయ స్థాయి నిపుణులు పాల్గొంటారు. పెన్సిల్వేనియా యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ మెడిసన్ ప్రొఫెసర్ ప్రొఫెసర్ బ్రూస్ ఎల్ లెవిన్, ఆమ్జెన్ చీఫ్ సైంటిఫిక్ ఆఫీసర్ డాక్టర్ హోవర్డ్ వై చాంగ్ పాల్గొననున్నారు. వీరితో పాటు 50కి పైగా దేశాల నుండి సుమారు 4,000 మంది ప్రతినిధులు, శాస్త్రవేత్తలు , ఫార్మా దిగ్గజాలు ఈ వేదికపై తమ అభిప్రాయాలను పంచుకోనున్నారు.రెండు రోజుల పాటు జరిగే ఈ సదస్సులో లైఫ్ సైన్సెస్ రంగానికి సంబంధించిన అనేక కీలక అంశాలతో పాటు నెక్స్ట్ జనరేషన్ బయోలాజిక్స్.. ఔషధ తయారీలో వస్తున్న నూతన మార్పులు. ఏఐ / డిజిటల్ ట్రాన్స్‌ఫార్మేషన్.. డేటా అనలిటిక్స్ , ఏఐ సాయంతో రోగ నిర్ధారణ, చికిత్స. తెలంగాణ రైజింగ్ 2047.. 2047 నాటికి తెలంగాణను వరల్డ్–క్లాస్ లైఫ్ సైన్సెస్ ఎకోసిస్టమ్‌గా మార్చే రోడ్‌మ్యాప్. ఆర్ / డీ (పరిశోధన).. గ్లోబల్ హెల్త్ ఇంపాక్ట్ , కొత్త వ్యాధుల చికిత్సకు అవసరమైన మౌలిక వసతులు వంటి వాటిపై చర్చాగోష్టులు నిర్వహించనున్నారు. ఈ సదస్సు ద్వారా హైదరాబాద్ నగరం ప్రపంచ లైఫ్ సైన్సెస్ మ్యాప్‌లో తన స్థానాన్ని మరింత సుస్థిరం చేసుకోనుంది. లైఫ్ సైన్సెస్ రంగంలో సుమారు 9,000 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్, 175కి పైగా ప్రదర్శనకారులు ఈ సదస్సు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నారు. దేశంలోనే అతిపెద్ద 'టెక్‌బయో' హబ్‌గా తెలంగాణను తీర్చిదిద్దడమే లక్ష్యంగా ఈ సదస్సు రూపుదిద్దుకుంది.

మొదటిపేజీ తరువాయి

# ప్రభుత్వంపై నమ్మకంతో ప్రజల తీర్పు

రాష్ట్రంలోని సుమారు 90 నుంచి 95 మున్సిపాలిటీలను కాంగ్రెస్ కైవసం చేసుకోవడం పార్టీ బలాన్ని నిరూపిస్తోందన్నారు. కేవలం గ్రామాల్లోనే కాకుండా పట్టణ ప్రాంతాల్లో కూడా కాంగ్రెస్ అత్యంత బలంగా ఉందని ఈ ఎన్నికల ఫలితాలు స్పష్టం చేశాయన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో పట్టణ కేంద్రాల అభివృద్ధికి ప్రభుత్వం చేసిన కృషికి ఇది నిదర్శనమని ఆయన కొనియాడారు. ముఖ్యంగా ఖమ్మం జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ పార్టీని ఏకపక్షంగా గెలిపించిన ఓటర్లకు ఆయన ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ప్రజలు తమపై ఉంచిన విశ్వాసాన్ని వమ్ము చేయకుండా, ప్రభుత్వం మరింత బాధ్యతగా పనిచేస్తుందని హామీ ఇచ్చారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి వాగ్దానాన్ని అమలు చేసి, పట్టణ ప్రజల రుణం తీర్చుకుంటామని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. భవిష్యత్తు ప్రణాళికల గురించి మాట్లాడుతూ, 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని డిప్యూటీ సీఎం వెల్లడించారు. ఇందుకోసం పారిశ్రామికీకరణ, మౌలిక వసతుల కల్పన , ఉద్యోగాల సృష్టిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. మధిర నియోజకవర్గాన్ని మోడల్ పట్టణంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేకంగా 'డెవలప్మెంట్ కమిటీ'ని ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. 'నో పాలిటిక్స్.. ఓన్లీ డెవలప్మెంట్ అనే నినాదంతో ముందుకు సాగుతామని, ఈ విజయంలో కీలక పాత్ర పోషించిన నాయకులకు, కార్యకర్తలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

మొదటిపేజీ తరువాయి

## ఇక శరవేగంగా
# నిజామాబాద్ అభివృద్ధి

తెలంగాణలో నిజామాబాద్ ఓ గొప్ప నగరంగా అభివృద్ధి చెందాలని, కాంగ్రెస్ ప్రభుత్వం అందుకు కృషి చేస్తుందని మహేశ్‌కుమార్ గౌడ్ తెలిపారు. నిజామాబాద్ నగర మేయర్ పీఠం కాంగ్రెస్ పార్టీ చేజిక్కించుకోవడం అభివృద్ధికి సంకేతమని అన్నారు. మూడు ఓట్ల తేడాతో మేయర్, డిప్యూటీ మేయర్ పదవులను కాంగ్రెస్ పార్టీ గెల్చుకుందన్నారు. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో నిజామాబాద్ నగర పాలక సంస్థలో బీజేపీ 28 సీట్లు కైవసం చేసుకుంది. కాంగ్రెస్ పార్టీ 17, ఎంఐఎం 14, బీఆర్ఎస్ పార్టీ 1 గెలుచుకున్నాయి. నగర మేయర్ పీఠం దక్కాలంటే.. మ్యాజిక్ ఫిగర్ 31 రావాల్సి ఉంటుంది. అంటే.. మ్యాజిక్ ఫిగర్‌కు మూడు అడుగుల దూరంలో బీజేపీ నిలిచిపోయింది. అలాంటి వేళ అధికార కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు వ్యూహాత్మకంగా అడుగులు వేశారు. ఎంఐఎంను తమ దారికి తెచ్చుకున్నారు. అలాగే బీఆర్ఎస్ నుంచి గెలిచిన ఒక అభ్యర్థి కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. దాంతో నిజామాబాద్ మేయర్ పీఠం కాంగ్రెస్ పార్టీ ఖాతాలో పడింది. దాంతో నగర మేయర్‌గా ఉమారాణి పేరును ఖరారు చేశారు. అయితే బీజేపీని ఓడించేందుకు బీఅర్ఎస్, కాంగ్రెస్, ఎంఐఎం పార్టీలు ఒకటయ్యాయని ఎంపి ధర్మపురి అర్వింద్ మండిపడ్డారు కాళేశ్వరం, ఈ కార్ రేసింగ్ తదితర కేసుల్లో బీఆర్ఎస్ పార్టీ అధినేతలు కేసీఆర్, కేటీఆర్‌లను సీఎం రేవంత్ రెడ్డి ఎందుకు కాపాడుతున్నారో ఈ రోజు అర్థమైందమన్నారు. ఇందూరులో బీజేపీని ఓడించడానికి అనైతిక పొత్తుకు శ్రీకారం చుట్టారంటూ వారిపై నిజామాబాద్ ఎంపీ అర్వింద్ నిప్పులు చెరిగారు. బీజేపీ ఓటమిలో కాంగ్రెస్ రంగు పూసుకుని తిరిగే పోలీసుల హస్తం కూడా ఉందని ఈ సందర్భంగా ఆరోపించారు. ఈ ఐదేళ్ల పదవి పూర్తయ్యే లోపు ఈ ఫలితాన్ని రివర్స్ చేసి చూపిస్తామని ఆయన శపథం చేశారు. అయితే ఈ మున్సిపల్ ఎన్నికల్లో నైతిక విజయం తమదేనని ప్రకటించారు. ఈ టర్మ్ అయ్యేలోపు కార్పొరేషన్‌ను బీజేపీ కైవసం చేసుకుంటుందని ఎంపీ అర్వింద్ స్పష్టం చేశారు.

మొదటిపేజీ తరువాయి

# మున్సిపల్ చైర్మన్ ఎన్నికల పరిశీలకులను ప్రకటించిన కేటీఆర్

కాంగ్రెస్ అరాచకాల నేపథ్యంలో స్థానిక నాయకత్వానికి అన్ని విధాలా అండగా నిలబడేందుకు, ఎన్నికల ప్రక్రియను సమర్థవంతంగా పర్యవేక్షించేందుకు పార్టీ తరఫున సీనియర్ నాయకులను ప్రత్యేక ఇంఛార్జిలుగా పంపుతున్నట్లు ప్రకటించారు.కేటీఆర్ ఆదేశాల మేరకు పార్టీ సీనియర్ నేతలు వెంటనే తమకు కేటాయించిన మున్సిపాలిటీలకు బయలుదేరి వెళ్లారు. రేపు ఎన్నికలు జరగనున్న 8 మున్సిపాలిటీల్లో బీఆర్ఎస్ స్పష్టంగా ఛైర్మన్ పీఠాలను గెలుచుకునే అవకాశం ఉన్నందున, ఈ ఎన్నికలను పార్టీ అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్నది. 8 పట్టణాలకు సీనియర్ నేతలను ఇంఛార్జిలుగా నియమించారు.

**మున్సిపాలిటీల వారిగా ఎన్నికల పరిశీలకులు..**

తొర్రూర్ : ఎమ్మెల్సీ మధుసూదనాచారి, పెద్ది సుదర్శన్ రెడ్డి, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్
జనగామ : బండ ప్రకాశ్ (శాసన మండలి డిప్యూటీ చైర్మన్), ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డిక్యాతన్ పల్లి : ఎమ్మెల్యే కోవ లక్ష్మిఖానాపూర్ : ఎమ్మెల్యే అనిల్ జాదవ్ఇంద్రేశం : ఎమ్మెల్యే ప్రభాకర్ రెడ్డి, యాదవ రెడ్డి ఎమ్మెల్సీఇబ్రహీంపట్నం : ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజుకాగజ్ నగర్ : జోగురామన్నజహీరాబాద్ : ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి

## పాలనలో మెరుగైన
# సేవలే లక్ష్యం

మొదటిపేజీ తరువాయి

1990లో బిల్ గేట్స్‌ను కలిసినప్పుడు సాంకేతికత ద్వారా పౌరసాధికారత సాధ్యమనే స్ఫూర్తి వచ్చింది. నాటి ఆలోచనలే ఇవాళ టెక్నాలజీ ఆధారిత పరిపాలనకు బాటలు వేశాయి. ఆర్టీజీఎస్ ద్వారా ఇవాళ పలు కార్యక్రమాల ప్రదర్శన సంతోషంగా ఉందని చంద్రబాబు పేర్కొన్నారు. మరోవైపు ఏపీ ప్రభుత్వంతో భాగస్వామ్యానికి గేట్స్ ఫౌండేషన్ చూపుతున్న నిబద్ధతకు ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అభినందనలు తెలిపారు. విద్య, ఆరోగ్యం, వ్యవసాయ రంగాల బలోపేతానికి గేట్స్ ఫౌండేషన్ భాగస్వామ్యం సంతోషంగా ఉందన్నారు. సమగ్ర స్థిర అభివృద్ధి కోసం ఫౌండేషన్ సహకారానికి రాష్ట్ర ప్రభుత్వం ఎదురు చూస్తోందని పవన్ తెలిపారు. సీఎం చంద్రబాబుతో కలిసి బిల్ గేట్స్‌కు ఆత్మీయ స్వాగతం పలకడం ఆనందంగా ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్ పర్యటనకు వచ్చిన గేట్స్ ఫౌండేషన్ వ్యవస్థాపక ఛైర్మన్ బిల్‌గేట్స్ ముఖ్యమంత్రి చంద్రబాబుతో కలిసి సచివాలయంలోని రియల్‌టైమ్ గవర్నెన్స్ కమాండ్ సెంటర్‌ను సోమవారం సందర్శించిన సంగతి తెలిసిందే. ఆర్టీజీఎస్ కేంద్రం నుంచి పాలనలో టెక్నాలజీ వినియోగాన్ని ఆయన పరిశీలించారు. రియల్ టైమ్ గవర్నెన్స్ ద్వారా పౌర సేవల్ని వేగంగా అందిస్తున్న తీరు, ఫలితాలను గేట్స్‌కు ఈ సందర్భంగా చంద్రబాబు వివరించారు.

మొదటిపేజీ తరువాయి

# శబరిమల తదితర ప్రాంతాల్లో మహిళలకు ప్రవేశం

పలు మతపరమైన ప్రదేశాలలో మహిళల ప్రవేశంపై నిషేధానికి సంబంధించి మార్చి 14లోపు లిఖితపూర్వక నివేదికలు సమర్పించాలని ఆయా రాష్ట్రాల ప్రభుత్వాలు, ఆలయ నిర్వాహకులకు సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ అంశంపై విచారణ చేపట్టేందుకు 9 మంది న్యాయమూర్తులతో కూడిన ధర్మాసనాన్ని ఏర్పాటుచేస్తున్నట్లు వెల్లడించింది. ఈ పిటిషన్లపై విచారణ చేపట్టడానికి ఏప్రిల్ 7 నుంచి ఏప్రిల్ 22 వరకు రెండు వారాల సమయం కేటాయిస్తున్నట్లు అత్యున్నత న్యాయస్థానం ప్రకటించింది. ఈ అంశంపై ఏప్రిల్ 7న ఉదయం 10.30 గంటలకు విచారణ ప్రారంభమవుతుందని తెలిపింది. శబరిమలతో పాటు దర్గాలు, మసీదుల్లోకి ముస్లిం మహిళల ప్రవేశం, ఇతర మతస్థుల్ని పెళ్లాడే పార్సీ మహిళలకు మతపరమైన ప్రాంగణాల్లోకి ప్రవేశం లేకపోవడం వంటి అంశాల పైనా విచారణ జరపనుంది. 2019లో అప్పటి భారత ప్రధాన న్యాయమూర్తి ఎస్ఏ బోబ్డే ఏర్పాటుచేసిన 9 మంది న్యాయమూర్తుల ధర్మాసనం సమీక్ష పిటిషన్ల నిర్వహణను ఇప్పటికే నిర్ణయించిందని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ పేర్కొన్నారు. అయితే కొవిడ్ కారణంగా ఈ అంశంపై విచారణలను అకస్మాత్తుగా రద్దు చేయాల్సి వచ్చిందన్నారు. దాదాపు ఐదేళ్ల తర్వాత మరో కొత్త ధర్మాసనంతో దీనిపై విచారణ జరపనున్నట్లు తెలిపారు.

మొదటిపేజీ తరువాయి

# ఎఐ సమ్మిట్‌కు భారత్ వేదిక కావడం గర్వకారణం

సైన్స్ అండ్ టెక్నాలజీలో భారత్ వేగంగా వృద్ధి చెందుతుందనడానికి ఈ కార్యక్రమం నిదర్శనమన్నారు. గ్లోబల్ సౌత్‌లో నిర్వహిస్తున్న ఈ మొదటి ప్రధాన అంతర్జాతీయ ఏఐ సమిట్ మన దేశంలో జరుగుతుండడం గర్వకారణమన్నారు. సర్వజన హితాయ, సర్వజన సుఖాయ' అనే ఈ సదస్సు థీమ్‌పై మోదీ మాట్లాడుతూ.. ప్రపంచదేశాల పురోగతి కోసం కృత్రిమ మేధస్సును ఉపయోగించుకోవడంలో మన ఉమ్మడి నిబద్ధతను ఇది ప్రతిబింబిస్తుందన్నారు. ఈ సమిట్ వల్ల డిజిటల్ సదుపాయాల కల్పన, శక్తిమంతమైన స్టార్టప్‌ల ఏర్పాటు, అత్యాధునిక పరిశోధనలు వంటి పలు అభివృద్ధి కార్యక్రమాల్లో భారత్ బాధ్యత మరింత పెరగనుందన్నారు. ఇప్పటికే ఆరోగ్య సంరక్షణ, విద్య, వ్యవసాయం, పాలన వంటి అనేక రంగాల్లో ఏఐ కీలక పాత్ర పోషిస్తుందన్నారు. నేటినుంచి 20వ తేదీ వరకు దిల్లీలో జరగనున్న ఈ సదస్సుకు 45కు పైగా దేశాల ప్రతినిధులు హాజరుకానున్నారు. ఆయా దేశాలు తమ ఏఐ అజెండాలను నిర్వచించుకోనున్నాయి. మన ప్రతిభను ప్రదర్శించడం, డిజిటల్ పబ్లిక్ మౌలిక సదుపాయాలను విస్తరించడం, విస్తృతం అవుతున్న అంకుర సంస్థల ఎకోసిస్టమ్‌ను ప్రపంచానికి పరిచయం చేయడం ఈ సదస్సు ఉద్దేశం.

మొదటిపేజీ తరువాయి

# హంగ్ మున్సిపాలిటీల్లో చక్రం తిప్పిన హస్తం

ఏడు కార్పోరేషన్లలో ఐదింటిని దక్కించుకున్న కాంగ్రెస్, కొత్తగూడెంలో సిపిఐకి మద్దతు ప్రకటించింది. కరీంనగర్ పీఠంపై జెండా పాతిన బిజెపి నిజామాబాద్‌లో ఖంగు తింది. కరీంనగర్, నిజామాబాద్,రామగుండం, మహబూబ్‌నగర్, నల్లగొండ, మంచిర్యాల, కొత్తగూడెం కార్పొరేషన్లకు మేయర్, డిప్యూటీ మేయర్లను ఎన్నుకున్నారు. ఆయా కార్పొరేషన్లలో ఎన్నికైన వారి వివరాలు ఈ విధంగా ఉన్నాయి. కరీంనగర్ మేయర్ పీఠాన్ని బీజేపీ కైవసం చేసుకుంది. మేయర్: కొలగాని శ్రీనివాస్ (బీజేపీ),డిప్యూటీ మేయర్: వై.సునీల్ రావు (బీజేపీ) ఎన్నియ్యారు. నిజామాబాద్ కార్పొరేషన్ మేయర్: ఉమారాణి (కాంగ్రెస్), డిప్యూటీ మేయర్: సల్మాతాహిన్ (ఏఐఎంఐఎం) ఎన్నికయ్యారు. ఇక్కడ ఎంఐఎం మద్దతుతో నిజామాబాద్‌పై పాగా వేశారు. నిజానికి బిజెపి మెజార్టీ సీట్లు సంపాదించిన లాభం లేకుండా పోయింది. రామగుండం కార్పొరేషన్‌లో మేయర్: మహంకాళి స్వామి (కాంగ్రెస్), డిప్యూటీ మేయర్: పాతిపల్లి ఎల్లయ్య (కాంగ్రెస్)లు ఎన్నియ్యారు. నల్గొండ కార్పొరేషన్ మేయర్: ముర్రి చైతన్య శ్రీనివాసరెడ్డి (కాంగ్రెస్), డిప్యూటీ మేయర్: మహమ్మద్ అష్రఫ్ అలీ అమర్ (ఏఐఎంఐఎం)లు ఎన్నికయ్యారు. మంచిర్యాల కార్పొరేషన్ మేయర్: ధరణి మధుకర్ (కాంగ్రెస్), డిప్యూటీ మేయర్: సల్ల రమ్య మహేశ్ (కాంగ్రెస్) ఎన్నికయ్యారు. కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్: మూడ్ గణెశిశ్ (సీపీఐ)డిప్యూటీ మేయర్: సిరిపురపు లలిత కుమారీ (కాంగ్రెస్) ఎన్నికలయ్యారు. మేయర్, డిప్యూటీ మేయర్ పదవులుపై సీపీఐ, కాంగ్రెస్ ఒప్పందం చేసుకున్నాయి. మహబూబ్‌నగర్ కార్పొరేషన్ మేయర్గా గుమల్ మమత (కాంగ్రెస్), డిప్యూటీ మేయర్: ఎం సురేందర్ రెడ్డి (కాంగ్రెస్) ఎన్నికయ్యారు. ఇకపోతే హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా 11 మున్సిపాలిటీల్లో చైర్మన్, వైస్ చైర్మన్ఎన్నికలు వాయిదా పడ్డాయి. పలుచోట్ల బీఆర్ఎస్, బీజేపీ సభ్యులు ప్రమాణ స్వీకారోత్సవానికి గైర్హాజరయ్యారు. దీంతో కోరం లేక పాలకమండలి ఎన్నికను వాయిదావేస్తున్న ట్లు అధికారులు ప్రకటించారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్, ఇంద్రేశం, భద్రాద్రికొత్తగూడెం జిల్లా ఇల్లందు, జనగామ, పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్, నిర్మల్ జిల్లా ఖానాపూర్, మంచిర్యాల జిల్లా క్యాతనపల్లి, ఇబ్రహీం పట్నం, ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్, మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ బల్దియాలో చైర్మన్, వైస్ చైర్మనే పేర్లు ఇంకా ఖరారు కాలేదు. ఖానాపూర్ మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక కోరం లేకపోవడంతో వాయిదా పడింది. 12 మంది కౌన్సిలర్లకు గాను కాంగ్రెస్ పార్టీకి చెందిన ముగ్గురు, ఒక్క ఇండి పెండెంట్ కౌన్సిలర్ మాత్రమే సమావేశానికి హాజరై ప్రమాణ స్వీకారం చేశారు. మిగతా నలుగురు బీజేపీ సభ్యులు, నలుగురు బీఆర్ఎస్ కౌన్సిలర్లు గైరాజరయ్యారు. దీంతో కోరం లేక ఎన్నికలు వాయిదా వేశారు. బీజేపి, బీఆర్ఎస్ ల మధ్య జరిగిన మంతనాలు సయోధ్య కుదరలేదని తెలుస్తోంది. మంచిర్యాల జిల్లా క్యాతనపల్లి మున్సిపల్‌ఆఫీస్ వద్ద తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. కార్యాలయంలోకి దూసుకెళ్లేందుకు కాంగ్రెస్, బీఆర్ఎస్, సీపీఐ శ్రేణులు ప్రయత్నించగా.. పోలీసులు అడ్డుకున్నారు. దీంతో సుమారు రెండు గంటలు సేపు అక్కడ గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. మరోవైపు ప్రమాణ స్వీకారం కార్యక్రమానికి ఉదయం 10.30గంటలు కు మున్సిపల్ కార్యాలయానికి చేరుకోవాల్సిన కౌన్సిలర్లు..12.00 గంటల వరకు కూడా ఎవరు రాలేదు. దీంతో కోరం లేకపోవడంతో చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికను రేపటికి వాయిదా వేస్తున్నట్లు మందమర్రి తహసీల్దార్, ప్రత్యేక అధికారి సతీష్ కుమార్ ప్రకటనలో పేర్కొన్నారు.

## తెలంగాణ జాగృతిలో చేరిన మాజీ ఎమ్మెల్యే కావేటి సమ్మయ్య కుమారుడు మనోహర్...

### కండువా కప్పి జాగృతిలోకి ఆహ్వానించిన సంస్థ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత.

కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ఫిబ్రవరి 16 (ప్రజా వీక్షణం న్యూస్)

హైదరాబాద్ లోని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు, దివంగత మాజీ ఎమ్మెల్యే కావేటి సమయ్య కుమారుడు కావేటి మనోహర్ కుమార్ తెలంగాణ జాగృతిలో చేరారు. సోమవారం నాడు మనోహర్ కుమార్ కు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కండువా కప్పి జాగృతిలోకి ఆహ్వానించారు. ఆయనతో పాటు ఆయన సతీమణి కావేటి సబిత, అనుచరులు కూడా జాగృతిలో చేరారు. ఈ సందర్భంగా కావేటి మనోహర్ మాట్లాడుతూ తెలంగాణ జాగృతిలో చేరడం సంతోషంగా ఉందని తెలిపారు. ముఖ్యంగా సామాజిక తెలంగాణ, సామాజిక న్యాయం సాధన కోసం పోరాటం చేస్తున్న కల్వకుంట్ల కవిత మద్దతునివ్వడం కోసం జాగృతిలో చేరానని స్పష్టం చేశారు. తెలంగాణలో అన్ని వర్గాల అభివృద్ధి కవిత తోనే సాధ్యమవుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. నూతన రాజకీయ పంథాను అవలంబిస్తూ యువతకు ప్రాధాన్యత ఇస్తున్న కవిత ప్రజల్లో మరింత ఆధరణ లభిస్తున్నదని పేర్కొన్నారు. తెలంగాణ జాగృతిని బలోపేతం చేయడానికి తాను పని చేస్తానని స్పష్టం చేశారు.



## అటెండర్ పని చేస్తున్న జూనియర్ అసిస్టెంట్

### కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ...

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ఫిబ్రవరి 16

(ప్రజా వీక్షణం న్యూస్)

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండలంలో 3.00 ఎక్కరాముల ప్రభుత్వ భూమిని పట్టా చేసుకున్న జూనియర్ అసిస్టెంట్.చాలా కాలంగా ఒకే ఆఫీస్ లో పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్ మొద్దు నిద్రలో పై అధికారులు. రెబ్బెన తాసిల్దార్ కార్యాలయాన్ని ఆసిఫాబాద్ పాలనాధికారి సందర్శించిన సమయంలో అకస్మాత్తుగా జూనియర్ అసిస్టెంట్ కూర్చి దగ్గర కనిపించారు.జూనియర్ అసిస్టెంట్ కి కార్యాలయ పనులు నిర్వర్తించ లేని స్థితిలో ఉన్నాడని స్థానికుల నుంచి తీవ్ర విమర్శలు ఉన్నాయి. చదవడం,రాయడం, ఫైల్ లను ముందుకు తీసుకెళ్లాలెని వంటి మౌలిక కార్యాలయ పనులు కూడా చేయడం లేదని ఆరోపణలు ఉన్నాయి. వివరాల్లోకి వెళితే ఆ జూనియర్ అసిస్టెంట్ కిష్టాపూర్ గ్రామానికి చెందిన వారని తండ్రి మరణాన్తరం వి.ఆర్.ఏ గా కారుణ్య నియామకం ద్వారా రెబ్బెన ఎమ్మార్వో ఆఫీస్ లో విధుల్లో చేరని తెలుస్తుంది. తదునంతరం ఆ జూనియర్ అసిస్టెంట్ ఓపెన్ ఇంటర్,డిగ్రీ పూర్తి చేశారని సమాచారం. ఆ తరువాత తెలంగాణ ప్రభుత్వం చాలా కాలంగా ఎమ్మార్వో ఆఫీస్ లలో పని చేస్తున్న వి. ఆర్.ఏ లకు విద్య అర్హతలకు అనుగుణంగా రెగ్యులర్ చేస్తూ ఉద్యోగం ఇచ్చారు.ఈ విధంగా రెబ్బెన ఎమ్మార్వో ఆఫీస్ లో పని చేస్తున్న దుర్గం జానయ్య జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం పొందరని తెలుస్తుంది. అతనికి చదవడానికి కొంచం వచ్చిన, రాయడానికి,ఫైల్స్ మూవ్ చేయడానికి రాదని ప్రజల నుంచి ఆరోపణలు



వస్తున్నాయి.దుర్గం జానయ్య జూనియర్ అసిస్టెంట్ ని చాలా కాలంగా అదే ఆఫీసులో పని చేస్తున్న, అవినీతి అక్రమాలు చేస్తున్నరని ప్రజల నుంచి విమర్శలు వస్తున్న వేరే చోట బదిలి చేయటం లేదనే ఆరోపణలు. శ్రీనివాస్ అనే యువ రైతు మరియు ఆర్టీఐ ఆక్టివిస్ట్ దుర్గం.జానయ్య ఎమ్మార్వో ఆఫీస్ జూనియర్ అసిస్టెంట్ అక్రమంగా రేషన్ కార్డ్ కలిగి ఉన్నారని, చాలా కాలంగా ఒక్క చోటనే పని చేస్తున్నారని, అక్రమంగా ఇన్కమ్ సర్టిఫికెట్స్ తీసుకుంటున్నారని మరియు కిష్టాపూర్ గ్రామంలో 3.00 ఎక్కరాముల ప్రభుత్వ భూమిని పట్టా చేసుకున్నారని ఆసిఫాబాద్ కలెక్టర్ కి ఇంతకు ముందు పూర్తి ఆధారాలతో పిర్యాదు చేసిన పై అధికారులు స్పందించడం లేదని, మొద్దు నిద్రలో ఉన్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రతి సోమవారం జరిగిన ప్రజా గ్రీవెన్స్ లో కలెక్టర్ కి పిర్యాదు చేసారని తెలిపారు. కలెక్టర్ కార్యాలయం లో పిర్యాదు స్థితి గురించి అడిగితే ప్రాసెస్ లో ఉంది అని చెప్తున్నారు కాని నాలుగు నెలలు అయినా దుర్గం జానయ్య పై చర్యలు తీసుకోవడం లేదని తెలిపారు.మొద్దు నిద్ర వీడి ఇప్పటికి అయినా అదికారులు స్పందించి వేగంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## హాస్టల్ వర్కర్ల ప్రాణాలకు రక్షణ కరువు.. పనిచేసిన పనికి జీతాలు కరువు..

### -పట్టించుకోని అధికారులు వర్కర్ల పైన నిర్లక్ష్యం..

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ఫిబ్రవరి 16

(ప్రజా వీక్షణం న్యూస్)

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలోని ఆశ్రమ పాఠశాలలో డైలీవేజ్, అవుట్సోర్సింగ్, శానిటజర్ వర్కర్లకు జీతాలు 8 నెలల నుంచి జీతాలు లేక హాస్టల్లో సమయము తప్పకుండా పనిచేస్తూ, జీతాలు లేకున్నా పనిభారం పెంచుతూ పనిచేయాలని లేకుంటే దూర ప్రాంతాలకు మిమ్మల్ని పంపిస్తామని హాస్టల్ వార్డెన్లు ప్రినిపాల్ వర్కర్లను భయబ్రాంతులకు చేస్తున్నారు. ఆకలి కడుపులతో ఉండి పనిచేస్తున్న వారి పైన కక్షసాధింపులు చిన్న చూపు చూడడం దౌర్జన్యశీగా వెట్టి చాకిరికి పరాకాష్ట. పనిచేసే సమయంలో వీరికి ఏమైనా ప్రమాదం జరిగినప్పుడు పట్టించు కునే నాదుడులేడు. కొన్ని రోజుల క్రితం రౌట సంకపల్లి ఆశ్రమ పాఠశాలలో పనిచేస్తున్న డైలీవెజ్ వర్కర్ బొండాలు చేస్తుంటే బొండాలు పేలి కడాయి లోని నూనె అతని పైన పడడం తో గాయాలు చికిత్స పొందుతూ మరణించడం జరిగింది.ఇతనికి ప్రభుత్వం నుంచి కానీ హాస్టల్ నుంచి గాని ఎలాంటి సహాయ సహకారాలు అందించలేదు. ఇంటికి పెద్దదిక్కు ఐన వర్కర్ ప్రాణాలు కోల్పోయి వారి కుటుంబం రోడ్డున పడ్డారు అలాగే బాలుర ఆశ్రమ పాఠశాల కాగజ్ నగర్ లో కూడా ఇదే విధంగా వంట చేస్తుంటే నూనె మీద పడడంతో వర్కర్లకు మొహం, కాళ్ల పైన పడడంతో గాయాలపాలు అయినారు. వీరికి ఎలాంటి హాస్పటల్, కాని ఎలాంటి ఖర్చులకు గాని కనీసం ఒక్కటి రెండు రోజులు సెలవు ఇవ్వకుండా వారితో పనిచేయించడం వీరి దుశ్చర్యలకు అద్దం పడుతుంది. కొన్ని హాస్టల్లో విద్యార్థులు లేకున్నా పనివారు ఎక్కువగా, విద్యార్థులు ఎక్కువ ఉన్న చోట వర్కర్లు తక్కువున్నారు. వార్డెన్ లు రిజిస్టర్ లో విద్యార్థులు ఉన్న సంఖ్య ఒక్కటి ఉంటాది కానీ హాస్టల్లో కనీసం అందులో సగం మంది కూడా విద్యార్థులు ఉండరు. కానీ వీరు హాస్టల్ కు పూర్తి బియ్యం,సరుకులు తీసుకుని వాటిని పక్కా దారి పట్టిస్తున్నారని విద్యార్థులు వాపోతున్నారు, ఎవరైనా ఎదురు తిరిగితే వారిని బెదిరించడం జరుగుతుంది. వార్డెన్లకు సమయపాలన పాటించడం లేదు, వర్కర్లు ఏ కాస్తా సమయానికి రాకుండా ఉంటే వారి పైన కక్షసాధింపులు చేయడం జరుగుతుంది, ఇంకా కొంత మంది వార్డెన్లు ఏకంగా ఇంటి నుంచి చరవాణి లో






గాయపడ్డ వర్కర్లు



మరణించిన వర్కర్

ఆదేశాలు జారీచేస్తూ హాస్టళ్లను నడిపిస్తున్నారు. ఇలాంటి విషయాలు పై అధికారుల దృష్టికి తీసుక వెళ్లిన ఫలితం లేదు. ఎక్కడ ఎప్పుడు చూసినాకిందిస్థాయి వర్కర్లు నష్టపోతున్నారు. యూనియన్లు పోరాటం చేసిన ఫలితం శూన్యం.కనీసం ప్రాణాలకు అరచేతిలో పెట్టుకుని తమ సొంతవారికి దూరంగా బయటవారికి కోవిడ్ 19 లో పనిచేసిన వర్కర్లకు జీతాలు ఇవ్వకుండా వార్డెన్లు బిల్లు తీసుకొని వీ... షయం పై అధికారుల దృష్టికి ఎన్నిసార్లు తీసుకువెళ్ళిన ఫలితం లేదు.ఇంత జరుగుతున్న ఎవరి చెప్పాలో తెలియక వర్కర్లు నష్టపోతున్నారు. ఇన్ని కష్టాలు పడి ప్రాణాలను పణంగా పెట్టి ఆకలి కడుపులతో పని చేసిన పట్టించుకునే నాథుడు, అధికారులు, ప్రజా ప్రతినిధులు లేకపోవడంతో వర్కర్లు ఏమి చేయలేని నిస్సాయులుగా ఉన్నారు.

## వెబ్ కాస్టింగ్ సెంటర్ ను పరిశీలించిన ఇంచార్జి కలెక్టర్

ప్రజా వీక్షణం న్యూస్ ముస్తాబాద్

మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్ లో ఏర్పాటు చేసిన వెబ్ కాస్టింగ్ సెంటర్ ను ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ సోమవారం పరిశీలించారు. సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ కార్యాలయాల్లో మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ప్రక్రియ కొనసాగుతుండగా, వెబ్ కాస్టింగ్ సెంటర్ ద్వారా పరిశీలించారు.

### వేములవాడ మున్సిపల్ కార్యాలయంలో పరిశీలన

అంతకుముందు వేములవాడ మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ సమావేశ మందిరంలో మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక ప్రక్రియ నిర్వహించే క్రమంలో కౌన్సిల్ సభ్యులు ప్రమాణ స్వీకార కార్యక్రమం చేపట్టారు. ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి హాజరై, సభ్యుల ప్రమాణ స్వీకారాన్ని పరిశీలించారు.



## పారిశుద్ధ్య పనులు పక్కాగా పూర్తి చేయించాలి

### ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్

ప్రజా వీక్షణం న్యూస్ ముస్తాబాద్

మహా శివరాత్రి జాతర సందర్భంగా వేములవాడ పట్టణంతోపాటు జాతర ప్రాంతాల్లో పారిశుధ్య పనులు పక్కాగా పూర్తి చేయించాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. వేములవాడలోని శివార్చన స్టేజీ, ఇతర పరిసర ప్రాంతాల్లో ఇంచార్జి కలెక్టర్ సోమవారం పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో చెత్తాచెదారం నిల్వ ఉండకుండా.. ఎప్పటికప్పుడు తరలించాలని సూచించారు. చెత్త తరలించే ట్రాక్టర్, సిబ్బంది ఎప్పుడూ అందుబాటులో ఉండి సేవలు అందించాలని ఆదేశించారు. మిషన్ భగీరథ అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉండాలని, నీటిని సరఫరా చేయాలని సూచించారు.

### కమాండ్ కంట్రోల్ రూంలో పరిశీలన

భీమేశ్వర సదన్ లో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూంను ఇంచార్జి కలెక్టర్ పరిశీలించారు. శ్రీ భీమేశ్వరస్వామి, బద్ది పోచమ్మ, ప్రసాదం కౌంటర్లు ఇతర ప్రదేశాల్లో భక్తుల రద్దీని పరిశీలించి.. అధికారులకు పలు సూచనలు చేశారు. పరిశీలన సందర్భంగా డీఆర్డీఓ గీత, మిషన్ భగీరథ ఈఈ అన్వర్, తహసీల్దార్ జయంత్ కుమార్, ఎల్డీఎం మల్లికార్జున రావు పాల్గొన్నారు.



## ప్రజావాణి ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలి : కలెక్టర్ ఇలా త్రిపాఠి

ప్రజా వీక్షణం న్యూస్ నిజామాబాద్, ఫిబ్రవరి 16 :

ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రతి సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ప్రధాన సమావేశ మందిరంలో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ, ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో తాత్కాలిక విరామం అనంతరం తిరిగి సోమవారం ఐ.డీ.ఓ.సీ కాన్ఫరెన్స్ హాల్ లో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, ట్రైనీ కలెక్టర్ కరోలిన్ చింగ్తియాన్ మావి, జెడ్పీ డిప్యూటీ సీ.ఈ.ఓ సాయన్నలతో కలిసి కలెక్టర్ ఇలా త్రిపాఠి ప్రజావాణి ఫిర్యాదులు స్వీకరించారు. 34 వినతులు అందగా, వాటి పరిష్కారం కోసం సంబంధిత శాఖల అధికారులకు అందించారు. ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం చేయవద్దని సూచించారు. కాగా, మండల ప్రత్యేక అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ, ఆయా కార్యాలయాల పనితీరును, ప్రభుత్వ పథకాలు, సంక్షేమ కార్యక్రమాల అమలును నిశితంగా పర్యవేక్షించాలని, ఎప్పటికప్పుడు నివేదికలు అందించాలని ఆదేశించారు. ముఖ్యంగా పాఠశాలలు, వసతి గృహాలు, రెసిడెన్షియల్ స్కూళ్ళను సందర్శించి, నాణ్యమైన విద్య, పౌష్టికాహారం అందేలా పర్యవేక్షణ జరపాలన్నారు. బాలికల విద్యాలయాలు, హాస్టళ్ళలో విద్యార్థినుల భద్రతా చర్యలపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించేలా తగు జాగ్రత్తలు సూచించాలన్నారు. ఎక్కడ కూడా భోజనం కలుషితం కాకుండా చూడాలని, విద్యార్థులు ఆరోగ్యాల పరిరక్షణకు అంకితభావంతో కృషి చేయాలన్నారు. ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులు కోసం ఉద్దేశించిన భవిత కేంద్రాల నిర్మాణాలను వేగంగా పూర్తి చేయించాలని ఆదేశించారు.


ప్రజావీక్షణం
దినపత్రిక

# సంపాదకీయం

## పక్కా నీటి ప్రణాళికలే మేలు !

పోలవరం సహా అనేక ప్రాజెక్టులు ఇంకా పూర్తికాలేదు. పోలవరం పన్నెండేళ్లుగా నానుతోంది. నాలుగైదే ళ్లలో పూర్తి చేయాల్సిన ప్రాజెక్ట్ ఇంకా పూర్తి కాలేదు. ఏయేటి కాయేడు నిర్మణ ఖర్చు తడిసి మోపెడు అవుతోంది. రాయలసీమతో సహా అనేక ప్రాజెక్టులు పూర్తి కావాల్సి ఉంది. వాటి గురించి పట్టించుకోకుండా కొత్తగా నల్లమలసాగర్ పేరుతో చంద్రబాబు ఇరు రాష్ట్రాల మధ్య చిచ్చు పెట్టడం వెనక పెద్ద వ్యూహం ఉండివుంటుంది. తెలంగాణలో కూడా కాళేశ్వరంను తిడుతూ రెండేళ్లుగా కాలయాపన చేస్తూ వస్తున్నారు. ఎన్నికల్లో గెలవడంతో తమకు ప్రజల మద్దతు ఉందని చెప్పుకోవడం ద్వారా ప్రజల దృష్టిని మరల్చలేరు. ఇక్కడా అనేక ప్రాజెక్టులు పూర్తి కావాల్సి ఉంది. వాటిని పూర్తి చేసేందుకు రేవంత్ ప్రభుత్వం సంకల్పం ప్రకటించాలి. అంతే తప్ప ఎంతసేపు ఎన్నికలు, ఫలితాలు వంటివాటితో పొంగిపోరాదు. నీటిని వాడుకోవడం ఎలా అన్న దానిపై ఇరు రాష్ట్రాల ప్రభుత్వాలు కసరత్తు చేయాలి. వ్యవసాయరంగంలో విప్లవం సాధించా లంటే నీటి యాజమాన్యం కూడా ముఖ్యం. ఇకపోతే రెండేళ్ల యినా చేయాల్సిన పనులు చేయకుండా ఎంతసేపు జగన్‌ను ఆడిపోసుకోవడంతోనే కలం గడిపేస్తున్నారు. అలాగే 2027 జూన్ కంటే ముందే పోలవరం జాతికి అంకితం చేస్తామన్నది తొలి కార్యాచరణ కావాలి. ఆ ప్రాజెక్టు పూర్తి చేశాక నదుల అనుసంధానం చేపడతా మని, పోలవరం నుంచి నీటిని నల్లమల సాగర్‌కు తీసుకెళ్తామని పేర్కొన్నారు. పెండింగ్ ప్రాజెక్టులపై ప్రాధాన్యత ఇవ్వకుండా లేని ప్రాజెక్టుతో వివదాలు సృష్టించడం, కేంద్రంపై ఒత్తిడి తేవడం వంటివన్నీ అనవసర విన్యాసాలు తప్ప మరోటికాదు. ఇరు రాష్ట్రాల మధ్య సయోధ్యతో ముందుకు సాగాల్సిన అసవరం ఉంది. ఒకప్పుడు తాను ఉమ్మడి ఎపికి సిఎంగా చేశానని గుర్తించి చంద్రబాబు నడవాల్సి ఉంది. అంతేగాక వివాదాస్పదంగావున్న నల్లమల సాగర్ మాట ఇప్పుడు చెప్పడం ద్వారా తెలుగు రాష్ట్రాల మధ్య సఖ్యత, సౌభ్రాతృత్వానికి ఇబ్బందులు తెచ్చుకోవడమే అవుతుంది. అంతేగాక తక్కువ ఖర్చుతో సత్వర ఫలితాలి చ్చే పెండింగ్ ప్రాజెక్టుల్ని పూర్తి చేయడం అవసరం. కానీ అలా జరగడం లేదు. ఇకపోతే ఃూష్ట్రంలో నీటి వినియోగానికి సంబంధించి కొత్త పాలసీ తీసుకువస్తున్నట్టు కథనాలొచ్చాయి. ప్రస్తుతం విద్యుత్ రంగంలో అమల్లో ఉన్న రెగ్యులేటరీ కమిషన్‌లా నీటి వినియోగానికి కూడా ఒక కమిషన్‌ను ఏర్పాటు చేయనున్నట్లు కూడా వచ్చింది. గతంలోనే ప్రపంచబ్యాంకు సాగు నీటికి రెగ్యులేటరీ కమిషన్ ఏర్పాటు చేయాలని ఆదేశించడం, అందులో భాగంగా సాగునీటి మీటర్ల ఏర్పాటుకు ఆనాటి చంద్రబాబు నాయుడు ప్రభుత్వం విఫలయత్నం చేసిన విషయాలు ప్రజల స్మృతి పథం నుండి ఇంకా తొలగిపోలేదు. మళ్లీ అలాంటి ప్రయత్నం చేయడం అన్నదాతలతో సర్కారు కయ్యం తెచ్చుకోవడమే అవుతుంది. నీటి సరఫరాకు చేస్తున్న ఖర్చుకు తగ్గట్టుగా ప్రజల నుండి వసూలు చేసే పన్నులు ఉండేలా చూడటం కూడా పాలసీలో భాగమంటు న్నారు. యూజర్ ఛార్జీలు వసూలు చేయకపోతే భవిష్యత్ నిర్వహణ కష్టం అవుతుందని తొలుత పరిశ్రమల తో ప్రారంభించి, ఆ తరువాత అందరికీ దీనిని విస్తరించే అవకాశం ఉందని సమాచారం. అంతకన్నా ముఖ్యం గా నీటి వినియోగ ప్రాధాన్యతల్లోనూ సర్కారు మార్పులు చేయబోతున్నదని వస్తున్న వార్తలు ఆందోళన కరం. ప్రతి ఎకరాకు సాగునీరందేలా సాగునీటి సంఘాలు కృషి చేయాలని అమరావతిలో నిర్వహించిన నీరు–ప్రగతి, జలహారతి సాగునీటి సంఘాల భాగస్వామ్యం కార్యక్రమంలో సిఎం చంద్రబాబు సూచించడం మంచిదే! అలాగే ఈ ఏడాది నుంచి ఖరీఫ్ సాగును ముందస్తుగా ప్రారంభించాలని తుపానుల వల్ల పంటలు దెబ్బతినకుండా రైతులను సన్నద్ధం చేయాలని, కాల్వలకు మే 15 కల్లా నీటిని విడుదల చేయాలని అధికారులను ఆదేశించడం స్వాగతించదగినది. 'వర్షపు నీటిని భూగర్భ జలాలుగా మార్చుకోవాలని, పరిగెత్తే నీటిని నడిపించాలి, నడిచే నీటిని నిలబెట్టాలి, నిలిచిన నీటిని భూగర్భ జలాలుగా మార్చి భూమినే జలాశయంగా మార్చాలి?' అని చెప్పడం బాగానే వుంది. రాష్ట్రంలో గోదావరి, కృష్ణా, పెన్నా, వంశధార, నాగావళి వంటి 40 నదులు, 38 వేల చెరువులు ఉన్నాయని, వీటన్నిటిలో 1,300 టిఎంసిలకు పైగా నీటిని నిల్వ చేసుకోగలమనీ, ఈ ఏడాది 862 టిఎంసిల నీళ్లు మన జలాశయాల్లో నిల్వ ఉన్నాయని వాస్తవాలు వివరించారు. వరిసాగు తగ్గించి ఎక్కువ మంది రైతులు ఉద్యాన పంటలు, తృణ ధాన్యాల వైపు దృష్టి సారించాలనడం పంటల సరళిని ఏకపక్షంగా మార్చడం మంచిదే అయినా భూములు, నీటి అనుకూలత వంటి విషయలను రైతులతో చర్చిస్తే మంచిది. పంటల సరళిలో మార్పు ఎంతో ప్రణాళికాబద్ధంగా జరగాలే తప్ప హడావుడిగా చేయరాదు. ఆయా పంటల సాగుకు భూసార అనుకూలతలు, నీటిపారుదల సౌకర్యాల లభ్యత లేదా కొరత, పంటల ఉత్పత్తుల వినియోగం, నిల్వ అవకాశాలు, మార్కెట్ పరిస్థితులు వగైరా అనేక అంశాలను శాస్త్రీయంగా అధ్యయనం చేశాకనే నిర్ధారించుకొని, అవసరమైన ప్రోత్సాహకాలిచ్చి అన్నదాత లను అటువైపు మళ్లించవలసి వుంటుంది. కానీ ఆ తరహా ఆలోచనలు, తగిన సన్నాహాలు చేయకుండా ఇటువంటి సలహాలివ్వడం రాష్ట్రానికి శ్రేయస్కరం కాదు. ఇప్పటికే ప్రభుత్వం పంటలకంటే పరిశ్రమలకు, జెన్‌కో అధ్వర్యంలోని జల విద్యుత్ కన్నా కార్పొరేట్లు తెస్తున్న పంప్డ్ హైడ్రో ప్రాజెక్టులకూ మొగ్గు చూపుతున్న వైనం ద్యోతకమవుతోంది. ఈ నేపథ్యంలో కొత్తగా తెచ్చే జల విధానం పై ఎవరికైనా సందేహాలు కలగడం సహజం. ఏదిఏమైనా అంతర్జాతీయ జల సూత్రాల ప్రకారం ప్రజలకు తాగు నీరు, పంటలకు సాగు నీరు, జల విద్యుత్, ఆ తరువాతనే పరిశ్రమలు, ఇతర అవసరాలనే ప్రాధాన్యత క్రమానికి లోబడి ప్రభుత్వం వ్యవహరించడం సబబుగా ఉంటుంది. ఉన్ననీటి వనరులను వాడుకోవడం, అసవరమైన పంటలను పండించడం, రైతులకు లాభాలు చేకూర్చడం అన్నది ఓ ప్రణాళికా బద్ధంగా సాగాల్సిన విషయం. ఇందకు ప్రణాళికలు రచించి ముందుకు సాగితే మంచిది. అది వ్యవసాయపరంగా విప్లవాత్మకంగా మారుతుందనడంలో సందేహం లేదు.

# సామజిక స్పృహ ఉన్న గొప్ప శాస్త్రవేత్త




అనేకమంది శాస్త్రవేత్తల కృషి ఫలితంగానే ఎన్నో ఆవిష్కరణలు సాధ్యం అయ్యాయి. సైన్స్ పరంగా ప్రపంచం మంచి పురోగతి సాధించింది. అయితే ఆధునిక కాలంలో పలువురు శాస్త్రవేత్తలు తమ తమ పరిశోధనల్లోనే నిమగ్నం అయిపోతూ ఉన్నారు.. సమకాలీన సమస్యలపై కొద్ది మంది మాత్రమే స్పందిస్తూ వున్నారు.. అటువంటి వారిలో మేఘ నాథ్ సాహా ఒకరు.ప్రస్తుతం బంగ్లాదేశ్‌లో భాగమైన ఢాకాలోని సియోర్‌తలి గ్రామంలో 1893 అక్టోబరు 6న, అయిదుగురి పిల్లల్లో చివరివాడిగా పుట్టిన మేఘనాథ్ సాహా కేవలం చదువు సాయంతో ఎదిగాడు. చిన్న కిరాణా దుకాణం నడిపే తండ్రి ఆదాయం చాలకపోవడంతో ఆ కుటుంబం తరచు పస్తులతో గడిపేది. సాహాను బడి మానిపించి ఏదైనా పనిలో పెట్టడానికి తండ్రి ప్రయత్నించేవాడు. అయితే సాహా చురుకుదనాన్ని గమనించిన ఉపాధ్యాయులు తండ్రికి నచ్చచెప్పి దాతల సాయంతో ఓ బోర్డింగ్ స్కూలులో చేర్చారు. సాహా చక్కగా చదువుతూ స్కాలర్‌షిప్‌లు సాధించి పై చదవుల కోసం ఢాకా వెళ్లాడు.ఆనాటి బ్రిటిష్ ప్రభుత్వం బెంగాల్‌ను విభజించినందుకు నిరసనగా పన్నెండేళ్ల సాహా, గవర్నర్ తమ స్కూలును సందర్శిస్తున్న కార్యక్రమాన్ని స్నేహితులతో బహిష్కరించి డిస్మిస్ అయ్యాడు. మరో స్కూల్లో చేరి అక్కడ కూడా స్కాలర్‌షిప్ సాధించడం విశేషం. కలకత్తా ప్రెసిడెన్సీ కళాశాలలో అతడికి బోధించిన వారిలో ప్రఖ్యాత శాస్త్రవేత్తలు జగదీశ్ చంద్రబోస్, ప్రఫుల్ల చంద్ర రాయ్ ఉండగా, అతడి క్లాస్‌మేట్స్‌లో సత్యేంద్రనాథ్ బోస్, పీసీ మహాలనోబిస్ కూడా శాస్త్రవేత్తలవడం మరో విశేషం.ఎమ్మెస్సీ తర్వాత బ్రిటిష్ ప్రభుత్వం ఉద్యోగం ఇవ్వక పోవడంతో ఉపాధి కోసం ట్యూషన్లు చెబుతూనే పరిశోధనల్లోనిమగ్నమయ్యారు. ఆపై కలకత్తాలో అధ్యాపకుడిగా చేరిన ఆయన ఖగోళ భౌతిక శాస్త్రంపై పట్టు సాధించారు. సూర్యకాంతి గాజు పట్టకం ద్వారా ప్రసరించినప్పుడు ఏర్పడే వర్ణపటం (స్పెక్ట్రమ్ ) ఎందుకు ఏర్పడుతుందో చెబుతూ అయనీకరణ సూత్రాన్ని ప్రతిపాదించారు. దీని వల్ల సూర్యుని ఉష్ణోగ్రతలు, సాష్టవం, సంయోజనం లాంటి ధర్మాలను విశ్లేషించారు. ఫెలో ఆఫ్ రాయల్ సొసైటీ (లండన్) గా ఎన్నికయ్యారు. అలహాబాదు విశ్వవిద్యాలయంలో భౌతికశాస్త్ర ఆచార్యుడిగా ప్రొఫెసర్‌గా వర్ణపట విజ్ఞానం (స్పెక్ట్రాస్కోపీ ), అయనావరణంపై పరిశోధనలు చేశారు. సూర్యకిరణాల బరువును, వత్తిడిని కనిపెట్టే పరికరాన్ని రూపొందించారు. ఇంకా పురాతన శిలలు, సూర్యుని నుంచి వెలువడే రేడియో తరంగాలు, రేడియో ధార్మికతలపై కూడా పరిశోధనలు చేశారు. కలకత్తా విశ్వవిద్యాలయంలో న్యూక్లియర్ ఫిజిక్స్ (కేంద్రక భౌతికశాస్త్రం) విభాగాన్ని ప్రారంభించారు.సాహా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూక్లియర్ ఫిజిక్స్‌ను 1948లో కలకత్తాలో స్థాపించారు. దేశంలో పరమాణు కణాల త్వరణాన్ని పెంచే తొలి యాక్సిలరేటర్ ఆయన పర్యవేక్షణలోనే నిర్మితమైంది. సైన్స్ అండ్ కల్చర్ పత్రికను నడిపారు. ఆయన రాసిన 'ఎ ట్రిటైజ్ ఆన్ హీట్' ఓ ప్రామాణిక పాఠ్యగ్రంథం.1923 లో సాహా అలహాబాదు విశ్వ విద్యాలయంలో ఆచార్యుడయ్యాడు. 1927 లో రాయల్ సొసైటీలో సభ్యత్వం లభించింది. 1938 లోకలకత్తా విశ్వవిద్యా లయానికి వెళ్ళాడు. అక్కడ కలకత్తా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూక్లియర్ ఫిజిక్స్ ను నెలకొల్పి దానికి గౌరవా ధ్యక్షుడిగా ఉన్నారు. 1931- 1955 మధ్య ఏడుసార్లు నోబెల్ బహుమతికి నామినేట్ అయ్యారు. 1951లో స్వతంత్ర అభ్యర్థిగా పార్లమెంటుకు (లోక్‌సభ) ఎన్నికయ్యారు.1956 ఫిబ్రవరి 17 న న్యూఢిల్లీలో మరణించారు. భారతీయ క్యాలెండర్ రిఫార్మ్ కమిటీ చైర్మన్, దామోదర్ వ్యాలీ రివర్ ప్రాజెక్ట్ బ్లూప్రింట్ రూపకర్తగా పని చేశారు. ఆయన పరిశోధనల వల్ల నక్షత్రాల భౌతిక స్థితి గతులను తెలుసు కోవడానికి వీలు పడింది.




## ఎమ్మెల్యేపై తీరును తీవ్రంగా విమర్శించిన మాజీ మంత్రి జోగు రామన్న

**ప్రజా వీక్షణం న్యూస్ ఆదిలాబాద్ :**

ఆదిలాబాద్ మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ అత్యధిక సీట్లు గెలిచినా,ఎమ్మెల్యే పాయల్ శంకర్ కు పట్టింపు లేదని మాజీ మంత్రి జోగురామన్న తీవ్రంగా విమర్శించారు.జిల్లా కేంద్రంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ,మా పార్టీ ఒక స్వతంత్ర అభ్యర్థికి మద్దతు తెలిపిందని,పదవి కోసమో,డబ్బుల ఆశకు లొంగి సహకరించలేదన్నారు.బీజేపీలో ఏ నాయకుడు ఎదగడం ఎమ్మెల్యేకు ఇష్టం లేదని,మున్సిపాలిటీలో 21 పార్టీ అభ్యర్థులు గెలిచినా ఛైర్మన్ పీఠం కోసం మరో ముగ్గురిని కూడగట్టలేదు ఎందుకో అని ఆరోపించారు.తన ఆస్తులు,పెట్టుబడులు కాపాడుకోవడానికే కాంగ్రెస్ కు పదవి అప్పగించారని మండిపడ్డారు.

# సామాన్యుడికే కరీంనగర్ మేయర్ పట్టం..

## మేయర్ గా కొలగాని శ్రీనివాస్..డిప్యూటీ మేయర్ గా సునీల్ రావు

**ప్రజా వీక్షణం న్యూస్ ముస్తాబాద్**



కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ "మేయర్" పదవి సామాన్యుడికే దక్కింది. భారతీయ జనతా పార్టీ పక్షాన మేయర్ అభ్యర్థిగా 2వ డివిజన్ బీజేపీ కార్పొరేటర్ కొలగాని శ్రీనివాస్ పేరును ఖరారు చేసింది. డిప్యూటీ మేయర్ గా మాజీ మేయర్ సునీల్ రావును ఎంపిక చేసింది. పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచంద్రరావు ఈ మేరకు వారి పేర్లను ఖరారు చేస్తూ లేఖపై సంతకం చేశారు.బీజేపీ లీగల్ సెల్ రాష్ట్ర నాయకులు ఆంటోనీ రెడ్డి ఆ లేఖతో కూడిన కవర్ ను తీసుకుని ఈరోజు ఉదయం కరీంనగర్ కు విచ్చేశారు. ఈ నేపథ్యంలో నగరంలోని వి.కన్వెన్షన్ లో బీజేపీ కార్పొరేటర్ల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, బీజేపీ జిల్లా బీజేపీ కరీంనగర్ జిల్లా ఇంఛార్జీ డాక్టర్ గంగిడి మనోహర్ రెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ల సమక్షంలో డా.మనోహర్ రెడ్డి హైకమాండ్ ఖరారు చేసిన పేర్లను కార్పొరేటర్లకు తెలియజేస్తూ వారి అభిప్రాయాలు చెప్పాలని కోరారు. ఈ సందర్భంగా 39వ డివిజన్ కార్పొరేటర్ మాసం గణేశ్ మేయర్ అభ్యర్థిగా కొలగాని శ్రీనివాస్ పేరును ప్రతిపాదించగా, 62వ డివిజన్ కార్పొరేటర్ పెద్దపల్లి శ్రీలేఖ బలపర్చారు. అట్లాగే డిప్యూటీ మేయర్ అభ్యర్థిగా సునీల్ రావు పేరును 29వ డివిజన్ కార్పొరేటర్ సోమిడి వేణు ప్రసాద్ ప్రతిపాదించగా, 51వ డివిజన్ కార్పొరేటర్ భండారి వేణు బలపర్చారు. బీజేపీ సీనియర్ కార్పొరేటర్లు చొప్పరి జయశ్రీ, వాసాల రమేశ్ సహా బీజేపీ కార్పోరేటర్లందరూ కొలగాని శ్రీనివాస్, సునీల్ రావు పేర్లను మేయర్, డిప్యూటీ మేయర్ అభ్యర్థులుగా ఏకగ్రీవంగా ఆమోదిస్తున్నట్లు చప్పట్లతో తమ ఆమోదం తెలిపారు. అక్కడి నుండి నేరుగా ప్రత్యేక బస్సులో కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ కు విచ్చేసిన కార్పొరేటర్లంతా ప్రమాణ స్వీకారం చేశారు.

**వడబోసిన హైకమాండ్**

వాస్తవానికి కరీంనగర్ మేయర్ పదవిపై బీసీ కార్పొరేటర్లంతా ఆశలు పెట్టుకున్నారు. దీనిని దృష్టిలో ఉంచుకున్న జిల్లా నాయకత్వం బీసీ, జనరల్ స్థానాల్లో గెలుపొందిన బీసీ కార్పొరేటర్ల పేర్లను, వారి బయోడేటాను రాష్ట్ర నాయకత్వానికి పంపింది. ఆ జాబితాలో ఉన్న ఒక్కో కార్పొరేటర్ పేరును, పార్టీకి చేసిన సేవలు, ప్రజల్లో ఉన్న పేరును పరిశీలించింది. చివరకు ఏబీవీపీ నుండి రాజకీయ ప్రస్థానం మొదలుపెట్టి కష్టపడి అంచలంచెలుగా ఎదిగిన సామాన్య కార్యకర్త కొలగాని శ్రీనివాస్ పేరును ఖరారు చేసింది.

**షాక్ లో కొలగాని...**

వాస్తవానికి మేయర్ అభ్యర్థి పదవి తనను వరిస్తుందని కొలగాని శ్రీనివాస్ అస్సలు ఊహించలేదు. ఈరోజు ఉదయం బీజేపీ కార్పొరేటర్ల సమావేశంలో పార్టీ జిల్లా ఇంఛార్జీ గంగిడి మనోహర్ రెడ్డి కొలగానిని మేయర్ అభ్యర్థిగా రాష్ట్ర నాయకత్వం ఖరారు చేసిందని తెలియజేయడంతో కొలగాని ఒక్కసారిగా ఆశ్చర్యానికి లోనయ్యారు. కార్పొరేటర్లంతా వచ్చి కొలగానికి అభినందనలు తెలియజేస్తున్న సమయంలోనూ ఆశ్చర్యం, ఆనందంతోపాటు ఆనందంతో చెమర్చిన కళ్లతో అందరికీ ధన్యవాదాలు తెలిపారు. ప్రధాని నరేంద్రమోదీ, జాతీయ అధ్యక్షులు నితిన్ నబిన్, రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రామచంద్రరావు, కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ లకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. సామాన్య కార్యకర్తనైన తనను మేయర్ కు ఎంపిక చేస్తుందని కలలో కూడా ఊహించలేదన్నారు. బీజేపీలో కష్టపడి, విధేయతతో పనిచేస్తే పదవులు వాటంతట అవే వస్తాయనే దానికి తానే నిదర్శనం అని చెప్పారు.37 ఏళ్ల కొలగాని శ్రీనివాస్ 1989 జూన్ కరీంనగర్ జిల్లా తీగలగుట్టపల్లిలో జన్మించారు. ఎంబీఏ, ఎంఎస్ డబ్ల్యూ చేసిన కొలగాని చిన్నప్పటి నుండే ఆర్ఎస్ఎస్ లో శాఖలో చురుకుగా పాల్గొనే వారు. 2013లోనే ప్రాథమిక శిక్షను పూర్తి చేశారు. చిన్ననాటి నుంచే స్వామి వివేకానంద ఆలోచనలతో ప్రభావితమై ఎన్ఎస్ఎస్, ఎన్ వైపీ, ఏక్తా పరిషత్ సంస్థల ద్వారా అనేక సేవా కార్యక్రమాల్లోనూ పాల్గొన్నారు. విద్యార్థి దశ నుండే రాజకీయాల పట్ల ఆసక్తి ఉండేది. 2005 నుండి 2007 వరకు అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ లో పనిచేసి విద్యార్థుల సమస్యలపై పోరాడారు. 2007 నుండి 2009 వరకు భారతీయ జనతా యువ మోర్చాలో పనిచేసి యువజన పోరాటాల్లోనూ పాలు పంచుకున్నారు. 2007 నుండి 2009 వరకు ఎన్ఎస్ఎస్ వలంటీర్‌గా పనిచేసి 2010లో కాకతీయ విశ్వవిద్యాలయం నుండి ఉత్తమ వలంటీర్ అవార్డును అందుకున్నారు. నేషనల్ యూత్ ప్రాజెక్టు చేరి దేశ సేవకు అంకితం కావాలని భావించిన కొలగాని 2009లో అసోంలో జరిగిన నేషనల్ ఇంటిగ్రేషన్ అండ్ పీస్ క్యాంప్ కు హాజరయ్యారు. లక్షద్వీప్, బెంగళూరు, యూపీ, రాజస్తాన్, ఉత్తరాఖండ్, హర్యానా, అండమాన్ నికోబార్ లలో నిర్వహించిన అనేక జాతీయ స్థాయి శిబిరాల్లోనూ పాల్గొన్నారు. యువత మరియు పిల్లలతోపాటు పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాల్లోనూ చురుకుగా పాల్గొనేవారు. ఇప్పటి వరకు 15 సార్లు రక్తదానం చేశారు. 2009 నుండి 2013లో ఏక్తా పరిషత్ కార్యక్రమాల్లో పాల్గొని ఆదివాసీల హక్కుల కోసం పోరాటం చేశారు. కొలగాని సేవలకు గాను 2005 లో భాయిజీ సేవా పురస్కార్, 2010లో ఎన్ఎస్ఎస్ ఉత్తమ వలంటీర్, 2021 కరోనా కాలంలో అందించిన సేవలకుగాను కేంద్ర మంత్రి మనోహర్ లాల్ కట్టర్ చేతుల మీదుగా 'రక్షక్ అవార్డు'లను అందుకున్నారు.ఇక రాజకీయ ప్రస్థానాన్ని పరిశీలిస్తే... 2014 నుండి 2019 వరకు బిజెపి మండల ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. 2020 నుండి 2025 వరకు కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ 1వ డివిజన్ కార్పొరేటర్ గా కొనసాగారు. 2021 లో కరోనా వ్యాక్సిన్ జిల్లా కన్వీనర్ గా, 2023 నుండి 2024 వరకు కరీంనగర్ టౌన్–1 కన్వీనర్ గా, 2024 లో ఎన్ఐఎఫ్ఎఫ్ఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, 2025 లో చొప్పదండి మండల సర్పంచ్ ఎన్నికల ఇన్‌చార్జ్ గా పనిచేశారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ 2వ డివిజన్ కార్పొరేటర్‌గా ఎన్నికయ్యారు.

**రామచంద్రరావుకు బండి సంజయ్ ధన్యవాదాలు**

కరీంనగర్ మేయర్ అభ్యర్థిగా కొలగాని శ్రీనివాస్ పేరును ఖరారు చేయడంపట్ల కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ సంతోషం వ్యక్తం చేశారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రామచంద్రరావుకు ధన్యవాదాలు తెలిపారు. మున్సిపల్ ఎన్నికల్లో రాష్ట్ర నాయకత్వం అందించిన సహకారం, లీగల్ సాయం ఎనలేనిదని పేర్కొన్నారు.

ప్రజావీక్షణం
దినపత్రిక
GENERAL NEWS
17 మంగళవారం, ఫిబ్రవరి 2026
www.prajaveekshanam.in


# రాజస్థాన్ ఫ్యాక్టరీలో అగ్నిప్రమాదం

## ఏడుగురు వ్యక్తుల సజీవ దహనం

**జయపుర,ఫిబ్రవరి16(ప్రజా వీక్షణం):**

రాజస్థాన్‌లో భివాడీలోని ఓ రసాయన ఫ్యాక్టరీ లో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఏడుగురు సజీవ దహనమయ్యారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం తెల్లవారుజామున భివాడీలోని ఓ రసాయన ఫ్యాక్టరీలో ఒక్కసారిగా మంటలు ఎగసిపడ్డాయి. అనంతరం భారీ పేలుళ్లు సంభవించడంతో స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు. ముందుజాగ్రత్త చర్యగా, సమీపంలోని కర్మాగారాల్లో పని చేస్తున్నవారిని ఖాళీ చేయించామన్నారు. ఈ ప్రమాదంలో సజీవదహనమైన ఏడుగురి మృతదేహాలను బయటకు తీసినట్లు అధికారులు పేర్కొన్నారు. మరికొందరు కార్మికులు మంటల్లో చిక్కుకున్నట్లు తెలుస్తోంది. అయితే ఎంతమంది ఉన్నారనే విషయంపై స్పష్టత రావాల్సిఉంది. ప్రమాదంలో రూ.లక్షలు విలువ చేసే వస్తువులు, యంత్రాలు బూడిదయ్యాయన్నారు. ఫ్యాక్టరీలో నిల్వ చేసిన గ్యాస్ సిలిండర్లు పేలడంతో ఈ ప్రమాదం చోటుచేసుకున్నట్లు అనుమానం వ్యక్తంచేశారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. అగ్ని ప్రమాదంలో ఏడుగురు మృతి చెందడంపై ప్రధాని నరేంద్ర మోదీ (ఖఓ ఓనీటతి) విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు. ఈ ఘటనలో గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ ప్రమాదంపై ముఖ్యమంత్రి భజన్ లాల్ శర్మ దిగ్భ్రాం÷-రతి వ్యక్తంచేశారు. ఈ ఘటనలో గాయపడిన వారికి మెరుగైన వైద్య చికిత్స అందించాలని జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు.

# వరాహనది ఉత్తరవాహిని తీరంలో భక్తుల సందడి

## ఏర్పాట్లను పర్యవేక్షించిన స్పీకర్ అయ్యన్న పాత్రుడు

**అనకాపల్లి,ఫిబ్రవరి16(ప్రజా వీక్షణం):**



మహాశివరాత్రిని పురస్కరించుకొని అనకాపల్లి జిల్లా బలిఘట్టంలో పవిత్ర ఉత్తర వాహిని తీరానికి సోమవారం భక్తులు పోటెత్తారు. ఆదివారం రాత్రి జాగరణ చేసిన భక్తులంతా సోమవారం పుణ్యస్నానాలు ఆచరించేందుకు వరాహనది ఉత్తర వాహిని తీరానికి భారీగా విచ్చేశారు. అనంతరం వారంతా బలిఘట్టం బ్రహ్మ లింగేశ్వర స్వామిని దర్శించుకున్నారు. శాసనసభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు స్వయంగా ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు సూచనలు ఇచ్చారు. అనంతరం పుణ్యస్నానాలకు విచ్చేసిన భక్తుల సౌకర్యార్థం అన్నవరం సత్యనారాయణ స్వామి దేవస్థానం వద్ద అన్నపూర్ణ అక్షయపాత్ర ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అల్పాహారాన్ని పంపిణీ చేశారు. అయ్యన్నపాత్రుడు, ఆయన సతీమణి, కౌన్సిలర్ చింతకాయల పద్మావతి స్వయంగా పాల్గొని భక్తులకు అల్పాహారాన్ని వడ్డించారు.

# అహోబిలంలో నేడు కోయిల్ఆళ్వార్ తిరుమంజనం

**నంద్యాల,ఫిబ్రవరి16(ప్రజా వీక్షణం):**

ప్రసిద్ధ వైష్ణవ క్షేత్రం అహోబిలం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించనున్నారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని తిరుమంజనం నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఫిబ్రవరి 17వ తేదీన మంగళవారం నాడు దర్శనాలు నిలిపివేయనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు దర్శనాలు ఉండవని భక్తులు గమనించాలని కోరారు. ఫిబ్రవరి 20వ తేదీ నుంచి బ్రహ్మోత్సవాలు జరగనున్నాయని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం చేస్తున్నట్లు తెలిపారు. దీనిలో భాగంగా ఆలయ గర్భగుడిలో సుగంధ ద్రవ్యాలతో శుద్ధి కార్యక్రమం ఉంటుందని సీఏవో పేర్కొన్నారు.

# విశాఖ బీచ్‌లో విషాదం

## అలల ధాటికి కొట్టుకు పోయి విద్యార్థి మృతి

**విశాఖపట్టణం,ఫిబ్రవరి16(ప్రజా వీక్షణం):**

విశాఖ సాగర తీరంలో ఆదివారం విషాదం నెలకొంది. బీచ్‌లో సరదాగా స్నానానికి దిగిన యువకుడు ప్రాణాలు కోల్పోయాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొమ్మదిలోని గాయత్రి విద్యా పరిషత్ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ చివరి సంవత్సరం చదువుతున్న ఆరుగురు విద్యార్థులు ఆదివారం రుషికొండ బీచ్‌కు వెళ్లారు. రేడిసన్ బ్లూ రిసార్ట్ వెనుక ఉన్న సముద్రతీరంలో ఐదుగురు స్నానానికి దిగారు. వీరిలో పి.అరవింద్ కృష్ణ (21) అలల తాకిడికి ఒక్కసారిగా కొట్టుకుపోయాడు. గమనించిన అతని స్నేహితుడు రాజీవ్.. అరవింద్‌కృష్ణను కాపాడే ప్రయత్నంలో అతను కూడా నీటిలో మునిగిపోయాడు. స్పందించిన బ్లూ బీచ్ లైఫ్ గార్డ్ సిబ్బందితోపాటు బోటింగ్ యాజమాన్యం ఇద్దరినీ రక్షించి ఒడ్డుకు చేర్చారు. అపస్మారక స్థితిలో ఉన్న అరవింద్‌కృష్ణను అంబులెన్స్‌లో స్థానిక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అరవింద్ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి స్వస్థలం రాజమండ్రి. రాజీవ్ అనే విద్యార్థి క్షేమంగా బయటపడటంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. అరిలోవ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# పౌరసేవల తీరు ప్రశంసనీయం

**డేటా సంరక్షణ తదితర అంశాలపై ఆరా**

**ఆర్టీజీఎస్‌ను బాబుతో కలిసి సందర్శించిన గేట్**

**టెక్నాలజీ ఆధారిత సేవలపై బాబు వివరణ**

**ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు బాగున్నాయని ప్రశంసలు**

**అమరావతి,ఫిబ్రవరి16(ప్రజా వీక్షణం):**

డేటా లేక్, వాట్సప్ గవర్నెన్స్ ద్వారా పౌర సేవల్ని సులభతరం చేయడం బాగుందని ఫౌండేషన్ వ్యవస్థాపక ఛైర్మన్ బిల్‌గేట్స్ అభినందించారు. ఆంధ్రప్రదేశ్ అనుసరిస్తున్న విధానాలను పరిశీలించిన గేట్స్ చంద్రబాబును ప్రశంసించారు. రాజధానిలో 30 శాతం గ్రీన్ అండ్ బ్లూ ప్రణాళిక బాగుందంటూ బిల్ గేట్స్ వ్యాఖ్యానించారు. రాజధాని నిర్మాణ తీరును ముఖ్యమంత్రి చంద్రబాబు వివరించగా.. 'గ్రేట్ వర్క్' అంటూ బిల్ గేట్స్ కితాబిచ్చారు.ఆంధ్రప్రదేశ్ పర్యటనలో ఉన్న బిల్‌గేట్స్ ముఖ్యమంత్రి చంద్రబాబుతో కలిసి సచివాలయంలోని రియల్‌టైమ్ గవర్నెన్స్ కమాండ్ సెంటర్‌ను సోమవారం సందర్శించారు. ఆర్టీజీఎస్ కేంద్రం నుంచి పాలనలో టెక్నాలజీ వినియోగాన్ని దగ్గరుండి పరిశీలించారు. రియల్ టైమ్ గవర్నెన్స్ ద్వారా పౌర సేవల్ని వేగంగా అందిస్తున్న తీరు, ఫలితాలను గేట్స్‌కు ఈ సందర్భంగా చంద్రబాబు వివరించారు. డేటాలేక్, అవేర్ 2.0, వాట్సప్ గవర్నెన్స్, సంజీవని ప్రాజెక్టు, రాజధాని అమరావతి ప్రాజెక్టుల గురించి బిల్‌గేట్స్ తెలుసుకున్నారు. ఆర్టీజీఎస్‌లోని డిస్‌ప్లే వాల్స్‌పై ప్రజంటేషన్లను పరిశీలించారు. డేటా లేక్ ద్వారా అన్ని ప్రభుత్వ శాఖలను అనుసంధానిం చామని సీఎం వివరించారు. డేటా లేక్, వాట్సప్ గవర్నెన్స్ ద్వారా పౌర సేవల్ని సులభతరం చేయడం బాగుందని ఈ సందర్భంగా బిల్‌గేట్స్ కితాబిచ్చారు. అవేర్ 2.0 ద్వారా రియల్ టైమ్‌లో సమాచారాన్ని సేకరించి, వేగంగా నిర్ణయాలు తీసుకుంటున్నట్టు గేట్స్‌కు సీఎం చంద్రబాబు తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, పాలసీల అమలుపై ప్రజాభిప్రాయం సేకరిస్తున్న తీరునూ పరిశీలించారు. కీ పర్ఫార్మెన్స్ ఇండికేటర్స్ ద్వారా జీఎస్డీపీ పెరుగుదలను ఎప్పటికప్పుడు అంచనా వేస్తున్నట్టు తెలిపారు. ప్రాపర్టీ రికార్డుల భద్రతకు ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారని బిల్‌గేట్స్ ప్రశ్నించగా.. బ్లాక్ చెయిన్ టెక్నాలజీతో ల్యాండ్ రికార్డులు భద్రపరుస్తున్నామని, భూ రికార్డులపై క్యూఆర్ కోడ్ వంటి విధానాలతో పారదర్శకంగా ఉండేలా చర్యలు తీసుకున్నామని అధికారులు వివరించారు. గేట్స్ ఫౌండేషన్ సహకారంతో చిత్తూరు జిల్లాలో కొనసాగుతున్న సంజీవని ప్రాజెక్టు అమలు గురించి కూడా ఈ సందర్భంగా బిల్‌గేట్స్ ఆరా తీశారు. బ్లడ్ ప్రెషర్, డయాబెటిస్ లాంటి పరీక్షల వివరాలను ఎలా నమోదు చేస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. కుప్పంలో అమలు చేసిన సంజీవని ప్రాజెక్టు చాలా చక్కగా ఉందని అభిప్రాయం వ్యక్తం చేస్తూ 'నైస్' అంటూ కొనియాడారు. ప్రజల డిజిటల్ హెల్త్ రికార్డులను అనుసరించి వారి లైఫ్‌స్టైల్, ఆహారం తదితర అంశాల్లో సలహాలు ఇస్తున్నామని అధికారులు తెలిపారు. ఏఐ వినియోగంతో ప్రజారోగ్య సేవలను మరింత మెరుగు పరిచేలా చూస్తున్నామని సీఎం వివరించారు. అందుకు బిల్‌గేట్స్ 'గ్రేట్' అంటూ కితాబిచ్చారు. ప్రజా రాజధాని అమరావతి నిర్మాణ వివరాలనూ బిల్‌గేట్స్ అడిగి తెలుసుకున్నారు. రాజధాని నిర్మాణ తీరును బిల్ గేట్స్‌కు ముఖ్యమంత్రి వివరించగా.. గ్రేట్ వర్క్ అంటూ కొనియాడారు.




# హలో ఫ్రెండ్...! హౌ ఆర్ యూ..?'

## చంద్రబాబును పలకరించిన గేట్స్

**అమరావతి,ఫిబ్రవరి16(ప్రజా వీక్షణం):**

గేట్స్ ఫౌండేషన్ ఛైర్మన్ బిల్ గేట్స్‌కు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆత్మీయ స్వాగతం పలికారు. సోమవారం ఏపీ పర్యటనకు వచ్చిన బిల్ గేట్స్.. అమరావతిలోని రాష్ట్ర సచివాలయానికి చేరుకున్నారు. సచివాలయం మొదటి బ్లాక్ వద్ద సీఎం చంద్రబాబు , డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ బిల్ గేట్స్‌ను ఆహ్వానించారు. చంద్రబాబును చూడగానే బిల్ గేట్స్ ఆత్మీయంగా పలకరించారు. 'హలో ఫ్రెండ్...! హౌ ఆర్ యూ..?' అంటూ సీఎం చంద్రబాబును అడిగారు. ఆ తర్వాత ముఖ్యమంత్రి.. తన మంత్రివర్గ సహచరులను, సీఎస్ విజయానంద్‌ను బిల్ గేట్స్‌కు పరిచయం చేశారు. ఆపై రియల్ టైమ్ గవర్నెన్స్ సేవలను బిల్ గేట్స్ పరిశీలించారు. ఆపై బిల్ గేట్స్ సహా గేట్స్ ఫౌండేషన్ ప్రతినిధి బృందంతో ముఖ్యమంత్రి, మంత్రులు, వివిధ శాఖల కార్యదర్శులు సమావేశమయ్యారు. రాష్ట్రంలో గేట్స్ ఫౌండేషన్ సహకారంతో విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల్లో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రాజెక్టులను మరింత విస్తరించే అంశంపై సమావేశంలో చర్చించినట్లు తెలుస్తోంది. స్వర్ణాంధ్ర విజన్ 2047 లక్ష్యాలు, ప్రజారోగ్యం, వ్యవసాయం, విద్య తదితర రంగాల్లో చేపట్టిన సంస్కరణలపై ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజెంటేషన్ ఇచ్చారు. మెడ్ టెక్, డయాగ్నస్టిక్స్ సేవలు, సాంకేతిక సాగు సహా తదితర ప్రాజెక్టుల గురించి వివరించనున్నారు సీఎం, అధికారులు. ప్రత్యేకించి గేట్స్ ఫౌండేషన్ సహకారంతో నడుస్తున్న సంజీవని ప్రాజెక్టు గురించి సర్కార్ వివరించనుంది. సమావేశానికి డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రులు నారా లోకేశ్, పయ్యావుల కేశవ్, అచ్చెన్నాయుడు, గొట్టిపాటి రవికుమార్, డోలా బాల వీరాంజనేయ స్వామి, సవిత, అనిత, కొల్లు రవీంద్ర, కందుల దుర్గేశ్, కొలుసు పార్థసారథి, నిమ్మల రామానాయుడు, అనగాని సత్యప్రసాద్, బీసీ జనార్ధన్ రెడ్డి, సత్య కుమార్ యాదవ్, గుమ్మడి సంధ్యారాణి, పొంగూరు నారాయణ హాజరయ్యారు. అలాగే, వివిధ శాఖల విభాగాధిపతులు వర్చువల్‌గా సమావేశానికి హాజరయ్యారు.



# ప్రత్యేక విమనాంలో గన్నవరం చేరుకున్న గేట్స్

## మంత్రులు, అధికారుల ఘన స్వాగతం

**అమరావతి,ఫిబ్రవరి16(ప్రజా వీక్షణం):**

గేట్స్ ఫౌండేషన్ చైర్మన్ బిల్ గేట్స్‌తోపాటు ఆయన ప్రతినిధి బృందం సోమవారం ఉదయం ప్రత్యేక విమానంలో గన్నవరం ఎయిర్‌పోర్ట్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా వారికి ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్‌తోపాటు పలువురు మంత్రులు, ఉన్నతాధికారులు ఘనస్వాగతం పలికారు. అంతకు ముందు పొగ మంచు కారణంగా దాదాపు 15 నిమిషాలపాటు.. బిల్స్ గేట్స్ ప్రతినిధుల బృందం ప్రయాణిస్తున్న విమానం గాల్లోనే చక్కర్లు కొట్టింది. ఏటీసీ అనుమతి ఇవ్వడంతో గన్నవరం ఎయిర్ పోర్టులో విమానం ల్యాండ్ అయింది. ఇక బిల్ గేట్స్ ప్రతినిధి బృందంతోపాటు స్వాగతం పలికిన మంత్రులు, అధికారుల బృందం వెలగపూడిలోని సచివాలయానికి ఎయిర్ పోర్టు నుంచి బయలుదేరారు. సచివాలయం వద్ద ముఖ్యమంత్రి చంద్రబాబు వీరికి స్వాగతం పలకనున్నారు. అనంతరం బిల్ గేట్స్ ప్రతినిధి బృందంతో వారంతా సమావేశం కానున్నారు. గేట్స్ ఫౌండేషన్ సహకారంతో విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల్లో రాష్ట్రప్రభుత్వం చేపట్టిన ప్రాజెక్టులు విస్తరించే అంశంపై వీరంతా చర్చించనున్నారు. ఆ తర్వాత ఆర్టీజీఎస్ కేంద్రానికి చేరుకుని.. పాలనలో టెక్నాలజీ వినియోగాన్ని బిల్ గేట్స్ ప్రతినిధి బృందం పరిశీలించనుంది. రియల్ టైమ్ గవర్నెన్స్ విధి విధానాలు, ఫలితాలను ఈ సందర్భంగా బిల్ గేట్స్‌కు సీఎం చంద్రబాబు సోదాహరణగా వివరించనున్నారు. అలాగే గేట్స్ బృందంతో సీఎం, మంత్రులు, వివిధ శాఖల ఉన్నతాధికారులు సమావేశం కానున్నారు. ఇందులో స్వర్ణాంధ్ర విజన్ 2047 లక్ష్యాలు, ప్రజారోగ్యం, వ్యవసాయం, విద్య తదితర రంగాల్లో చేపట్టిన సంస్కరణలపై సీఎం ప్రజంటేషన్ ఇవ్వనున్నారు. ఏపీ ప్రభుత్వం అమలు చేస్తున్న మెడ్ టెక్, డయాగ్నస్టిక్స్ సేవలు, సంజీవని తదితర ప్రాజెక్టులను బిల్ గేట్స్‌కు సీఎం చంద్రబాబు వివరిస్తారు. బిల్ గేట్స్‌కు చెందిన గేట్స్ ఫౌండేషన్ సహకారంతో సంజీవని ప్రాజెక్ట్ నడుస్తున్న సంగతి తెలిసిందే. ఉండవల్లి సమీపంలోని వ్యవసాయ క్షేత్రంలో బిల్ గేట్స్ బృందం పర్యటించనుంది. అక్కడ డ్రోన్లు, ఏఐ టెక్నాలజీ సహకారంతో చేపట్టే సాగు విధానాన్ని ఈ బృందం పరిశీలించనుంది. ఈ బృందం వెంట సీఎం చంద్రబాబుతోపాటు మంత్రులు, అధికారులు ఉండనున్నారు.



# బిల్గేట్స్ పర్యటనతో ఎపిక పెరిగిన ప్రాధాన్యత

## బిల్‌గేట్స్‌ను స్వాగతం పలకడం ఆనందంగా ఉంది

## ఎక్స్ వేదికగా డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్

**అమరావతి,ఫిబ్రవరి16(ప్రజా వీక్షణం):**

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో గేట్స్ ఫౌండేషన్ చైర్మన్ బిల్‌గేట్స్ పర్యటన రాష్ట్రానికి ప్రాముఖ్యతను తెచ్చిపెట్టింది. ఈ మేరకు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఎక్స్‌లో ట్వీట్ పెట్టారు. అమరావతి పర్యటనలో భాగంగా బిల్‌గేట్స్‌కు.. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో కలిసి ఆత్మీయ స్వాగతం పలకడం ఆనందంగా ఉందని ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో కలిసి బిల్‌గేట్స్‌కు ఆత్మీయ స్వాగతం పలకడం గర్వకారణమని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఆరోగ్యం, విద్య, వ్యవసాయం, పేదరిక నిర్మూలన వంటి రంగాల్లో గేట్స్ ఫౌండేషన్ చేస్తున్న సేవలు విశేషమని పవన్ కళ్యాణ్ కొనియాడారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో గేట్స్ ఫౌండేషన్ భాగస్వామ్యానికి చూపుతున్న నిబద్ధతను పవన్ కళ్యాణ్ ప్రత్యేకంగా అభినందించారు. రాష్ట్ర అభివృద్ధిలో ఈ భాగస్వామ్యం కీలక పాత్ర పోషించబోతోందని పేర్కొన్నారు. విద్యారంగంలో గేట్స్ ఫౌండేషన్ భాగస్వామ్యం విద్యార్థులకు ఆధునిక విద్యను అందించడంలో సహాయపడుతుందని పవన్ కళ్యాణ్ అభిప్రాయపడ్డారు. టెక్నాలజీ ఆధారిత విద్య, డిజిటల్ లెర్నింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత బోధన వంటి విధానాలు విద్యార్థుల నైపుణ్యాలను పెంచడంలో కీలకంగా ఉంటాయని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యా ప్రమాణాలను మెరుగుపరచడంలో కూడా ఈ భాగస్వామ్యం ఉపయోగపడు తుందని చెప్పుకొచ్చారు. ఆరోగ్య రంగంలో గేట్స్ ఫౌండేషన్ సహకారం ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించడంలో కీలక పాత్ర పోషించబోతోందని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. గేట్స్ ఫౌండేషన్ అనుభవం రాష్ట్రానికి ఉపయోగపడుతుందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య సేవలను విస్తరించడం, టెక్నాలజీ ఆధారిత ఆరోగ్య సేవలను అందించడం వంటి అంశాల్లో భాగస్వామ్యం కీలకమని అన్నారు. వ్యవసాయ రంగంలో కూడా గేట్స్ ఫౌండేషన్ భాగస్వామ్యం రైతులకు ఎంతో ప్రయోజనం కలిగిస్తుందని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. టెక్నాలజీ ఆధారిత వ్యవసాయం, డ్రోన్ వినియోగం, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత పంటల విశ్లేషణ వంటి విధానాలు రైతుల ఆదాయాన్ని పెంచడంలో సహాయపడతాయని చెప్పుకొచ్చారు.

# బిల్‌గేట్స్‌కు ఆహ్వానం పలకడం ఆనందం

## పలు రంగాల్లో ఆయనతో చర్చిస్తున్నాం - ఎక్స్ వేదికగా ఐటిశాఖ మంత్రి లోకేశ్ వెల్లడి

**అమరావతి,ఫిబ్రవరి16(ప్రజా వీక్షణం):**



గేట్స్ ఫౌండేషన్ చైర్మన్ బిల్ గేట్స్ ఆంధ్రప్రదేశ్‌లో అడుగుపెట్టారు. ఈ సందర్భంగా సామాజిక మాధ్యమం ఎక్స్‌లో విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్, ఆర్టీజీఎస్ శాఖల మంత్రి నారా లోకేశ్ ఆసక్తికర ట్వీట్ చేశారు. బిల్ గేట్స్‌కు అమరావతి హృదయపూర్వక స్వాగతం పలుకుతోందని ఆయన పేర్కొన్నారు. గన్నవరం విమానాశ్రయంలో బిల్ గేట్స్‌ను సహచర మంత్రులతో కలిసి సాదరంగా స్వాగతించడం ఆనందంగా ఉందని మంత్రి తెలిపారు. గేట్స్ ఫౌండేషన్ చైర్మన్ బిల్ గేట్స్‌తో ఆరోగ్యం, వ్యవసాయం, విద్య, సాంకేతిక ఆధారిత పరిపాలన రంగాల్లో భాగస్వామ్యాలను మరింత బలోపేతం చేసే అంశాలపై సచివాలయంలో చర్చిస్తున్నట్లు లోకేశ్ తెలిపారు. ప్రజలకు పటిష్టమైన, అత్యంత ప్రభావం కలిగించే పరిష్కారాలను అందించేందుకు గేట్స్ ఫౌండేషన్‌తో సన్నిహితంగా పనిచేయడానికి ఆంధప్రదేశ్ ఎదురు చూస్తోందని మంత్రి లోకేశ్ తెలిపారు. గన్నవరం ఎయిర్‌పోర్ట్‌లో సహచర మంత్రులు వంగలపూడి అనిత, అచ్చెన్నాయుడు, సత్యకుమార్ యాదవ్‌లతో కలిసి బిల్ గేట్స్‌ను మంత్రి లోకేశ్ స్వాగతించారు.

# రష్యా నిర్ణయంపైనే బంగారం ధరలు

## డాలర్‌తో వాణిజ్యం కొనసాగితే తగ్గనున్న పసిడి

## అంతర్జాతీయ నిపుణుల వెల్లడి

న్యూఢిల్లీ,ఫిబ్రవరి 16(ప్రజా వీక్షణం):

అంతర్జాతీయ పరిస్థితులు బంగారాన్ని కంట్రోల్ చేస్తున్నాయి. రష్యా రూబుల్‌తో వ్యాపారం కారణంగా పరిస్థితి దిగజారిందని అంటున్నరు. తిరిగి రష్యా డాలర్‌తో వ్యఆరాన్ని పునరుద్ధరిస్తేనే బంగారం రేట్లు దిగి వస్తాయని అంటున్నారు. బంగారం అంటే ఇష్టపడేవారికి పండగలాంటి అంచనాను నిపుణులు వెలువరించారు. ఇప్పుడు 10 గ్రాముల మేలిమి బంగారం ధర రూ.లక్షన్నర పైగా ఉండగా, ఇది రూ.లక్ష లోపునకు రావచ్చని.. అంతర్జాతీయ విపణిలో ఔన్సు బంగారం ధర 5,000 డాలర్ల వద్ద కదలాడుతుండగా, 3,000 డాలర్లకు దిగిరావచ్చని అంచనా వేస్తున్నారు. రష్యా కనుక అమెరికా డాలర్లలో వాణిజ్యాన్ని పునఃప్రారంభించినప్పుడే, ఇది జరుగుతుందని పేర్కొంటున్నారు. అంతర్జాతీయ విపణికి అనుగుణంగా దేశంలో గతేడాది బంగారం, వెండి ధరలు శరవేగంగా దూసుకెళ్లాయి. ఏడాది వ్యవధిలోనే బంగారం ధర 70 శాతానికి పైగా పెరిగి, గత నెలలో 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.1.80 లక్షలకు మించి గరిష్ఠస్థాయిని తాకినా, ప్రస్తుతం రూ.1.59 లక్షల వద్ద ఉంది. అంతర్జాతీయంగానూ ఔన్సు బంగారం ధర 5600 డాలర్లపైకి వెళ్లినా, మళ్లీ ఇప్పుడు 5000 డాలర్ల దగ్గర ట్రేడ్ అవుతోంది. ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధం ప్రారంభించాక, అంతర్జాతీయ అనిశ్చితులు పెరగడంతో, సురక్షితమని భావిస్తూ బంగారంపైకి పెట్టుబడులు వెల్లువెత్తుతుండటమే ధరల వృద్ధికి కారణం. ఆ రెండు దేశాల మధ్య శాంతి చేకూర్చాలని, వచ్చే జూన్ కల్లా యుద్ధాన్ని నిలిపివేయాలనే లక్ష్యంతో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఉన్నారు. ఇప్పటికే రష్యా అధ్యక్షుడు పుతిన్, ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో ఆయన సంప్రదింపులు జరిపారు. రష్యా చమురు కొనకుండా, భారత్ సహా పలు దేశాలపై భారీ సుంకాలు విధించడంతో, రష్యా కూడా దారికి వస్తున్న సూచనలున్నాయి. అమెరికాతో వాణిజ్య సంబంధాలు పునరుద్ధరించుకునేందుకు, అమెరికా డాలర్లలో వాణిజ్యం నిర్వహించేందుకు రష్యా సన్నాహాలు చేస్తున్నట్లు వార్తా ఏజెన్సీ బ్లూమ్‌బర్గ్ తెలిపింది. డాలర్‌కు ప్రత్యామ్నాయ కరెన్సీలు తేవాలన్న బ్రిక్స్ (బ్రెజిల్, రష్యా, భారత్, చైనా, దక్షిణాఫ్రికా) దేశాల సన్నాహాలకు ఇది పెద్ద ఎదురుదెబ్బే. రష్యా కనుక అంతర్జాతీయ వాణిజ్య సెటిల్‌మెంట్లను డాలర్లలో నిర్వహిస్తే, అమెరికా కరెన్సీకి ఊపొస్తుంది. పసిడిపై పెట్టుబడులు మళ్లీ డాలర్‌కు చేరతాయి. అప్పుడు కేంద్రబ్యాంకులూ బంగారం కొనడం ఆపేస్తాయి. అంతర్జాతీయ పసిడి నిల్వల్లో 20? బ్రిక్స్ దేశాల వద్దే ఉన్నాయని అంచనా. బ్రిక్స్ దేశాలతో అనుబంధం ఉన్న దేశాల నుంచే, అంతర్జాతీయ పసిడి ఉత్పత్తిలో 50? వాటా ఉంది. ఇప్పుడీ దేశాలన్నీ బంగారాన్ని ఉత్పత్తి చేస్తున్నా, అతి తక్కువగా మాత్రమే విక్రయిస్తున్నాయి. ధరలు పెరిగేందుకు ఇదీ కారణమైంది. ఇప్పుడు మళ్లీ డాలర్‌కు మద్దతు పెరిగితే, అమెరికా బాండ్లకు గిరాకీ వస్తుంది. అందువల్ల బంగారంపై పెట్టుబడులు ఉపసంహరించడం ప్రారంభిస్తే ఔన్సు ధర 2027 ఆఖరుకు 3,000 డాలర్లకు దిగిరావ్చని సెబీ నమోదిత మార్కెట్ నిపుణులు అనుజ్ గుప్తా, అమిత్ గోయల్ వంటివారు పేర్కొంటున్నారు. ఇదే జరిగితే దేశీయంగా 10 గ్రాముల మేలిమి బంగారం ధర రూ.90,000–1,00,000 వద్ద స్థిరపడొచ్చని అంచనా వేస్తున్నారు.

# శివరాత్రి రాత్రి విషాదం

## రెండు బైకులు ఢీకొని ఇద్దరు మృతి

తిరుపతి,ఫిబ్రవరి 16(ప్రజా వీక్షణం):

శివరాత్రి పండుగ పూట తీవ్ర విషాదం చోటు చేసుకుంది. చిత్తూరు జిల్లా చంద్రగిరి మండలం ఐతేపల్లి వద్ద జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని ఇద్దరు మృతిచెందగా.. మరో ఇద్దరికి గాయాలు అయ్యాయి. మృతులను బోడిగుట్టపల్లికి చెందిన భూపాల్ రెడ్డి (28), యల్లంపల్లికి చెందిన మల్లికార్జున్(24) గా గుర్తించారు. మల్లికార్జున్ ప్రమాద స్థలంలోనే మృతిచెందగా.. చంద్రగిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించే లోపే భూపాల్ రెడ్డి మృతిచెందాడు.మృతదేహాలను తిరుపతి రుయా మార్చురీకి తరలించారు పోలీసులు. అతివేగమే ఈ ప్రమాదానికి ప్రధాన కారణమని ప్రాథమికంగా నిర్ధారించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని చంద్రగిరి ఎస్సై ప్రవల్లిక తెలిపారు. మహా శివరాత్రి పండుగ పూట ఇలాంటి సంఘటన జరగడంతో ఇరు కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు.

# మున్సిపల్ ఎన్నికల్లో ఓట్ల శాతం పెరిగింది

## ఫలితాలపై బిజెపి అధ్యక్షుడు రామచంద్రరావు విశ్లేషణ

హైదరాబాద్,ఫిబ్రవరి 16(ప్రజా వీక్షణం):



తెలంగాణలో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీకి ప్రజల నుండి మంచి ఆదరణ లభించిందని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ రామచందర్ రావు తెలిపారు. ఈ ఎన్నికల్లో పార్టీ ఓట్ల శాతం గణనీయంగా పెరిగిందని తెలిపారు. గతంతో పోలిస్తే ఎక్కువ స్థానాల్లో బీజేపీ విజయం సాధించడం పార్టీ బలోపేతానికి సంకేతమని పేర్కొన్నారు. ముఖ్యంగా కొన్ని ప్రాంతాల్లో బీజేపీ ఎదుగుదలను అడ్డుకునేందుకు ఇతర పార్టీలు అనేక ప్రయత్నాలు చేసినప్పటికీ, ప్రజలు బీజేపీకి మద్దతుగా నిలిచారని రామచందర్ రావు అన్నారు. భైంసాలో బీజేపీ విజయం సాధించకుండా చేయాలని చాలా ప్రయత్నాలు జరిగాయని చెప్పారు. తెలంగాణ వ్యాప్తంగా సుమారు 15 మున్సిపాలిటీల్లో బీజేపీ గట్టిపోటీ ఇచ్చిందని ఆయన వెల్లడించారు. ది రాష్ట్రంలో బీజేపీ ప్రభావం పెరుగుతున్నదానికి నిదర్శనమని రామచందర్ రావు తెలిపారు. భవిష్యత్తులో కూడా ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ, పార్టీని మరింత బలోపేతం చేస్తామని స్పష్టం చేశారు. మున్సిపల్ ఎన్నికల ఫలితాలు తెలంగాణ బీజేపీకి ఉత్సాహాన్ని నింపాయని రామచందర్ రావు పేర్కొన్నారు.

# జెఇఇ మెయిన్ ఫలితాల విడుదల

## వందశాతంతో సత్తా చాటిన ముగ్గరు తెలుగు విద్యార్థులు

న్యూఢిల్లీ,ఫిబ్రవరి 16(ప్రజా వీక్షణం):

దేశ వ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు ఉత్కంఠతో ఎదురుచూస్తోన్న జేఈఈ (మెయిన్) పేపర్–1 ఫలితాలు వచ్చేశాయి. సోమవారం ఉదయం ఫైనల్ కీ విడుదల చేసిన ఎన్‌టీఏ అధికారులు.. తాజాగా ఫలితాలను విడుదల చేశారు. ఈ ఫలితాల్లో తెలుగు విద్యార్థులు సత్తా చాటారు. ఏపీ నుంచి ఇద్దరు, తెలంగాణ నుంచి ఒక విద్యార్థి 100 పర్సంటైల్ స్కోరుతో అదరగొట్టారు. అభ్యర్థులు తమ అప్లికేషన్ నంబర్, పాస్‌వర్డ్‌తో పాటు క్యాప్చా కోడ్ ఎంటర్ చేసి స్కోర్ కార్డులను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.దేశంలో ఎన్ఐటీలు, ట్రిపుల్ ఐటీల్లో బీఈ/బీటెక్ కోర్సుల్లో ప్రవేశాలకు జనవరి 21, 22, 23, 24, 28 తేదీల్లో జేఈఈ మెయిన్ పేపర్ –1 పరీక్ష నిర్వహించిన విషయం తెలిసిందే. జనవరి 29న నిర్వహించిన జేఈఈ మెయిన్ పేపర్–2 ఫలితాలను తర్వాత ప్రకటించనున్నారు. జేఈఈ మెయిన్ పరీక్షలకు దేశ వ్యాప్తంగా 13,55,293మంది రిజిస్టర్ చేసుకోగా.. 13,04,653 మంది (96.26?) హాజరయ్యారు. ఈ ఫలితాల్లో మొత్తంగా 12మంది విద్యార్థులు 100 పర్సంటైల్ స్కోరుతో అదరగొట్టారు. వీరిలో ఏపీ నుంచి నరేంద్రబాబు గారి మహిత్, పసల మోహిత్, తెలంగాణ నుంచి వివాన్ శరద్ మహేశ్వరి ఉన్నారు. మరోవైపు, జేఈఈ మెయిన్ మలి విడత పరీక్షకు దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ కొనసాగుతోంది. మొదటి విడత పరీక్షలో సాధించిన స్కోరుతో సంతృప్తి చెందని వారు రెండో విడత పరీక్షలు రాస్తుంటారు. ఏప్రిల్ 2 నుంచి 9వ తేదీ వరకు జేఈఈ మెయిన్ రెండో విడత పరీక్షలు జరుగుతాయి. ఈ రెండింటిలో ఉత్తమ స్కోరును పరిగణనలోకి తీసుకొని విద్యార్థులకు ర్యాంకులను కేటాయిస్తారు. ఆ తర్వాత సామాజిక వర్గాల వారీగా రిజర్వేషన్లకు అనుగుణంగా మొత్తం 2.50లక్షల మందిని జేఈఈ అడ్వాన్స్‌డ్ రాసేందుకు అర్హత కల్పిస్తారు. జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో సత్తా చాటిన విద్యార్థులకు జోసా కౌన్సిలింగ్ ద్వారా ప్రతిష్ఠాత్మక ఐఐటీల్లో ఇంజినీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తుంటారు.

# చిరంజీవి భుజానికి సర్జరీ

## కోలకుంటున్నానంటూ పోస్ట్

హైదరాబాద్,ఫిబ్రవరి 16(ప్రజా వీక్షణం):

అగ్ర కథానాయకుడు చిరంజీవి భుజానికి సర్జరీ జరిగింది. ప్రస్తుతం ఆయన కోలుకుంటున్నారు. ఈ విషయాన్ని తెలియజేస్తూ ఎక్స్ వేదికగా చిరు పోస్ట్ పెట్టారు. తాను త్వరగా కోలుకోవాలని ప్రార్థించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు.చేతికి పట్టీ ఉండటం గమనించి పలువురు శ్రేయోభిలాషులు నా ఆరోగ్యం గురించి ఆరా తీశారు. నా భుజానికి చిన్న కీ–హోల్ సర్జరీ జరిగింది. ప్రస్తుతం నేను బాగానే కోలుకుంటున్నా. నా దినచర్య సజావుగా సాగుతోంది. ఆర్థోస్కోపీ సర్జన్ డాక్టర్ నితిన్‌కు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నా. సర్జరీ విషయంలో తీసుకున్న జాగ్రత్తలు, ఆయన నైపుణ్యంతో ఆ ప్రక్రియ అంతా సజావుగా, సౌకర్యవంతంగా సాగింది. నా పట్ల మీరు చూపిస్తున్న ప్రేమ, అభిమానం, అందిస్తున్న దీవెనలకు మనసు ఎంతో సంతోషంగా ఉందని ఎక్స్ వేదికగా చిరంజీవి వెల్లడించారు. ఇదిలావుంటే అల్లు శిరీష్ వివాహం సందర్భంగా మొదటి శుభలేఖను చిరంజీవికి అందించారు. అల్లు అరవింద్ దంపతులు, అల్లు శిరీష్ స్వయంగా చిరు ఇంటికి వెళ్లి నూతన వస్త్రాలతో పాటు వివాహ ఆహ్వాన పత్రికను అందించి పెళ్లికి ఆహ్వానించారు. ఈ సందర్భంగా చిరంజీవి చేతికి కట్టు ఉండటం గమనించి పలువురు అభిమానులు ఆందోళన చెందారు. ఆయనకు ఏమైందంటూ ఆరా తీయడం మొదలు పెట్టారు. ఈ క్రమంలో చిరంజీవి స్వయంగా తన ఆరోగ్య పరిస్థితిని వివరిస్తూ పోస్ట్ పెట్టారు.

# రెండు మున్సిపల్ మేయర్ల ఎన్నిక వాయిదా

## నేడు నిర్వహిస్తామని ప్రకటించిన అధికారులు

సంగారెడ్డి,ఫిబ్రవరి 16(ప్రజా వీక్షణం):

జహీరాబాద్, ఇంద్రేశం ఎన్నిక వాయిదా పడ్డాయి. ఇవాళ జరగాల్సిన ఎన్నికలకు అవసరమైన సంఖ్యలో కౌన్సిలర్లు హాజరుకాకపోవడంతో అధికారులు ఎన్నికలను నేటికి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. మంగళవారం ఉదయం 11 గంటలకు ఈ రెండు మున్సిపాలిటీల్లో చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలు నిర్వహించేందుకు జిల్లా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఎన్నికల ప్రక్రియను ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. ఇంద్రేశం మున్సిపాలిటీపై పట్టు సాధించేందుకు బీఆర్ఎస్ పార్టీ బీజేపీ సహకారం తీసుకునే ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. అదే సమయంలో జహీరాబాద్ మున్సిపాలిటీలో స్వతంత్ర కౌన్సిలర్ల మద్దతుతో చైర్మన్ పీఠాన్ని దక్కించుకునేందుకు గులాబీ పార్టీ వ్యూహాలు రచిస్తోంది. మరోవైపు జహీరాబాద్‌లో స్వతంత్రులను తమ వైపు తిప్పుకొనేందుకు కాంగ్రెస్ పార్టీ కూడా చర్యలు చేపడుతోంది. ఈ పరిణామాలతో రెండు మున్సిపాలిటీల్లో రాజకీయ ఉత్కంఠ నెలకొంది. మంగళవారం జరిగే ఎన్నికల్లో ఏ పార్టీకి పీఠం దక్కుతుందనేది ఆసక్తికరంగా మారింది.

# జనగామ మున్సిపల్ ఎన్నికలో హైడ్రామా

- కాంగ్రెస్, బిఆర్ఎస్‌ల పోటాపోటీ నినాదాలు
- హంగ్ ఏర్పడడంతో దక్కించుకునేందుకు ఎత్తులు
- కౌన్సిలర్ ఫాతిమా కిడ్నాప్ అంటూ ప్రచారం
- కాంగ్రెస్ తీరుపై మండిపడ్డ ఎమ్మెల్యే పల్లా

జనగామ,ఫిబ్రవరి 16(ప్రజా వీక్షణం):

తెలంగాణ మున్సిపల్ ఎన్నికల ఫలితాల అనంతరం మున్సిపల్ పీఠాలను దక్కించుకునే క్రమంలో రాజకీయంగా తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ముఖ్యంగా జనగామ మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక సోమవారం నాటకీయ పరిణామాల మధ్య వాయిదా పడింది. మున్సిపల్ కార్యాలయం వద్ద చోటుచేసుకున్న ఆందోళనలు, కౌన్సిల్ హాల్‌లో సభ్యుల మధ్య నెలకొన్న గందరగోళం వల్ల సభ నియంత్రణలో లేదని, అందుకే ఎన్నికను రేపటికి వాయిదా వేస్తున్నట్లు ఆర్డీఓ ప్రకటించారు. జనగామ మున్సిపాలిటీలోని 30 వార్డులకు గానూ ఏ పార్టీకి స్పష్టమైన మెజారిటీ రాకపోవడంతో 'హంగ్' ఏర్పడింది. బీఆర్ఎస్ అత్యధిక సీట్లతో అతిపెద్ద పార్టీగా అవతరించినప్పటికీ, అధికారం దక్కించుకోవడానికి అవసరమైన మ్యాజిక్ ఫిగర్ లేదు. కాంగ్రెస్ పార్టీ కూడా పీఠం దక్కించుకోవడానికి ప్రయత్నిస్తుండటంతో, స్వతంత్ర అభ్యర్థులు ఇప్పుడు కింగ్ మేకర్లుగా మారారు. ఈ నేపథ్యంలోనే కౌన్సిలర్ల మద్దతు కూడగట్టే క్రమంలో తీవ్రస్థాయిలో రాజకీయ ఎత్తుగడలు మొదలయ్యాయి. ఎన్నికకు ముందు జనగామలో కిడ్నాప్ కథనాలు కలకలం రేపాయి. తమ కౌన్సిలర్లను ప్రత్యర్థి పార్టీలు కిడ్నాప్ చేశాయని ఒక వర్గం ఆరోపించగా, పోలీసుల ఒత్తిడితో అక్రమంగా కేసులు పెడుతున్నారని మరో వర్గం నిరసన వ్యక్తం చేసింది. మున్సిపల్ కార్యాలయం వెలుపల వివిధ పార్టీల కార్యకర్తలు భారీగా గుమిగూడి నినాదాలు చేయడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. పోలీసులు లాఠీచార్జ్ చేయాల్సిన పరిస్థితి ఏర్పడటంతో ఆ ప్రాంతమంతా రణరంగాన్ని తలపించింది. ఎన్నిక వాయిదా పడటంపై బీఆర్ఎస్ నేతలు తీవ్రంగా స్పందించారు. తాము విజయం సాధిస్తామనే భయంతోనే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారులపై ఒత్తిడి తెచ్చి ఎన్నికను పోస్ట్‌పోన్ చేయించిందని మండిపడ్డారు. అధికారుల తీరు ప్రజాస్వామ్య విరుద్ధమని, కలెక్టర్ , పోలీస్ విభాగం ఏకపక్షంగా వ్యవహరిస్తున్నాయని వారు ఆరోపించారు. ఎప్పుడు ఎన్నిక నిర్వహించినా గెలిచేది తామేనని ధీమా వ్యక్తం చేశారు.జనగామ మున్సిపల్ చైర్మన్ ఎన్నిక వేళ హైడ్రామా నెలకొంది. 28వ వార్డు బీఆర్ఎస్ కౌన్సిలర్ హాఫీజ్ ఫాతిమాను మున్సిపల్ కార్యాలయం వద్ద పోలీసులు అడ్డుకున్నారు. ఆమె కిడ్నాప్ అయ్యిందని, వారి కుటుంబసభ్యులు ఫిర్యాదు చేశారని తెలిపారు. ఆమెను అడ్డుకునేందుకు పోలీసులు యత్నించారు. విచారణ చేయాలంటూ ఫాతిమాను పోలీస్ స్టేషన్‌కు తరలించేందుకు యత్నించారు. అయితే పోలీసులను జనగామ ఎమ్మెల్యే పల్లా అడ్డుకున్నారు. ఈ క్రమంలో డీసీపీతో వాగ్వాదానికి దిగారు. కాగా, తనను ఎవరూ కిడ్నాప్ చేయలేదని ఫాతిమా స్పష్టం చేసింది. బీఆర్ఎస్ పార్టీలో గెలిచానని.. ఆ పార్టీకే మద్దతు ఇస్తానని పేర్కొన్నారు. అనంతరం కార్యాలయం లోపలికి వెళ్లిపోయారు. కాగా, జనగామ మున్సిపల్ చైర్మన్ ఎన్నికను ఆపాలంటూ కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి వాగ్వాదానికి దిగారు. బీఆర్ఎస్ కౌన్సిలర్ హాఫీజ్ ఫాతిమా హాజరైనా మిస్సింగ్ కేసు నమోదైందంటూ చామల వితండవాదం చేశారు. కోరం సభ్యులు అందరూ హాజరైనందుకు ఎన్నిక ఆపడం కుదరదంటూ అధికారులు చామలకు తేల్చిచెప్పారు. నిబంధనల ప్రకారం కోరం మొత్తం హాజరైన నేపథ్యంలో చైర్మెన్, వైస్ చైర్మన్ ఎన్నికను వాయిదా వేయలేమంటూ ప్రొసీడింగ్ అధికారులు తేల్చిచెప్పారు

# నారాయణపేట చైర్‌పర్సన్‌గా శ్వేతాయాదవ్

నారాయణపేట,ఫిబ్రవరి 16(ప్రజా వీక్షణం):



మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికల్లో చిత్ర విచిత్రాలు చోటు చేసుకుంటున్నాయి. అత్త చేతిలో కోడలు ఓడిపోయిన సంఘటన నారాయణపేట మున్సిపాలిటీలో జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. ఎంపీ డీకే అరుణ 4వ వార్డు కౌన్సిలర్ శ్వేత యాదవ్ (బీజేపీ) కు మద్దతు తెలిపింది. దీంతో మెజారిటీ సభ్యులు కూడా మద్దతు శ్వేత యాదవ్‌కు సపోర్ట్ చేయడంతో మున్సిపల్ చైర్‌పర్సన్‌గా ఎన్నికయ్యారు. అదే సమయంలో స్థానిక ఎమ్మెల్యే పర్ణిక రెడ్డి (డీకే అరుణ కోడలు) మద్దతు తెలిపిన 20వ వార్డు కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ శ్వేత గౌడ్‌కు సరిపడా సభ్యుల బలం లేకపోవడంతో ఓటమి పాలయింది. దీంతో అత్త డీకే అరుణ చేతిలో కోడలు పర్ణిక రెడ్డి ఓడినట్లు అయ్యింది.

# అన్నిరంగాల్లో కృత్రిమ మేధ వినియోగం

- సానుకూల దిశగా ఆలోచిస్తేనూ మేలు
- దుర్వినియోగం చేస్తే దుష్ఫలితాలు తప్పవు
- కేంద్రమంత్రి జితిన్ ప్రసాద్ వెల్లడి- ఎఐ సదస్సుకు భారీగా భద్రతా ఏర్పాట్లు

న్యూఢిల్లీ,ఫిబ్రవరి 16(ప్రజా వీక్షణం):

అన్ని రంగాల్లో కృత్రిమ మేధ వినియోగం రోజు రోజుకూ పెరుగుతోంది. దీనివల్ల అనేక ప్రయోజనాలు ఉన్నప్పటికీ ఏఐను దుర్వినియోగం చేయడం వల్ల తీవ్ర పరిస్థితులు ఏర్పడుతాయని ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ సహాయ మంత్రి జితిన్ ప్రసాద హెచ్చరించారు. ఏఐ వాడకంలో అప్రమత్తత అవసరమని.. దీనిని తప్పుడు సమాచార వ్యాప్తి కోసం వాడితే దేశంలోని ప్రజాస్వామ్య వ్యవస్థ దెబ్బతినే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తంచేశారు. ఢిల్లీలో ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ ప్రారంభం కానున్న నేపథ్యంలో.. నిర్వహించిన ఓ కార్యక్రమంలో కేంద్రమంత్రి మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఏఐ ద్వారా విద్య, వైద్య, వ్యవసాయం, పరిపాలన వంటి అన్ని రంగాల్లో పనులు సులభమవుతు న్నాయని కేంద్రమంత్రి పేర్కొన్నారు. కాబట్టి దేశప్రజలందరూ కృత్రిమ మేధపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. భారత్ వంటి అధిక జనాభా గల దేశాల్లోని ప్రజలకు డిజిటల్ అక్షరాస్యత లేకపోతే సైబర్ నేరాలకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. కాబట్టి కృత్రిమ మేధ వినియోగంపై పాఠశాల స్థాయి నుంచే పిల్లలకు అవగాహన కల్పించాలన్నారు. పాఠ్యాంశాల్లో ఈ సమాచారాన్ని పొందుపరచాలన్నారు. ఇదిలావుంటే దేశ రాజధాని ఢిల్లీ వేదికగా 'ఇండియా– ఏఐ ఇంపాక్ట్ సమిట్' ప్రారంభమైంది.20వ తేదీ వరకు కొనసాగనుంది. ప్రధాని మోదీ ఆహ్వానం మేరకు బ్రెజిల్, ఫ్రాన్స్, స్పెయిన్, స్విట్జర్లాండ్, యూఏఈ తదితర దేశాల నేతలు హాజరుకానున్నారు. 45కుపైగా దేశాల ప్రతినిధులు పాల్గొంటున్నారు. ఈ నేపథ్యంలో అధికారులు పకడ్బందీ భద్రతా ఏర్పాట్లు చేశారు. సదస్సు వేదిక 'భారత్ మండపాన్ని' కృత్రిమ మేధ ఆధారిత నిఘా, ఆధునిక రక్షణ వ్యవస్థలతో శత్రుదుర్భేద్యంగా మార్చారు. వైమానిక దాడులను అడ్డుకునేందుకు భారత్ మండపం కాంప్లెక్స్‌లో అయిదు యాంటీ డ్రోన్ వ్యవస్థలు, నాలుగు ఎయిర్ డిఫెన్స్ గన్‌లను మోహరించారు. ఉగ్రదాడుల వంటి ఘటనలను తిప్పికొట్టేందుకు ఎన్ఎస్‌జీ సహా పలు భద్రతా సంస్థలను రంగంలోకి దించారు. మూడంచెల భద్రతను ఏర్పాటు చేశారు. ప్రధాని మోదీ, అంతర్జాతీయ వీవీఐపీల భద్రతా బాధ్యతలను ఎస్పీజీకి అప్పగించారు. సీఐఎస్ఎఫ్, బీఎస్ఎఫ్, సీఆర్పీఎఫ్, ఐటీబీపీ బృందాలు భారత మండపం పరిసరాల్లో భద్రతను పర్యవేక్షిస్తున్నాయి. ఢిల్లీ వీధుల్లో 10 వేలమందికిపైగా పోలీసులను మోహరించారు. సదస్సు జరుగుతున్న ప్రాంతాన్ని 10 జోన్‌లు, 22 సెక్టార్లుగా విభజించారు. వీటిని కమాండ్, కంట్రోల్, కమ్యూనికేషన్, ఇంటెలిజెన్స్ సిస్టమ్ ద్వారా పర్యవేక్షిస్తున్నారు. ఏఐ కెమెరాల ద్వారా రద్దీ నిర్వహణ, అనుమానాస్పద కదలికలు, గుర్తుతెలియని వస్తువుల విశ్లేషణ చేపడుతున్నారు. డిజిటల్ పాసులు, క్యూఆర్ కోడ్‌ల ద్వారానే అతిథులను లోపలికి అనుమతిస్తున్నారు. వీవీఐపీల రాకపోకల సమయంలో ట్రాఫిక్, సెక్యూరిటీ ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. విదేశీ అతిథుల కోసం కేంద్రం బుల్లెట్ ప్రూఫ్ కార్లను సమకూర్చింది. వారు బస చేస్తున్న హోటళ్లలో రెండు వారాల నుంచే భద్రతా ప్రొటోకాల్‌లు అమలులో ఉన్నాయి.

# జగిత్యాలలో కుదిరిన సయోధ్య

## మున్సిపల్ చైర్‌పర్సన్‌గా సమిండ్ల వాణిని ఎంపిక

## వైస్ చైర్మన్ పదవికి పర్వీన్‌కు అవకాశం

**జగిత్యాల,ఫిబ్రవరి16(ప్రజా వీక్షణం):**

తాజా.. మాజీ ఎమ్మెల్యేల మధ్య అధిపత్య పోరు నెలకొన్న వేళ.. జగిత్యాల మున్సిపాలిటీ పీఠంపై సస్పెన్స్ వీడింది. జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ పీఠం ప్రస్తుత ఎమ్మెల్యే సంజయ్ వర్గానికే పార్టీ అధిష్ఠానం కేటాయించింది. ఇరువర్గాలతో సిఎం రేవంత్ మాట్లాడి సయోధ్య కుదిర్చినట్లు సమాచారం. దీంతో ఎమ్మెల్యే వర్గానికి ఛైర్‌పర్సన్ పీఠం దక్కింది. దాంతో మున్సిపల్ చైర్‌పర్సన్‌గా ఆయన వర్గానికి చెందిన సమిండ్ల వాణిని ఎంపిక చేశారు. అలాగే వైస్ చైర్మన్ పదవి మాజీమంత్రి జీవన్ రెడ్డి వర్గానికి కేటాయించింది. దీంతో వైస్ చైర్మన్ పదవికి పర్వీన్‌ను ఎన్నుకున్నారు. మరోవైపు జెడ్పీ, మార్కెట్ కమిటీ పదవులను జీవన్‌రెడ్డి వర్గానికి కేటాయిస్తామని అధిష్ఠానం హామీ ఇచ్చినట్టు తెలుస్తోంది. అయితే, ఈ ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం తాము సైతం కష్ట పడ్డామంటూ జీవన్‌రెడ్డితోపాటు ఆయన వర్గం అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లింది. ఈ మేరకు జీవన్ రెడ్డి వర్గానికి వైస్ చైర్మన్ పదవిని కేటాయించారు. దీంతో ఇరువర్గాలు ప్రస్తుతానికి శాంతించినట్లు ఒక చర్చ సాగుతోంది.

# కామారెడ్డి చైర్‌పర్సన్‌గా ఇప్ప ఉమారాణి

**కామారెడ్డి,ఫిబ్రవరి16(ప్రజా వీక్షణం):**

కామారెడ్డి మున్సిపాలిటీ చైర్మన్ ఎన్నికల్లో బిగ్ ట్విస్ట్ చోటు చేసుకుంది. స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలిచి గెలిచిన ఇప్ప ఉమారాణిని చైర్ పర్సన్ పీఠం వరించింది. ఈ మున్సిపల్ ఎన్నికల ఫలితాల అనంతరం ఇప్ప ఉమారాణి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ చైర్మన్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మద్దతు ఇచ్చేది లేదంటూ కామారెడ్డిలోని బీఆర్ఎస్ పార్టీ నేతలు తేల్చి చెప్పారు. దాంతో తాజాగా పార్టీలో చేరిన ఇప్ప ఉమారాణి పేరును కాంగ్రెస్ పార్టీ ప్రతిపాదించింది. మరోవైపు వైస్ చైర్మన్ స్థానాన్ని బీఆర్ఎస్ పార్టీ నేతలు కోరారు. కాసర్ల గోదావరి వైస్ చైర్మన్ పదవి దక్కించుకున్నారు.

# సెంట్రల్ వర్సిటీ ల్యాప్‌టాప్ చోరీ కేసు

## ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు

**హైదరాబాద్,ఫిబ్రవరి16(ప్రజా వీక్షణం):**

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ల్యాప్‌టాప్‌ల చోరీ కేసును గచ్చిబౌలి పోలీసులు ఛేధించారు. ఈ కేసులో ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. సీఆర్ రావు ఏఐఎమ్‌సీఎస్ విభాగం టార్గెగా చోరీ జరిగినట్లు పోలీసులు తెలిపారు. చోరీలో కూకట్‌పల్లికి చెందిన రేగుల చంద్రశేఖర్‌ని (30) ప్రధాన నిందితుడిగా గుర్తించారు. మిగిలిన ఇద్దరు సాయి చరణ్ (19), అశ్విన్ రావు (19)లను అరెస్ట్ చేశారు. వీరిద్దరూ విద్యార్థులే. యూనివర్సిటీ భద్రతా వ్యవస్థ గురించి సరైన అవగాహనతో, అర్ధరాత్రి సమయంలో దుండగులు లోపలికి ప్రవేశించి చోరీకి పాల్పడ్డారు. సీసీటీవీ ఫుటేజ్, సాంకేతిక ఆధారాలతో ప్రత్యేక బృందాలు దర్యాప్తు చేసి.. నిందితులను గుర్తించి, అరెస్ట్ చేశారు. నిందితుల వద్ద నుంచి సుమారు 60 ల్యాప్‌టాప్‌లను స్వాధీనం చేసుకున్నారు. అలాగే చోరీకి ఉపయోగించిన 2 కార్లు, 3 సెల్ ఫోన్లను కూడా సీజ్ చేశారు. ఈ కేసులో నిందితులను రిమాండ్‌కు తరలించారు గచ్చిబౌలి పోలీసులు. యూనివర్సిటీ క్యాంపస్‌లో భద్రతా లోపాలపై కూడా దృష్టి సారించి తదుపరి చర్యలు తీసుకుంటామని అధికారులు పేర్కొన్నారు.

# కోరం ఉన్నా ఎన్నిక వాయిదా దుర్మార్గం

## తొర్రూరు రాజకయీాంపై మండిపడ్డ ఎర్రబెల్లి

**మహబూబాబాద్,ఫిబ్రవరి16(ప్రజా వీక్షణం):**

తొర్రూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్నిక వాయిదా పడిన నేపథ్యంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికను వాయిదా వేయడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని ఆయన విమర్శించారు.. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. పరిస్థితులు సజావుగా ఉన్నప్పటికీ ఎన్నికను వాయిదా వేయడం దుర్మార్గమని ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. ప్రజల తీర్పును గౌరవించకుండా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ వైఖరిపై రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు చేపడతామని ఆయన హెచ్చరించారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడేందుకు పార్టీ తరఫున పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. విషయంపై జిల్లా కలెక్టర్‌ను సంప్రదించేందుకు ఫోన్ చేసినా స్పందించలేదని ఎర్రబెల్లి దయాకర్ రావు ఆరోపించారు. తొర్రూర్ మున్సిపల్ ఎన్నిక వాయిదా నేపథ్యంలో జిల్లా రాజకీయాల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

# రైతులకు ప్రభుత్వం తీపి కబురు

## సన్నవడ్ల బకాయిలు రూ.514.36 కోట్లు విడుదల

**హైదరాబాద్,ఫిబ్రవరి16(ప్రజా వీక్షణం):**

ధాన్యం రైతులకు తెలంగాణ ప్రభుత్వం తీపి కబురు అందించింది. ఖరీఫ్‌లో సన్న వడ్లు కొనుగోలుకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న బోనస్ బకాయిలను క్లియర్ చేస్తూ రూ.514.36 కోట్ల నిధులను విడుదల చేసింది. క్వింటల్‌కు రూ.500 చొప్పున బోనస్ రూపంలో రైతుల ఖాతాల్లో నేరుగా జమ కానున్నాయి. దీని ద్వారా సుమారు 2.17 లక్షల మంది రైతులు నేరుగా లబ్ధి పొందనున్నారు. ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం రైతులకు మొత్తం 1,939.58 కోట్ల రూపాయల బోనస్‌ను చెల్లించింది. రాష్ట్రంలో సన్న బియ్యం సాగును ప్రోత్సహించడం, రైతులకు మెరుగైన గిట్టుబాటు ధర అందించడమే ప్రభుత్వ లక్ష్యమని అధికారులు తెలిపారు. ల్గ÷తుల సంక్షేమమే ప్రాధాన్యంగా .. ధాన్యం కొనుగోళు ,, బోనస్ చెల్లింపులు, ఎమ్ఎస్‌పీతో పాటు అదనపు ప్రోత్సాహకాలను రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోంది. ఈ నిధుల విడుదలతో పెండింగ్ బకాయిలు దాదాపు పూర్తిగా క్లియర్ అయ్యే అవకాశం ఉంది. రైతులు తమ బ్యాంక్ ఖాతాలను చెక్ చేసుకోవాలని, ఏవైనా సమస్యలు ఉంటే సంబంధిత కొనుగోలు కేంద్రాలు, సివిల్ సప్లైస్ శాఖను సంప్రదించాలని అధికారులు సూచించారు. పెండింగ్ బకాయిలు విడుదలతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# తొర్రూరులో ఇరు వర్గాల బాహాబాహీ

## పరస్పర నినాదాలతో స్వల్ప ఉద్రిక్తత
## బిఆర్ఎస్ ఆధిక్యాన్ని దెబ్బతీసిన ఎక్స్ అఫీషియో
## ఎర్రబెల్లిని అడ్డుకున్న కాంగ్రెస్ కార్యకర్తలు
## రగంలోకి దిగి పరిస్థితిని అదుపు చేసిన ఎస్పీ

**మహబూబాబాద్,ఫిబ్రవరి16(ప్రజా వీక్షణం):**

తెలంగాణలో మేయర్లు, డిప్యూటీ మేయర్‌లు, మున్సిపల్ ఛైర్మన్‌లు, వైస్ ఛైర్మన్‌ల ఎన్నిక పక్రియ కొనసాగుతున్న వేళ పలుచోట్ల తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్నాయి. స్పష్టమైన మెజారిటీ ఉన్న కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో ఎన్నిక సజావుగా సాగుతోంది. కానీ హంగ్ వచ్చిన పలు మున్సిపాలిటీల్లో పరిస్థితులు ఉద్రిక్తంగా మారాయి. ఆయా మున్సిపాలిటీల్లో పాగా వేసేందుకు ప్రధాన రాజకీయ పార్టీలు ఎత్తులకుపైఎత్తులు వేస్తున్నారు. ఈ క్రమంలో పలు మున్సిపాలిటీల్లో ఘర్షణలు, ఆందోళనలు జరిగాయి. ముఖ్యంగా మహబూబాబాద్ జిల్లా తొర్రూర్‌లో ఉద్రిక్తత నెలకొంది. అక్కడ బీఆర్ఎస్‌కు మెజారిటీ వచ్చినా ఎక్స్‌అఫిషియో మెంబర్ల ఓట్లతో బలాలు సమానం అయ్యాయి. దాంతో ఇక్కడ డ్రా తీసి ఛైర్మన్, వైస్ ఛైర్మన్‌ను ఎంపిక చేసే అవకాశం ఉంది. ఈ క్రమంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ శ్రేణులు భారీ మున్సిపల్ కార్యాలయానికి చేరుకుని పోటాపోటీగా నినాదాలు చేశారు. ఫలితంగా పరిస్థితి ఉద్రిక్తమై రెండు వర్గాల మధ్య తోపులాట జరిగింది. ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు కార్యాలయానికి చేరుకోగా.. ఎర్రబెల్లి పీఏపై కొంతమంది కాంగ్రెస్ కార్తకర్తలు దాడికి పాల్పడ్డారు. తొర్రూర్‌లో మొత్తం 16 వార్డులు ఉండగా.. బీఆర్ఎస్ 9, కాంగ్రెస్ 7 చోట్ల గెలుపొందాయి. ఇక్కడ ఎక్స్‌అఫీషియో ఓట్లు కీలకంగా మారాయి. ఎక్స్‌అఫీషియో సభ్యులుగా ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి తమ పేర్లు నమోదు చేసుకున్నారు. ఎంపీ, ఎమ్మెల్యేలిద్దరూ కాంగ్రెస్ మద్దతుదారులు కావడంతో బీఆర్ఎస్, కాంగ్రెస్ బలాబలాలు సమానంగా మారాయి. దాంతో డ్రా ద్వారా ఛైర్మన్ ఎన్నిక నిర్వహించనున్నారు. ఇదిలావుంటే వరంగల్‌లో ఎక్స్‌అఫీషియో సభ్యురాలిగా కావ్య పేరు ఉందని బీఆర్ఎస్ ఆరోపిస్తోంది. దీనిపై చట్టపరంగా ముందుకెళ్తామని ఆ పార్టీ చెబుతోంది. ఇదిలావుంటే బీఆర్ఎస్ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర తొర్రూరులో ఓటు హక్కు వినియోగించుకునేందుకు రాగా.. అధికారులు అడ్డుకున్నారు. రాజ్యసభ సభ్యులు తమకు ఓటు ఉన్న ప్రాంతంలోనే ఓటు హక్కును వినియోగించుకోవాలని చెప్పారు. ఆయనను ఎక్స్ అఫిషియో సభ్యుడిగా ఓటు వేసేందుకు అనుమతించ లేదు. దాంతో ఆయన ఈ అంశంపై కోర్టుకు వెళ్తానని చెప్పారు. దీంతో మున్సిపల్ చైర్మెన్ ఎన్నికల వేళ తొర్రూరులో హైటెన్షన్ నెలకొంది.. కాంగ్రెస్, బీఆర్ఎస్ శ్రేణుల మధ్య వాగ్వాదం తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది. ఇరు పార్టీల శ్రేణుల వ్యతిరేక నినాదాలతో మున్సిపల్ ఆఫీసు ప్రాంగణం హోరెత్తుతోంది. భారీ జనసమీకరణకు ప్లాన్ చేసింది బీఆర్ఎస్. ఈ క్రమంలో మున్సిపల్ ఆఫీసు దగ్గర భారీగా పోలీసులు మోహరించారు. ఇరు వర్గాలు వ్యతిరేక నినాదాలు చేస్తూ పోలీసులను సైతం తోసుకుంటూ మున్సిపల్ ఆఫీసు లోపలికి వెళ్లే ప్రయత్నం చేయడంతో పరిస్థితి అదుపు తప్పనట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో జిల్లా ఎస్పీ శబరీష్ అక్కడికి చేరుకుని పరిస్థితిని అదుపు చేశారు. ఎవ్వరు కూడా అక్కడ ఉండకుండా వెనక్కి పంపించారు. అక్కడే ఉంటే లాఠీ చేయాల్సి వస్తుందని కాంగ్రెస్, బిఆర్ఎస్ కార్యకర్తలను హెచ్చరించారు. అలాగే అక్కడికి వచ్చిన యశశ్విని రెడ్డి అత్త ఝాన్సీరెడ్డిని కూడా ఎస్పీ వెన్నక్కి పంపించారు. ఆమె కారు దిగకుండానే వెనక్కి వెళ్లిపోయారు. ఎర్రబెల్లి దయాకర్ రావు మాత్రం మున్సిపల్ ఆఫీసుకు అనుమతించారు.

# కరీంనగర్‌పై బిజెపి జెండా

## -మేయర్‌గా కొలగాని శ్రీనివాస్ ఎన్నిక - డిప్యూటి మేయర్‌గాసునీల్ రావు ఎంపిక

## -బిజెపికి లభించిన బిఆర్ఎస్ తటస్థ వైఖరి

**కరీంనగర్,ఫిబ్రవరి16(ప్రజా వీక్షణం):**




తీవ్ర ఉత్కంఠ రేపిన కరీంనగర్ కార్పొరేషన్‌ను భాజపా దక్కించుకుంది. మేయర్ పీఠం దక్కించుకునేందుకు కాంగ్రెస్ వేసిన పాచిక పారలేదు. దీంతో కరీంనగర్ పట్టణ మేయర్‌గా ఆ పార్టీకి చెందిన కొలగాని శ్రీనివాస్ ఎన్నికయ్యారు. 34 మంది కార్పొరేటర్ల మద్దతుతో మేయర్ పీఠాన్ని కమలదళం కైవసం చేసుకుంది. డిప్యూటీ మేయర్‌గా అదే పార్టీకి చెందిన సునీల్‌రావు ఎన్నికయ్యారు. ఈ మేరకు ఎన్నికల అధికారి ప్రకటించారు. మేయర్ పీఠాన్ని దక్కించుకోవడంలో కేంద్రమంత్రి బండి సంజయ్ వ్యూహాత్మకంగా వ్యవహరించారు. కరీంనగర్ కార్పొరేషన్‌లో భాజపా అత్యధికంగా 30 స్థానాల్లో గెలిచి నప్పటికీ మ్యాజిక్ సంఖ్యను చేరుకొని పీఠాన్ని కైవసం చేసుకుంటుందా.. అనే విషయంలో సందిగ్ధత కొనసాగింది. ఎట్టి పరిస్థితుల్లో మేయర్ పీఠాన్ని దక్కించుకుంటామని కేంద్ర మంత్రి బండి సంజయ్ రెండ్రోజుల క్రితం ధీమా వ్యక్తం చేసినా ఆదివారం చోటుచేసుకున్న పరిణామాలు ఆసక్తిని రేపాయి. కాంగ్రెస్, భారాస, ఎంఐఎం, ఆల్‌ఇండియా ఫార్వర్డ్ బ్లాక్(ఏఐఎఫ్‌బీ) సభ్యులు, స్వతంత్రులు కలిసి ఎలాగైనా కార్పొరేషన్‌ను తమకు అనుకూలంగా మలచుకోవాలనే విధంగా చక్రం తిప్పారు. ఇందులో భాగంగానే హైదరాబాద్ నగర శివారులోని ఓ రిసార్టులో వేర్వేరుగా క్యాంపులు నిర్వహించారు. మేయర్ పదవి కోసం ఇరువర్గాలు భాజపా, కాంగ్రెస్ మధ్య సంఖ్యాపరంగా దోబూచులాట కొనసాగింది. చివరికి మేయర్ పీఠాన్ని భాజపా దక్కించుకోవడంతో ఉత్కంఠకు తెరపడింది. ఈ ఎన్నికలో కాంగ్రెస్ మేయర్ అభ్యర్థికి 21 మంది కార్పొరేటర్లు మద్దతు పలికారు. బీఆర్ఎస్ తటస్థంగా వ్యవహరించింది. బీఆర్ఎస్ ఎటువైపు మొగ్గు చూపకుండా తటస్థంగా ఉండటంతో, బీజేపీ అభ్యర్థి 34 ఓట్లతో విజయం సాధించారు. దీంతో మొదటి సారి కరీంనగర్ మేయర్ పీఠాన్ని బీజేపీ దక్కించుకుంది. ఇటీవలి మున్సిపల్ ఎన్నికల ఫలితాల్లో కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో మొత్తం 66 డివిజన్లు ఉండగా.. బీజేపీ 30 స్థానాలు గెలుచుకోగా, కాంగ్రెస్ 14 స్థానాలు, బీఆర్ఎస్ 9 స్థానాలు, స్వతంత్రులు 8 స్థానాలు, ఎంఐఎం 3 సీట్లు, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ రెండు స్థానాల్లో విజయం సాధించాయి. ఇక్కడ ఏ పార్టీకీ స్పష్టమైన మెజారిటీ లభించకపోవడంతో ఉత్కంఠ నెలకొంది. ఈ ఫలితాలతో హంగ్ నెలకొన్నప్పటికీ.. స్వంతంత్రులు, ఇతరుల అభ్యర్థులతో బీజేపీ మేయర్ పదవిని దక్కించుకుంది.

# నిజామాబాద్ మేయర్ పీఠం దక్కించుకున్న కాంగ్రెస్

## ఎంఐఎం మద్దతుకు తోడు ఎక్స్ అఫీషియోల బలం - మేయర్‌గా ఎన్నికైన ఉమారాణి

**నిజామాబాద్,ఫిబ్రవరి16(ప్రజా వీక్షణం):**

నిజామాబాద్ నగర మేయర్ పీఠం ఎవరికి దక్కుతుందనే దానిపై ఏర్పడిన ఉత్కంఠ ఎట్టకేలకు సోమవారం వీడింది. నిజామాబాద్ మేయర్ పీఠాన్ని కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంది. ఆ నగర మేయర్‌గా ఉమారాణిని కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఎంపిక చేసింది. నిజామాబాద్ నగరంలో మొత్తం 60 డివిజన్లు ఉన్నాయి. తాజాగా జరిగిన మున్సిపల్ ఎన్నికల ఫలితాల్లో నగర ఓటరు బీజేపీకి 28, కాంగ్రెస్‌కు 17, ఎంఐఎంకు 14, బీఆర్ఎస్ పార్టీకు 1 కట్టబెట్టాడు. అయితే మేయర్ పీఠం దక్కాలంటే.. మ్యాజిక్ ఫిగర్ 31 రావాల్సి ఉంటుంది. అంటే.. మ్యాజిక్ ఫిగర్‌కు మూడు అడుగుల దూరంలో బీజేపీ నిలిచిపోయింది. అలాంటి వేళ.. మేయర్ పీఠం కోసం అధికార కాంగ్రెస్ పార్టీ కసరత్తు చేపట్టింది. దాంతో ఎంఐఎంను తన దారికి తెచ్చుకొంది. దాంతో ఈ రెండు పార్టీలు కలిస్తే.. 31 సీట్లు వచ్చినట్లు అయింది. అలాగే ఎక్స్ అఫీషియో సభ్యుల ఓట్లు కూడా కలిసి.. మరో రెండు ఓట్లు ఆ పార్టీకి వచ్చి చేరాయి. అలాగే బీఆర్ఎస్ పార్టీ నుంచి గెలిచిన ఒక్క అభ్యర్థి సైతం కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లిపోయాడు. దాంతో ఈ పీఠం సులువుగా కాంగ్రెస్ పార్టీ ఖాతాలో పడింది. అదీకాక పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ సొంత జిల్లా కావడంతో.. నిజామాబాద్ నగర మేయర్ పీఠాన్ని ఆయన ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. దాంతో ఆ పీఠం కాంగ్రెస్ పార్టీ హస్తగతం చేసుకుంది. బిజెపి మెజార్టీ సీట్లు సాధించిన ఫలితం దక్కలేదు. నిజామాబాద్ నగర మేయర్ పీఠం కాంగ్రెస్ పార్టీ చేజిక్కించుకోవడంతో స్థానిక ఎంపీ, బీజేపీ సీనియర్ నేత ధర్మపురి అర్వింద్ సోమవారం స్పందించారు. మూడు ఓట్ల తేడాతో మేయర్, డిప్యూటీ మేయర్ పదవులను కాంగ్రెస్ పార్టీ గెల్చుకుందన్నారు. బీజేపీని ఓడించేందుకు బీఆర్ఎస్, కాంగ్రెస్, ఎంఐఎం పార్టీలు ఒకటయ్యాయని మండిపడ్డారు కాళేశ్వరం, ఈ కార్ రేసింగ్ తదితర కేసుల్లో బీఆర్ఎస్ పార్టీ అధినేతలు కేసీఆర్, కేటీఆర్‌లను సీఎం రేవంత్ రెడ్డి ఎందుకు కాపాడుతున్నారో ఈ రోజు అర్థమైందమన్నారు. ఇందూరులో బీజేపీని ఓడించడానికి అనైతిక పొత్తుకు శ్రీకారం చుట్టారంటూ వారిపై నిజామాబాద్ ఎంపీ అర్వింద్ నిప్పులు చెరిగారు. బీజేపీ ఓటమిలో కాంగ్రెస్ రంగు పూసుకుని తిరిగే పోలీసుల హస్తం కూడా ఉందని ఈ సందర్భంగా ఆరోపించారు. ఈ ఐదేళ్ల పదవి పూర్తయ్యే లోపు ఈ ఫలితాన్ని రివర్స్ చేసి చూపిస్తామని ఆయన శపథం చేశారు. అయితే ఈ మున్సిపల్ ఎన్నికల్లో నైతిక విజయం తమదేనని ప్రకటించారు. ఈ టర్మ్ అయ్యేలోపు కార్పొరేషన్‌ను బీజేపీ కైవసం చేసుకుంటుందని ఎంపీ అర్వింద్ స్పష్టం చేశారు. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో నిజామాబాద్ నగర పాలక సంస్థలో బీజేపీ 28 సీట్లు కైవసం చేసుకుంది.

# రాష్ట్రవ్యాప్తంగా నేడు కెసిఆర్ జన్మదిన వేడుకలు

## తెలంగాణ భవన్‌లో 72 కిలోల కేక్ కట్ చేస్తాం-బిఆర్ఎస్ నేత సాయికిరణ్ వెల్లడి

**హైదరాబాద్,ఫిబ్రవరి16(ప్రజా వీక్షణం):**

తెలంగాణ రాష్ట్రం అంతా ఎప్పుడెప్పుడా అని ఎదురుచూసే రోజు కేసీఆర్ పుట్టిన రోజు అని బీఆర్ఎస్ నేత తలసాని సాయికిరణ్ యాదవ్ అన్నారు. ఆయన గాంధేయ మార్గంలో తెలంగాణ రాష్ట్రాన్ని ధించిన నాయకుడని కొనియాడారు. తెలంగాణభవన్ ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తెచ్చిన తెలంగాణను పదేండ్లలో దేశంలోనే నెంబర్ వన్ స్థాయికి తీసుకెళ్ళిన నాయకుడు కేసీఆర్ అని చెప్పారు. తెలంగాణ జాతిపితగా కేసీఆర్‌ను గౌరవవిస్తారని, రేపు తెలంగాణ భవన్‌లో కేసీఆర్ పుట్టినరోజు ఘనంగా జరుపుతున్నామని తలసాని సాయికిరణ్ తెలిపారు. ఈ కార్యక్రమానికి కేటీఆర్, హరీష్ రావుతోపాటుగా తలసాని శ్రీనివాస్ యాదవ్ తదితర సీనియర్ నేతలు అందరూ పాల్గొంటారని చెప్పారు. కేసీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకొని రాష్ట్ర వ్యాప్తంగా సేవా కార్యక్రమాలు ఉంటాయన్నారు. తెలంగాణ భవన్‌లో కేసీఆర్ 72వ పుట్టినరోజు సందర్భంగా 72 కిలోల కేక్ కటింగ్ ఉంటుందని చెప్పారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత తెలంగాణ రావణ కాష్టంగా మారిందని సాయికిరణ్ అన్నారు. ఎన్నికలు వచ్చిన ప్రతిసారీ కాంగ్రెస్ పార్టీ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తుందని ఆరోపించారు. మున్సిపాలిటీ ఎన్నికలకు ఏ ముఖ్యమంత్రి కూడా ప్రచారం చేసిన దాఖలాలు లేవని అన్నారు. ముఖ్యమంత్రి ప్రచారం చేసినా కాంగ్రెస్ పార్టీకి 42 శాతం ఓటు షేర్ వచ్చిందని చెప్పారు. రేవంత్ రెడ్డి ఆయన జీవిత కాలంలో మళ్ళీ ముఖ్యమంత్రి కాలేదని అన్నారు. రౌడీయిజం ఎన్నో ఏండ్లు సాగదని వ్యాఖ్యానించారు. పదేండ్లు బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ పార్టీలా తాము కూడా వ్యవహరిస్తే ఆ పార్టీ ఉండేదే కాదన్నారు. కేసీఆర్‌ను తక్కువ చేసి మాట్లాడినంత మాత్రాన ఆయన పవర్ తగ్గదని, ప్రజల గుండెల్లో కేసీఆర్ ఉంటారని అన్నారు. గాంధేయ మార్గంలో ఉద్యమం ఎలా చెయ్యాలో కేసీఆర్ తమకు నేర్పించారని చెప్పారు. ఉద్యమాలు తమకు కొత్తకాదని, తమ నాయకులపై ఎన్ని అక్రమ కేసులు పెట్టినా ఎదుర్కొంటామని అన్నారు. తెలంగాణ భవన్‌లో డప్పు వాయిద్యాలతో కోలాహలంగా కేసీఆర్ పుట్టినరోజు వేడుకలు జరుగుతాయని తలసాని సాయికిరణ్ చెప్పారు. బీఆర్ఎస్ శ్రేణులు గ్రేటర్ హైదరాబాద్‌లోని వివిధ ప్రాంతాల్లో స్థానికంగా తమ కార్యక్రమాలు ముగించుకొని తెలంగాణ భవన్‌కు రావాలని కోరారు.

ప్రజావీక్షణం దినపత్రిక

# 105 మున్సిపాలిటీల్లో చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక

## 11 మున్సిపాలిటీల్లో చైర్మన్ల ఎన్నిక వాయిదా

### 84 కాంగ్రెస్ ,17 బీఆర్ఎస్, 1 బిజెపి

**హైదరాబాద్,ఫిబ్రవరి16(ప్రజా వీక్షణం):**

తెలంగాణ వ్యాప్తంగా 105 మున్సిపాలిటీల్లో చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక ప్రక్రియ పూర్తయింది. మరో 11 మున్సిపాలిటీల్లో చైర్మన్ల ఎన్నిక వాయిదా పడింది. ఎన్నిక జరిగిన 105 మున్సిపాలిటీల్లో 84 కాంగ్రెస్ కైవసం చేసుకోగా.. 17 బీఆర్ఎస్ చేజిక్కించుకుంది. ఒక స్థానంలో భాజపా విజయం సాధించింది. మూడు చోట్ల స్వతంత్ర అభ్యర్థులు చైర్మన్లుగా ఎన్నికయ్యారు. మొత్తం 116 మున్సిపాలిటీలకు ఈ నెల 11న ఎన్నికలు జరిగిన సంగతి తెలిసిందే. ఫలితాల సమయానికి 90 స్థానాల్లో వివిధ పార్టీలు స్పష్టమైన మెజార్టీ కనబరచగా.. 36 స్థానాల్లో హంగ్ పరిస్థితి ఏర్పడింది. కాగా, వివిధ పార్టీల మధ్య పొత్తులు, స్వతంత్ర అభ్యర్థుల మద్దతుతో కొన్ని మున్సిపాలిటీల్లో చైర్ పర్సన్లు ఎన్నికయ్యారు.

# న్యాయవాది జి. స్వప్న కుమారి హత్య కేసు

## డీజీపీని నివేదిక కోరిన హక్కుల కమిషన్

**హైదరాబాద్,ఫిబ్రవరి16(ప్రజా వీక్షణం):**

చేవెళ్ల పరిధిలో జరిగిన భూ వివాద ఘటనలో న్యాయవాది జి. స్వప్న కుమారి దారుణ హత్యను నివారించడంలో మొయినాబాద్ పోలీసులు తీవ్ర నిర్లక్ష్యం వహించారనే ఆరోపణలపై, డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్ అధ్యక్షతన న్యాయవాదులు దాఖలు చేసిన ఫిర్యాదు పరిగణనలోకి తీసుకుంది. మృతురాలు తన సోదరుడిని నిందితుడిగా పేర్కొంటూ తన ప్రాణాలకు ముప్పు ఉందని ముందుగా పోలీసులకు హెచ్చరించినప్పటికీ, పోలీసులు సకాలంలో నివారణ చర్యలు తీసుకోవడంలో విఫలమయ్యారని, ఇది విధి నిర్వహణలో తీవ్రమైన నిర్లక్ష్యంగా పరిగణించాల్సిన విషయమని ఫిర్యాదుదారులు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో, తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) నుండి సమగ్ర నివేదిక కోరుతూ, కేసును తదుపరి పరిశీలన కోసం మార్చి6కు వాయిదా వేశారు.

18న మీడియా అకాడమిలో

# వివిధ రంగాలపై మీడియాకు శిక్షణ

**హైదరాబాద్,ఫిబ్రవరి16(ప్రజా వీక్షణం):**

భూ హక్కులు, వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి, పర్యావరణ రిపోర్టింగ్ పై ఒక్క రోజు శిక్షణా తరగతులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలంగాణ మీడియా అకాడమి కార్యదర్శి నాగులపల్లి వెంకటేశ్వర రావు తెలిపారు. నెల 18వ తేదీన ఉదయం 9-00 గంటల నుండి సాయంత్రం 5-00 గంటల వరకు నాంపల్లిలోని తెలగాంణ మీడియా అకాడమి ఆడిటోరియంలో ఈ శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. ఈ శిక్షణా కార్యక్రమంలో భూ చట్టాలు- భూ సమస్యల పరిష్కారం, వ్యవసాయం-అనుబంధ రంగాలలో ప్రభుత్వ స్కీములు, బ్యాంకు రుణాలు, పర్యావరణ భద్రత, చెరువులను కాపాడుకోవడం, జర్నలిస్టుల నైతిక నియమావళి, మీడియా-చట్టాలు, డిజిటల్ రిపోర్టింగ్, వ్యవసాయం, రైతు సమస్యలు, గ్రామీణ ప్రాంతాలు, రెవెన్యూ అంశాలపై జర్నలిస్టులకు అవగాహన కల్పించడంతోపాటు రిపోర్టింగ్ లో పర్యావరణ, సాంకేతిక అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా నిపుణులు వివరించనున్నట్లు ఆయన తెలిపారు. మీడియా రంగం వేగంగా రూపాంతరం చెందుతున్న నేపథ్యంలో జర్నలిస్టులు నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అవగాహన చేసుకుని, సమాజానికి నిష్పక్షపాత, బాధ్యతాయుతమైన సమాచారం అందించాల్సిన అవసరం ఉందని కార్యదర్శి పేర్కొన్నారు. ఈ శిక్షణ ద్వారా జర్నలిస్టులు తమ వృత్తిపరమైన ప్రతిభను మరింత పెంపొందించుకునే అవకాశం లభిస్తుందని తెలిపారు.

# 26న నెల్లూరు మేయర్ ఎన్నిక

## ఎపి ఎన్నికల కమిషన్ ఉత్తర్వులు

**అమరావతి,ఫిబ్రవరి16(ప్రజా వీక్షణం):**

నెల్లూరు, ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్ల మేయర్ ఎన్నికలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ నెల 26వ తేదీన ఉదయం 11 గంటలకు ఎన్నిక నిర్వహించాల్సిందిగా జిల్లా అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. నెల్లూరు మేయర్ విషయంలో అన్యాయం జరుగుతోందంటూ మాజీ మేయర్ స్రవంతి భర్త జయవర్ధన్ ఆందోళనలు చేపట్టారు. అయితే జయవర్ధన్ ఆరోపణలను టీడీపీ నేతలు ఖండించారు. వైసీపీ ప్రోత్సాహంతోనే తమపై విషప్రచారం సాగించారని టీడీపీ నేతలు ఆరోపించారు. ఎన్నికల కమిషన్ పరిధిలోని అంశాన్ని కూటమి ప్రభుత్వానికి ఆపాదిస్తూ ప్రచారాలు చేశారన్నారు. మున్సిపల్ కార్పొరేషన్‌లో తమకేసంఖ్యా బలం అత్యధికంగా ఉందని టీడీపీ నేతలు పేర్కొన్నారు. కాగా, నెల్లూరు మేయర్ పదవికి దేవరకొండ శ్రీలతని టీడీపీ ఎంపిక చేసిన విషయం తెలిసిందే.

# సిఎం చంద్రబాబుతో తుమ్మల భేటీ

## ఐదూళ్లపై మంత్రి అభ్యర్థన

**అమరావతి,ఫిబ్రవరి16(ప్రజా వీక్షణం):**

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో తెలంగాణ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సోమవారం అమరావతిలో సమావేశం అయ్యారు. ఈభేటీలో పలు కీలక అంశాలపై చర్చించారు. ప్రధానంగా పునర్విభజనలో ఆంధ్రాలో కలిసిన 5 గ్రామపంచాయతీలను తిరిగి తెలంగాణలో కలపడానికి సహకరించాలని మంత్రి తుమ్మల కోరారు. తిరుమలలో తెలంగాణకి 5 ఎకరాల స్థలం కేటాయించాలని సీఎం చంద్రబాబుని తుమ్మల కోరారు. ఖమ్మంలో టీటీడీ దేవస్థానం నిర్మాణానికి సహకరించాలని సీఎం చంద్రబాబును మంత్రి తుమ్మల కోరారు. ఖమ్మం జిల్లా పెద్దవాగు మరమ్మత్తుల కోసం అయ్యే ఖర్చులో 85శాతం నిధులను విడుదల చేయాలని అభ్యర్థించారు. అదేవిధంగా సత్తుపల్లి, కొవ్వూరు రైల్వేలైన్, పెనుబల్లి, అమరావతి రైల్వేలైన్ నిర్మాణానికి కృషి చేయాలని విన్నవించారు. భద్రాచలం ముంపు బారిన పడకుండా నిర్మించిన కరకట్టకి సంబంధించి.. ఏపీలో కలిసిన భాగానికి వెంటనే మరమ్మతులు చేపట్టాలని మంత్రి తుమ్మల కోరారు.

# ఇక ఈ అవమానాన్ని భరించలేను

## - పార్టీలో కొనసాగడం కష్టంగానే ఉంది - జగిత్యాలను బిఆర్ఎస్ ఎమ్మెల్యేకు రాసిచ్చారు

## - మాజీ ఎమ్మెల్సీ కాంగ్రెస్ నేత జీవన్ రెడ్డి ఆవేదన

**జగిత్యాల,ఫిబ్రవరి16(ప్రజా వీక్షణం):**

కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. పార్టీలో కొనసాగడంపై ఆలోచిస్తున్నట్లు చెప్పారు. భవిష్యత్ ఏంటో గోచరించడం లేదని, అవమానాలు ఇంకెంతకాలం భరించాలని ఆవేదన వ్యక్తం చేశారు. జగిత్యాల మున్సిపల్ ఎన్నికల సందర్భంగా జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యే సంజయ్ వర్గాల మధ్య విభేదాలు తలెత్తిన సంగతి తెలిసిందే. కాంగ్రెస్ మెజార్టీ స్థానాలు కైవసం చేసుకున్నప్పటికీ.. ఛైర్మన్ పదవి ఎవరికి ఇస్తారన్న దానిపై ప్రతిష్టంభన ఏర్పడింది. ఈ క్రమంలోనే జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యే సంజయ్ వర్గీయులు క్యాంప్ రాజకీయాలు చేశారు. చివరికి సంజయ్ వర్గానికి చెందిన వ్యక్తి ఛైర్మన్‌గా ఎన్నికయ్యారు. దీంతో జీవన్‌రెడ్డి అసహనానికి గురైనట్లు సమాచారం. ఈ ఎన్నిక ముగింపు కాదు. సోమవారం జీవన్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. జగిత్యాలలో ఎమ్మెల్యే సంజయ్ ఉన్నంతకాలం నాకు వేధింపులు తప్పవు. పవర్ ఆఫ్ అటార్నీ ఎమ్మెల్యే సంజయ్‌కు రాసిచ్చారా అంటూ ఆవేదన చెందారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేకు జగిత్యాల కాంగ్రెస్ పట్టా రాసిచ్చారు. ఎమ్మెల్యే పార్టీ మారలేదని స్పీకర్ అంటున్నారు. ఆయన మాత్రం కాంగ్రెస్ పార్టీతో సంసారం చేస్తున్నారు. కార్యకర్తల మనోభావాలను పార్టీ అధినాయకత్వం గౌరవించాలి. జగిత్యాలలోనే ఇలా ఉంటే.. పార్టీ మారిన మరో 9 ప్రాంతాల్లో ఎలా ఉందో..అని జీవన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. జగిత్యాల మున్సిపల్ చైర్ పర్సన్ ఎంపిక విషయంలో కాంగ్రెస్ సీనియర్ నేత, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి అసంతృప్తితో ఉన్నారు. తన ప్రతిపాదనను కాదని, ఎమ్మెల్యే సంజయ్ కుమార్ వర్గానికి అధిష్టానం ప్రాధాన్యత ఇవ్వడంతో ఆయన కలత చెందారు. తన వర్గానికి చెందిన వ్యక్తికి కాకుండా.. ఎమ్మెల్యే సంజయ్ కుమార్ వర్గానికి చెందిన సమిండ్ల వాణిని జగిత్యాల మున్సిపల్ చైర్ పర్సన్‌గా ఎంపిక చేయడాన్ని ఆయన అవమానంగా భావిస్తున్నారు. 'నా గురించి, పార్టీతో నాకు ఉన్న అనుబంధం గురించి మీకు తెలుసు.



పార్టీలో కొనసాగాలనే విషయంపై ఆలోచించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆయన ఎవరో వచ్చి మా మీద ఆధిపత్యం చెలాయిస్తున్నారు. మా హక్కులను కాలరాస్తున్నారు. మా కాంగ్రెస్ కార్యకర్తల హక్కులను కాపాడలేకపోతున్నా. ఈ క్షోభ ముగింపు కాదు. ఈ వేధింపులు భరిస్తూ పార్టీలో కొనసాగగలుగుతామా? అన్న ప్రశ్న తలెత్తుతోంది. ఈ వేధింపులు భరించగలుగుతానా? ఎంత కాలం భరించగలుగుతాను? దీనికి పరిష్కారం ఏంటి? అని కూడా ఊహించలేకపోతున్నా' అంటూ ఆవేదన వ్యక్తం చేశారు.

# కేంద్ర నిధులపై దృష్టి పెట్టండి

## అధికారులకు సిఎస్ ఆదేశాలు

**హైదరాబాద్,ఫిబ్రవరి16(ప్రజా వీక్షణం):**

కేంద్ర ప్రభుత్వం నుండి రావాల్సిన నిధులను రాబట్టుకునేందుకు తగిన కార్యాచరణను రూపొందించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు ఉన్నతాధికారులను ఆదేశించారు. సోమవారం డా.బి.ఆర్.అంబేద్కర్ సచివాలయంలో వివిధ విభాగాల కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులతో ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం జరిగింది. సమావేశంలో సి.ఎస్ మాట్లాడుతూ, కేంద్ర ప్రాయోజిత పథకాల నుండి రాష్ట్రానికి రావాల్సిన బకాయిలు, నిధులు మార్చి నెలాఖరులోగా సమీకరించుకునేందుకు ప్రణాళిక బద్ధంగా పనిచేయాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వ ఎస్ఎన్ఎ నిధులు, 15వ ఆర్థిక సంఘం గ్రాంట్స్, ఇతర పథకాల క్రింద రాష్ట్రానికి రావాల్సిన నిధులపై ప్రత్యేక దృష్టి సారించి, దీనిపై ఢిల్లీలో ఒక ప్రత్యేక అధికారిని నియమించుకొని సమన్వయం చేసుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మున్సిపల్, విద్య, వైద్యారోగ్య,గిరిజన సంక్షేమ శాఖల వారీగా కేంద్రం నుంచి సుమారు 15 వేల కోట్ల రూపాయిలు రావాల్సి ఉందని, వీటిని సమీకరించుకొని



రాష్ట్రంలోని పెండింగ్ పనులకు ఖర్చు చేయాలని సూచించారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా మార్చి 2, 3 తేదీల నుండి జూన్2వ తేదీ వరకు వివిధ అభివృద్ధి పనులపై వివిధ డిపార్టుమెంట్ల వారీగా 100 రోజుల కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని సిఎస్ అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా గ్రామీణాభివృద్ధి, మున్సిపల్, హెల్త్, ఎడ్యుకేషన్ విభాగాలలో ఈ ప్రణాకను సమర్థవంతంగా అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో ఇటీవల గ్రామపంచాయతీ, మున్సిపల్ లోకల్ బాడీస్ ఎన్నికలు ముగిసినందున ఎన్నికైన వార్డుమెంబర్లు, సర్పంచులు, మున్సిపల్ కౌన్సలర్స్, కార్పొరేటర్స్ తదితర ప్రజాప్రతినిధులకు అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై అవగాహన కల్పించేందుకు బాధ్యతతో కూడిన విధులు నిర్వర్తించేందుకు ఈ వందరోజుల కార్యాచరణ ప్రణాళిక(100 డేస్ యాక్షన్ ఎ÷-లాన్) ఉపకరిస్తుందని సిఎస్ తెలిపారు. గ్రామాల్లో,పట్టణాల్లో పారిశుధ్య కార్యక్రమాలు, రోడ్ల మరమ్మతులు, రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని తాగునీటి ఎద్దడి లేకుండాకు తగు చర్యలు, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు ఈ యాక్షన్ ఎ÷-లాన్ రూపొందించాలని సూచించారు. రానున్న కేబినెట్ సమావేశానికి సంబంధించిన ప్రతిపాదనలను రేపటిలోగా సమర్పించాలని సిఎస్ సూచించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు వికాస్ రాజ్, సి.వీ.ఆనంద్, ముఖ్యమంత్రి ముఖ్య కార్యదర్శి శేషాద్రి, ముఖ్య కార్యదర్శులు సందీప్ సుల్తానియా, అహ్మద్ నదీమ్, ఎన్. శ్రీధర్, యోగితారాణా, కార్యదర్శులు క్రిస్టినా చొంగ్తు, టికె శ్రీదేవి, స్టీఫెన్ రవీంద్ర, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# రాష్ట్ర స్థాయి సీఎం కప్ యోగా పోటీలకు సుద్దాల విద్యార్థిని ఎంపిక

**ప్రజా వీక్షణం న్యూస్ నిజామాబాద్ బ్యూరో**

నిజామాబాద్ డీఎస్సీ గ్రౌండ్లో జరిగిన సీఎం కప్ యోగా జిల్లాస్థాయి పోటీల్లో సోమవారము ప్రథమ స్థానం సాధించి, రాష్ట్రస్థాయికి ఎంపికైన సుద్ధపల్లి విద్యార్థి రమాదేవి, జిల్లా యోగ సెక్రెటరీ చేతుల మీదగా బహుమతి అందుకొన్నారు. ఆ పాఠశాల ప్రిన్సిపల్ నలిని, వైస్ ప్రిన్సిపల్ స్వప్న, వనిత, పిడి జోష్ణ, పిఈటిలు నర్మదా, మౌనిక హర్షం వ్యక్తం చేసి, విద్యార్థినీని అభినందించారు.



# టిడ్కో గృహాలను పరిశీలించిన ఎమ్మెల్యే

**ఒంగోలు,ఫిబ్రవరి16(ప్రజా వీక్షణం):**

ఉగాది నాటికి లబ్దిదారులకు టిడ్కో గృహాలు అప్పగిస్తామని ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. సోమవారం కనిగిరి మున్సిపాలిటీ చాకిరాల సమీపంలో నిర్మాణంలో ఉన్న 912 టిడ్కో గృహాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గతంలో తెదేపా హయాంలో 60 శాతానికి పైగా టిడ్కో గృహాల నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించి లబ్దిదారులను మోసం చేసిందన్నారు. సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు తిరిగి గృహాలకు నిధులు మంజూరు చేసి రాష్ట్ర వ్యాప్తంగా పనులను చేయిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎమ్మెల్యే వెంట తెదేపా నాయకులు షరీఫ్, ఫిరోజ్, వెంకటేశ్వర్లు, పిచ్చిరెడ్డి తదితరులు ఉన్నారు.

# చంద్రబాబుతో బిల్‌గేట్స్ బ్రేక్‌ఫాస్ట్ మీటింగ్

## శ్రీవారి విశిష్టతను వివరించిన చంద్రబాబు

## ఇంట్లోని నిలువెత్తు విగ్రహం చూపించిన బాబు

## వ్యవసాయ క్షేత్రం సదర్శించి పంటలపై ఆసక్తి

**అమరావతి,ఫిబ్రవరి16(ప్రజా వీక్షణం):**

గేట్స్ ఫౌండేషన్ చైర్మన్ బిల్‌గేట్స్ సోమవారం అమరావతిలో పర్యటించారు. ఈ సందర్భంగా ఏపీ ప్రభుత్వంపై బిల్‌గేట్స్ ప్రశంసలు కురిపించారు. 'నైస్, గుడ్, గ్రేట్ ప్రభుత్వ విధానాలు, కార్యక్రమాలంటూ గేట్స్ కొనియాడారు. గేట్స్‌పై ఉన్న గౌరవంతో మంత్రి నారా లోకేశ్‌తో సహా నలుగురు మంత్రులను సీఎం చంద్రబాబు గన్నవరం విమానాశ్రయానికి పంపించి స్వాగతం పలికారు. సచివాలయంలో మొదటి బ్లాకులో స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు బిల్‌గేట్స్‌కు ఆత్మీయ స్వాగతం పలికారు. సీఎం చంద్రబాబును చూడగానే కారు దిగుతూనే 'హలో ఫ్రెండ్...! హౌ ఆర్ యూ'.. అంటూ ముఖ్యమంత్రిని పలకరించారు గేట్స్. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో సహా ఇతర క్యాబినెట్ మంత్రులను బిల్‌గేట్స్‌కు సీఎం చంద్రబాబు పరిచయం చేశారు. బ్రేక్‌ఫాస్ట్ మీటింగ్ సందర్భంగా తన ఛాంబర్‌లోకి వచ్చిన బిల్‌గేట్స్‌కు తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి నిలువెత్తు చిత్రపటాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు చూపించారు. శ్రీవారి ప్రాశస్త్యాన్ని, తిరుమల క్షేత్రం గొప్పదనాన్ని బిల్ గేట్స్‌కు వివరించారు సీఎం. గేట్స్ ఫౌండేషన్ బృందంతో బ్రేక్ ఫాస్ట్ మీటింగ్ అనంతరం ఆర్టీజీ సెంటర్‌కు గేట్స్‌ను తీసుకెళ్లారు ముఖ్యమంత్రి. తర్వాత ఆ విభాగం పనితీరును వివరించారు. పాలనా వ్యవహారాలు, విపత్తుల్లో ప్రజలకు నాణ్యమైన సేవలు అందించే విషయంలో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీని ఏ విధంగా వినియోగించుకుంటున్నా మనే అంశాన్ని ఉదాహరణలతో సహా వివరించారు ముఖ్యమంత్రి. గేట్స్ ఫౌండేషన్ భాగస్వామ్యంతో కుప్పంలో చేపట్టిన సంజీవని ప్రాజెక్టు ప్రోగ్రెస్‌ను ముఖ్యమంత్రి వివరించగా.. దట్స్ నైస్ అంటూ మెచ్చుకున్నారు బిల్ గేట్స్. ఆరోగ్య రంగంలో ఏఐ వినియోగంపై గ్రేట్ అంటూ గేట్స్ అభినందనలు తెలిపారు. డేటా లేక్, వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా పౌర సేవలను సులభతరం చేయడంపై బిల్ గేట్స్ హర్షం వ్యక్తం చేశారు. వ్యాధి నిర్ధారణ పరీక్షలు తక్కువ ధరకే అందించగలిగితే.. పేదలకు ఎంతో మేలు చేకూరుతుందని బిల్ గేట్స్ అభిప్రాయపడ్డారు. అమరావతి రాజధాని ప్రణాళికలను.. బ్లూ-గ్రీన్ కాన్సెప్ట్‌ను, అత్యాధునిక పద్ధతుల్లో ఫ్యూచర్ సిటీగా నిర్మిస్తున్న విధానాన్ని తెలుసుకున్నారు. గ్రేట్‌వర్క్ అంటూ రాజధాని మాస్టర్ ఎ÷-లాన్‌ను మెచ్చుకున్నారాయన. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ఎలాంటి ప్రణాళికలతో రాజధాని నిర్మిస్తున్నామనే విషయాన్ని వివరించారు సీఎం. రాజధాని ప్రాంతంలో మొత్తంగా గ్రీన్ ఎనర్జీనే వినియోగించే దిశగా.. ప్రణాళికలను సిద్ధం చేస్తున్నట్లు బిల్ గేట్స్‌కు చెప్పారు సీఎం. అనంతరం మంత్రులు, సెక్రటరీల సమావేశానికి గేట్స్‌ను తీసుకొచ్చారు సీఎం చంద్రబాబు. ప్రభుత్వ పాలసీలు, కార్యక్రమాలు, లక్ష్యాలపై ప్రజెంటేషన్ ఇచ్చారు.

# ఉత్కంఠకు తెర ...

## భువనగిరి మున్సిపాలిటీ పీఠం శ్రీవాణిదే..

## వైస్ చైర్మన్‌గా మంజుల...

## పురపాలనలో 'మహిళా' ముద్ర ...

## చైర్మన్, వైస్ చైర్మన్లుగా మహిళలే ఎన్నిక...

**ప్రజా వీక్షణం, యాదాద్రి భువనగిరి జిల్లా :**

గత కొద్దిరోజులుగా భువనగిరి పురపాలక చైర్మన్ పీఠంపై నెలకొన్న ఉత్కంఠకు తెరపడింది. ఎట్టకేలకు భువనగిరి మున్సిపాలిటీ పీఠాన్ని ఇద్దరు మహిళలే కైవసం చేసుకున్నారు. సోమవారం జరిగిన ఎన్నికలో మున్సిపల్ చైర్మన్‌గా తంగెళ్లపల్లి శ్రీవాణి రవికుమార్, వైస్ చైర్మన్‌గా పోతంశెట్టి మంజుల వెంకటేశ్వర్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. చైర్మన్ పదవి కోసం గత కొన్ని రోజులుగా అనేక ఊహాగానాలు, పుకార్లు షికార్లు చేసినప్పటికీ, చివరకు అధిష్టానం శ్రీవాణి రవికుమార్ వైపు మొగ్గు చూపింది. వైస్ చైర్మన్ పదవి కోసం తీవ్ర పోటీ నెలకొన్నప్పటికీ, సమన్వయంతో మంజుల వెంకటేశ్వర్లును ఎన్నుకున్నారు. పట్టణ అభివృద్ధిలో మహిళల భాగస్వామ్యం పెరగడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**ప్రమాణ స్వీకారం...**

ఎన్నికకు ముందు మున్సిపల్ కార్యాలయంలో నూతనంగా ఎన్నికైన కౌన్సిలర్లతో జిల్లా అదనపు కలెక్టర్ భాస్కర్ రావు ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక ప్రక్రియను పూర్తి చేశారు. నూతనంగా ఎన్నికైన చైర్మన్, వైస్ చైర్మన్లను భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎండి అవేస్ చిస్తీ తదితరులు కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. పట్టణ అభివృద్ధికి అందరూ కలిసికట్టుగా పనిచేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కౌన్సిలర్లు, పురప్రముఖులు పాల్గొన్నారు.





# నాలుగు రోజులుగా ఇంట్లోనే శవంతో ఓ కుటుంబం

## దుర్వాసన రావడంతో పోలీసులకు ఫిర్యాదు

## ప్రత్యేక అంబులెన్స్ లో స్వగ్రామానికి తరలించిన పోలీసులు

**ప్రజా వీక్షణం - కూకట్ పల్లి...**

శివరాత్రి పండగ రోజున శవంతో ఓ కుటుంబం నాలుగు రోజులుగా గడిపిన హృదయ విదారక ఘటన కూకట్ పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది,కూకట్ పల్లి రామకృష్ణ వీధిలో, సాయి భరద్వాజ్ అపార్ట్మెంట్ లోని ఫ్లాట్ లో అద్దెకు నివాసం ఉంటున్న ఓ కుటుంబం,తమ ఫ్లాట్ లో నాలుగు రోజులుగా శవంతో కలిసి ఉన్న ఘటన కలం కాలం రేపింది ,ఈ ఘటనపై కూకట్ పల్లి పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి,ఆంధ్రప్రదేశ్ గోదావరి జిల్లా కైకలూరుకు చెందిన ఓ కుటుంబం గత నలభై ఏళు ళ్ళగా , ఓ మహిళ ఇద్దరు ఆడపిల్లలు,ఒక కొడుకుతో కలిసి నివసిస్తున్నారు,గత శుక్రవారం ఆ మహిళ కూతురు శైలజ (45) అనారోగ్యంతో స్థానిక హాస్పిటల్లో మృతి చెందడంతో, శవాన్ని గత శుక్రవారం అపార్ట్మెంట్ లోని తమ ఫ్లాట్ లోకి తీసుకువెళ్లి డోర్ లాక్ చేసుకుని,నాలుగు రోజులుగా శవంతోనే నే కలిసి ఉన్న కుటుంబసభ్యులు, ఆదివారం ఆ ఇంటి నుండి దుర్వాసన వస్తుండడంతో, స్థానిక అపార్ట్మెంట్ వాసులు వారిని అడగగా,మృత దేహాన్ని ఐస్ బాక్స్ లో పెట్టుకుని ఉన్నాము అంటూ సమాధానం చెబుతూ లోపల లాక్ చేసుకున్నారు..వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేసిన అపార్ట్ మెంట్ వాసులు, పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని, కుటుంబ సభ్యులతో మాట్లాడారు. దహన సంస్కారాల విషయంలో ఊరికి తీసుకొని వెళ్తామని చెప్పడంతో, ప్రత్యేక అంబులెన్స్ ఏర్పాటు చేసి మృతదేహంతో సహా, కుటుంబ సభ్యులను వారి స్వగ్రామానికి తరలించిన పోలీసులు.





# ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి...

## జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

## ప్రజావాణిలో ప్రజల అర్జీలు స్వీకరించిన జిల్లా కలెక్టర్

**ప్రజా వీక్షణం/ఖమ్మం**

ఖమ్మం :- స్థానిక ఖమ్మం జిల్లా కలెక్టరేట్ ఆఫీసులో జరిగిన ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి జిల్లా అధికారులను ఆదేశించారు.కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, స్థానిక సంస్థలు అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజతో కలిసి ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు.వైరా మండలం గన్నవరం గ్రామం నుండి కిన్నెర రాణి, తనకు ఇందిరమ్మ ఇంటికి సంబంధించి మొదటి విడత డబ్బులు జమ అయినట్లు, తదుపరి విడతల డబ్బులు జమకాలేదని, ఇప్పించుటకు కోరగా, హౌజింగ్ పిడి ని పరిశీలించి, తగుచర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.మంచుకొండ, కోయచిలక గ్రామ రైతులు, తమకు రఘునాధపాలెం మండలం, మంచుకొండ, కోయచిలక రెవెన్యూ శివాయిగూడెం పరిధిలోగల సర్వే నెంబర్లు 174, 175, 362, 364/92 లలో గల స్వంత వ్యవసాయ భూములకు, వైకుంఠదామం, డంపింగ్ యార్డు లకు వెళ్లే దారిని, అట్టి భూమితో సంబంధం లేని వ్యక్తి నిరోధిస్తున్నట్లు, తమకు న్యాయం చేయాలని కోరగా, తహశీల్దార్ ను తగుచర్యలు తీసుకోవాలని కలెక్టర్ అన్నారు.కొనిజర్ల నుండి సయ్యద్ లాల్ బి కొనిజర్ల మండలం, గుండ్రాతిమడుగు రెవెన్యూ గ్రామంలో సర్వే నెంబర్ 421/1/లూ లో 2 ఎకరాల భూమి తన పేరున ఉన్నట్టు, అట్టి భూమిలో 1 ఎకరం తన పెద్ద అమ్మాయికి బహుమానంగా రిజిస్ట్రేషన్ చేయించినట్టు, మిగిలిన ఎకరం భూమిని తన చిన్న అమ్మాయికి బహుమానంగా రిజిస్ట్రేషన్ చేయాలని మీ సేవ కేంద్రానికి వెళ్ళగా, అట్టి భూమి అసైన్డ్ భూమిగా చూపిస్తుందని, అట్టి దానిని పిఓపి నుండి తొలగించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, తహశీల్దార్ కు రాస్తూ తగుచర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.ఖమ్మం అర్బన్ గోపాలపురం గ్రామం నుండి ఎస్ కె. రజియా, తనకు ఇల్లు లేదని, భర్త ఆక్సిడెంట్ అయి, ఇబ్బందుల్లో ఉన్నానని, తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు కు దరఖాస్తు చేయగా, హౌజింగ్ పిడి కి పరిశీలించి, చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.ప్రజావాణి కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ దీక్ష రైనా, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# మాస్టర్స్ చూపుతున్న నిబద్ధత అందరికి ఆదర్శం - ఉప్పల శ్రీనివాస్ గుప్తా

**ప్రజా వీక్షణం, క్రీడా ప్రతినిధి:**

మాస్టర్స్ బ్యాడ్మింటన్ క్రీడాకారులు ప్రదర్శిస్తున్న అంకితభావం, పట్టుదల ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని మేడ్చల్‌మల్కాజిగిరి బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్తా పేర్కొన్నారు. సోమవారం నగరంలో జరిగిన శ్రీ గుజ్జుల సుధాకర్ రెడ్డి మెమోరియల్ 11వ తెలంగాణ స్టేట్ మాస్టర్స్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.ఈ రాష్ట్రస్థాయి పోటీలను శాలిని సురేష్ బ్యాడ్మింటన్ అకాడమీలో ఘనంగా నిర్వహించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బ్యాడ్మింటన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ సావిత్రి ఆధ్వర్యంలో పోటీలు సక్రమంగా నిర్వహించబడ్డాయి.ఈ సందర్భంగా ఉప్పల శ్రీనివాస్ గుప్తా మాట్లాడుతూ, “వయసు కేవలం ఒక సంఖ్య మాత్రమే. క్రీడా స్ఫూర్తి, నిబద్ధత ఉంటే ఏ దశలోనైనా విజయాలు సాధించడం సాధ్యమే” అని పేర్కొన్నారు. ఇలాంటి రాష్ట్రస్థాయి పోటీలు క్రీడాభివృద్ధికి ఎంతో దోహదపడతాయని, యువతతో పాటు మాస్టర్స్ క్రీడాకారులు కూడా క్రమశిక్షణతో ముందుకు సాగాలని సూచించారు.నిర్వాహకుల కృషిని అభినందిస్తూ భవిష్యత్తులో మరిన్ని ప్రతిష్టాత్మక పోటీలు నిర్వహించాలని ఆకాంక్షించారు. అనంతరం విజేతలకు ట్రోఫీలు, ప్రశంసా పత్రాలు అందజేశారు.ఈ కార్యక్రమానికి వికారాబాద్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు కొసరాజు లక్ష్మణ్, కార్యదర్శి యూనియన్ బాబు, కోశాధికారి వంశీధర్, వికాస్, హర్ష, శాలిని సురేష్ తదితరులు హాజరయ్యారు..




# మార్కండేశ్వర ఆలయంలో ఘనంగా మహాశివరాత్రి ఉత్సవాలు

**జహీరాబాద్ ప్రజా వీక్షణరా, ఫిబ్రవరి 16:**



మహాశివరాత్రి సందర్భంగా శ్రీ భక్త మార్కండేశ్వర ఆలయంలో సోమవారం భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వేణు భట్ ఆధ్వర్యంలో పద్మశాలి సంఘం అధ్యక్షులు గడ్డం జనార్ధన్ దంపతులు ఏకాదశి రుద్రాభిషేకాన్ని నిర్వహించారు.అలాగే రాత్రి 12 గంటలకు లింగోద్భవ సమయంలో వేద బ్రాహ్మణోత్తములచే మహాన్యాస పూర్వక లఘు రుద్రాభిషేకాన్ని గడ్డం సరిత, గోపాల్ దంపతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం భక్తులతో నిండిపోయి ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం ఉపాధ్యక్షులు పండాల్ ప్రభు, దండి విట్టల్, ప్రణాళిక సంఘం సభ్యులు సోమచంద్రశేఖర్, సభ్యులు గద్దె వెంకటేశం, అప్పం శ్రీకాంత్, అప్పం రమేష్, యెన్నం ప్రకాష్, యెన్నం రఘు, ఆలయ మేనేజర్ నీలి రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే జన్మదినం సందర్భంగా ఏంకేఅర్ క్రికెట్ టోర్నమెంట్

## మ్యాచ్ ల నిర్వహణ వల్ల కార్యకర్తల్లో స్నేహ పూరిత వాతావరణం కలుగుతుంది

## క్రీడలు యువతలో మానసికోల్లాసాన్ని పెంపొందిస్తాయి - ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

**ప్రజా వీక్షణం - కూకట్ పల్లి....**

క్రీడలు యువతకు మానసికోల్లాసాన్ని కలిగిస్తాయని, ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు, కూకట్ పల్లి నియోజకవర్గ, హ్యాట్రిక్ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు జన్మ దినోత్సవం సందర్బంగా, కూకట్ పల్లి నియోజకవర్గ కార్పొరేటర్లు సమిష్టిగా నిర్వహిస్తున్న, ఎంకేఆర్ క్రికెట్ టోర్నమెంట్‌ను, ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మొదటి బాల్ వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, క్రీడలు యువతకు మానసిక ఉల్లాసం కలిగిస్తాయని అన్నారు, బిఆర్ ఎస్ పార్టీ కూకట్ పల్లి నియోజకవర్గం కార్పొరేటర్ లు, అన్ని డివిజన్ ల నుండి 10 టీం లతో క్రికెట్ మ్యాచులు నిర్వహించడం వలన, కార్యకర్తలలో స్నేహపూరిత వాతావరణం నెల కొంటుందని అన్నారు. ఈ సందర్భంగా, టోర్నమెంట్ నిర్వాహకుడు బాలానగర్ మాజీ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి మాట్లాడుతూ, టోర్నమెంట్ కోసం 10 టీంలు వచ్చాయని, సోమవారం లీగ్ మ్యాచ్ లు జరుగుతాయని, మంగళవారం సెమీఫైనల్, ఫైనల్ జరుగుతాయని తెలిపారు,10 టీంలకు బోయినపల్లి బ్లాస్టర్స్, బాలానగర్ వారియర్స్, ఫతేనగర్ ఫైటర్స్, మూసపేట టైటాన్స్, అల్లాపూర్ అవెంజర్స్, బాలాజీనగర్ చాలెంజర్స్, కె పి హెచ్ బి సూపర్ 11, బేగంపేట స్ట్రైకర్, కూకట్ పల్లి కింగ్స్, కో ఆర్డినేటర్ మరియు సతీష్ అరోరా నేతృత్వంలో బి ఆర్ యస్ యూత్ విక్టరీ 11 అని పేర్లతో, పోటీకి సిద్ధ పడుతున్నాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కో



ఆర్డినేటర్ సతీష్ అరోరా, మాజీ కార్పొరేటర్ లు మందడి శ్రీనివాస్ రావు, పండాల సతీష్ గౌడ్, తూము శ్రావణ్ కుమార్, పగుడాల బాబురావు, ముద్దం నరసింహ యాదవ్, మాధవరం రంగారావు, జూపల్లి సత్యనారాయణ, మహేశ్వరి శ్రీహరి , సభిహ గౌసిద్దిన్ నియోజకవర్గం కు చెందిన నాయకులు కార్యకర్తలు అభిమానులు భారీగా పాలొన్నారు.





# మధిర ను మోడల్ టౌన్ గా తీర్చిదిద్దుతాం

## రాజకీయాలకు తావులేకుండా అభివృద్ధి

### త్వరలో డెవలప్ మెంట్ కమిటీ' ఏర్పాటు

### ఓటర్ల నమ్మకానీలివమ్ము చేయబోం కాంగ్రెస్ - టీడీపీ కూటమి వాగ్దానాలన్నీ అమలు చేస్తాశిలిమీడియా సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడి

**ప్రజా వీక్షణం /ఖమ్మం**

మధిర పట్టణాన్ని రాష్ట్రంలోనే ఒక 'రోల్ మోడల్'గా, నివసించడానికి అత్యంత అనువైన 'మోస్ట్ లివబుల్ టౌన్'గా అభివృద్ధి చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. సోమవారం మధిరలోమున్సిపల్ నూతన పాలు ఒక వర్గం ఎన్నిక తర్వాత ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి అఖండ విజయాన్ని చేకూర్చిన ఓటర్ల నమ్మకాన్ని వమ్ము చేయబోమని, అత్యంత బాధ్యతగా ఈ ప్రాంతాలను అభివృద్ధి పథంలో నడిపిస్తామని స్పష్టం చేశారు. ప్రజలు తమపై ఉంచిన అపారమైన నమ్మకాన్ని గౌరవిస్తూ, అత్యంత బాధ్యతగా ఈ ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తామని డిప్యూటీ సీఎం భరోసా ఇచ్చారు. “అభివృద్ధి, సంక్షేమం, పారదర్శకత.. ఈ మూడు సూత్రాలతో మధిర పట్టణ వాసులకు మెరుగైన పాలన అందిస్తాం. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ – తెలుగుదేశం కూటమి అభ్యర్థులు ఇచ్చిన ప్రతి వాగ్దానాన్ని తూచా తప్పకుండా అమలు చేసి మధిర ప్రజల రుణం తీర్చుకుంటాం“ అని ఆయన పేర్కొన్నారు.

**రాజకీయాలు పక్కన పెట్టండి..**

మధిర పట్టణాన్ని భవిష్యత్తు తరాలకు ఒక 'రోల్ మోడల్'గా తీర్చిదిద్దడమే తమ తక్షణ కర్తవ్యమని వెల్లడించారు. ఈ మేరకు నూతనంగా ఎన్నికైన మున్సిపల్ పాలకవర్గానికి దిశానిర్దేశం చేశారు. నూతనంగా ఎన్నికైన మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ మరియు కౌన్సిలర్లకు భట్టి విక్రమార్క కీలక ఆదేశాలు జారీ చేశారు. “పదవులు చేపట్టాక ఇక రాజకీయం ఉండకూడదు. 'నో పాలిటిక్స్ – ఓన్లీ డెవలప్‌మెంట్' అనే నినాదంతో పని చేయాలి. పట్టణాన్ని క్లీన్ అండ్ గ్రీన్ గా మార్చడానికి ఉమ్మడి ప్రణాళికతో ముందుకు సాగాలి“ అని సూచించారు.

ప్రజావీక్షణం దినపత్రిక

### కరీంనగర్ కార్పొరేషన్ పై కాషాయజెండాఎగరేయాలనే

# కార్యకర్తల కల నెరవేరినందుకు వెరీ హ్యాపీ

## కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్

**ప్రజా వీక్షణం న్యూస్ ముస్తాబాద్**

లిసీఎం రేవంత్ రెడ్డి గారూ.... మెజారిటీ సీట్లను సాధించిన బీజేపీకి మేయర్, డిప్యూటీ మేయర్ పదవి దక్కకుండా మంత్రులు, బీఆర్ఎస్, ఎంఐఎంతో కలిసి మీరు చేయని కుట్రలు లేవు. అయినా బండి సంజయ్ రాజకీయం ముందు, బీజేపీ సైనికుల పోరాట పటిమ ముందు మీ కుట్రలన్నీ పటాపంచులైనయ్. క్రికెట్ లో ఇండియాపై పాకిస్తాన్ ఘన విజయం సాధించినట్లుగానే, కరీంనగర్ మున్సిపల్ ఎన్నికల కబడ్డీ ఆటలో... మీ అందరినీ ఓడించి బీజేపీ కప్ గెలుకుంది. ఈ వేదికగా ఇప్పుడు చెబుతున్నా... మీరు అనవసరంగా, అప్రజాస్వామికంగా నన్ను కెలికి ఆట మొదలుపెట్టారు. ఇక మీ ఆటకు నేను ముగింపు ఇస్తా"అంటూ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సీఎం రేవంత్ రెడ్డికి అల్టిమేటం ఇచ్చారు. ఈరోజు కరీంనగర్ లో మున్సిపల్ కార్పొరేషన్ మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నిక అనంతరం... నూతనంగా ఎన్నికైన మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, బీజేపీ కార్పొరేటర్లతో కలిసి మీడియాతో మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డితోపాటు కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం పార్టీలపై విరుచుకుపడ్డారు. ఏమన్నారంటే.... కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం పార్టీలన్నీ ఒక్కటి కావడానికి కారణమేంటి? ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసేలా ఫాంహౌజ్ వేదికగా కుట్రలు ఎందుకు చేశారు? ఎవరిపై మీ కోపం? కాంగ్రెస్ గెలిచింది 14 సీట్లు, ఎంఐఎం గెలిచింది 3 సీట్లు, బీఆర్ఎస్ గెలిచింది 9 సీట్లు... అన్నీ కలుపుకున్నా 26 సీట్లు మాత్రమే. మ్యాజిక్ ఫిగర్ దాటనే లేదు. ఇవన్నీ తెలిసి ఎందుకు బీజేపీని అడ్డుకునే ప్రయత్నం చేశారు. మీ చీకటి ఒప్పందాలేమిటి? మేయర్, డిప్యూటీ మేయర్ లకు అభినందనలు తెలియజేస్తున్న. కరీంనగర్ కార్పొరేషన్ పై కాషాయ జెండాను ఎగరేయాలని ఎన్నో ఏళ్లుగా కల కన్నం. ప్రజలంతా ఎదురు చూశారు. ఆ కల సాకారమైన ఈరోజు చాలా సంతోషంగా ఉంది.నిన్న క్రికెట్ లో పాకిస్తాన్ పై భారత్ ఘన విజయం సాధించింది. కరీంనగర్ గడ్డపై జరిగిన ఈ మున్సిపల్ కబడ్డీ ఆటలో ఇతర పార్టీలన్నీ కుట్రలు చేసినా బీజేపీ మేయర్ కప్ గెలుచుకుంది. బీజేపీని ఓడించేందుకు చెప్పలేని, కంటికి కన్పించని కుట్రలెన్నో జరిగాయి. అధికారం చేతిలో ఉంది కదా అని... బీజేపీ 30 సీట్లు సాధించినా, ఇండిపెండెంట్లు మావైపు ఉన్నా... మమ్ముల్ని ఓడించేందుకు కుట్రలు జరిగాయి. రాష్ట్ర ముఖ్యమంత్రి మొదలుకుని మంత్రులు, కాంగ్రెస్, బీఆర్ఎస్, మజ్లిస్ పార్టీలన్నీ కలిసి రెండ్రోజులుగా జరుగుతున్న కుట్రలను చూసి ప్రజలే విస్తుపోయారు. ఇన్ని కుట్రలు, కుతంత్రాలు చేసి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయాలనుకుంటున్నారా? అంటూ సోషల్ మీడియా వేదికగా నెటిజన్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎక్కడ చూసినా ఇదే చర్చ జరిగింది. రాష్ట్రంలో అధికార మార్పిడి జరగాలన్నా, తెలంగాణ వచ్చినా కరీంనగర్ వేదికగా మార్పు మొదలైన సంగతి తెలిసిందే. అందులో భాగంగానే కరీంనగర్ మేయర్ పదవిని బీజేపీ కైవసం చేసుకుంటే రాష్ట్రంలోనూ బీజేపీ అధికారంలోకి రావడం తథ్యమనే భయంతో కాంగ్రెస్, బీఆర్ఎస్, మజ్లిస్ పార్టీలన్నీ ఒక్కటై కుట్ర చేశాయి. కానీ మేం ప్రజల సహకారం, అమ్మవారి ఆశీస్సులతో ఆ కుట్రలన్నీ భగ్నం చేశాం. 2005లో ఇదే రోజున నేను కార్పొరేటర్ గా తొలిసారి ఎన్నికైనప్పుడు ఎంతో సంతోషపడ్డా. మళ్లీ ఈరోజు ఇదే కార్పొరేషన్ పై మేయర్ పీఠాన్ని బీజేపీని దక్కించుకున్నందుకు అంతకంటే ఎక్కువ సంతోషంగా ఉంది. మేయర్ గా కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు ఎన్నిక కావడం చాలా ఆనందంగా ఉంది. మా మేయర్, డిప్యూటీ మేయర్ కార్పొరేటర్లు గుణవంతులు, నీతిమంతులు... అవినీతికి ఆస్కారం లేకుండా పనిచేస్తారు. కార్పొరేషన్ లో అవినీతికి తావు లేకుండా ప్రజలకు అండగా ఉంటూ కరీంనగర్ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తాం. ఎన్నికల వరకే రాజకీయాలు. ఎన్నికల తరువాత అభివృద్ధే మా లక్ష్యం. ఇందుకోసం అన్ని పార్టీలు కలిసి రావాలని కోరుతున్నా. కరీంనగర్ అభివృద్ధి విషయంలో ప్రజలు లేటైనా లేటెస్టుగా తీర్పునిచ్చారు. అధిక మెజారిటీని ఇచ్చి ఆశీర్వదించారు. మేయర్, డిప్యూటీ మేయర్ ఆధ్వర్యంలో ప్రధాని మోదీ, అమిత్ షాను కలిసి కరీంనగర్ కు అత్యధిక నిధులు తెచ్చి అభివృద్ధి చేసేందుకు యత్నిస్తా.బాధాకరమైన విషయం ఏంటంటే... బీజేపీకి మేయర్ పదవి రాకుండా ఉండేందుకు జరిగిన కుట్రలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా భాగస్వాములు కావడం ఆశ్చర్యం కలిగించింది. గత రెండ్రోజులుగా అనేక కుట్రలు చేశారు. ఇబ్బంది పెట్టారు. నేను నమ్ముకున్న అమ్మవారి ఆశీస్సులు, ఎములాడ రాజన్న, కొండగట్టు అంజన్న, పాతబస్తీ భాగ్యలక్ష్మీ అమ్మవార్ల దీవెనలతో వాటిని అధిగమించినం. నేనడుగుతున్నా... కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం పార్టీలన్నీ ఒక్కటి కావడానికి కారణమేంటి? ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసేలా ఫాంహౌజ్ వేదికగా కుట్రలు ఎందుకు చేశారు? ఎవరిపై మీ కోపం? కాంగ్రెస్ గెలిచింది 14 సీట్లు, ఎంఐఎం గెలిచింది 3 సీట్లు, బీఆర్ఎస్ గెలిచింది 9 సీట్లు... అన్నీ కలుపుకున్నా 26 సీట్లు మాత్రమే. మ్యాజిక్ ఫిగర్ దాటనే లేదు. ఇవన్నీ తెలిసి ఎందుకు బీజేపీని అడ్డుకునే ప్రయత్నం చేశారు. మీ చీకటి ఒప్పందాలేమిటి? మున్సిపల్ ఎన్నికలకు ముందు వాళ్లు(కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం) ఆట స్టార్ట్ చేశారు. బీజేపీ ఆ ఆటకు ముగింపు ఇవ్వబోతున్నా. ముఖ్యంగా కాంగ్రెస్ కు ఛాలెంజ్ విసురుతున్నా... ఎక్కడికక్కడ 6 గ్యారంటీలను అమలు చేసేదాకా మీ మెడలు వంచుతాం. బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పతనానికి ముగింపు పలుకుతాం. అందుకు కరీంనగరే వేదిక కాబోతోంది. గత రెండ్రోజులుగా కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం కుట్రలను చూసి మేం భయపడలే. కనీస వ్యూహం, ఎత్తుగడలకు లేకుండా వ్యవహరించిన తీరును చూసి మేమంతా నవ్వుకున్నాం. ఈ విషయంలో బీఆర్ఎస్ కార్పొరేటర్ల పంథాను చూసి అభినందించకుండా ఉండలేకపోతున్నా. ప్రజాస్వామ్య తీర్పును శిరసావహించాలనే ఉద్దేశంతో పార్టీ నిర్ణయానికి భిన్నంగా వ్యవహరించిన తీరు గొప్ప విషయం.ఒక్క బండి సంజయ్ ను అడ్డుకోవడానికి, బీజేపీ సైనికులను అడ్డుకోవడానికి హైదరాబాద్ శివారులోని లియోనియో రిసార్ట్స్ వేదికగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం చేయని కుట్రలు లేవు. అయినా ఏం సాధించారు? ఒక్క బండి సంజయ్ ను అడ్డుకోలేకపోయారు? బీజేపీ సైనికులను అడ్డుకోలేకపోయారు? కాంగ్రెస్ మేయర్ ఎన్నికలో ఎలాంటి కుట్ర లేదని, కాంగ్రెస్ కు సంబంధం లేదని ముఖ్యమంత్రి చెప్పే దుమ్ముందా? మీ కుట్ర ఉందని నేను నిరూపిస్తా.కరీంనగర్ మేయర్ ఎన్నిక విషయోంలో పూర్తిగా సహకరించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావుకు పత్ర్యేక ధన్యవాదాలు. ఈ విషయంలో ఆయన చేయని సాయం లేదు. హ్యాట్సాఫ్... జాతీయ అధ్యక్షులు నితిన్ నబిన్ ఫోన్ చేసి ఎప్పటికప్పుడు సహకరించారు. వారికి ధన్యవాదాలు. కరీంనగర్ గెలుపుకు ప్రధాన కారణం నరేంద్రమోదీ ఇచ్చిన నిధులు, చేసిన అభివ్రుద్దే కారణం. కేంద్ర హోంమంత్రి అమిత్ షా సహకారం మరువలేనిది. వీరితోపాటు కిషన్ రెడ్డి, డాక్టర్ లక్ష్మణ్, డీకే అరుణసహా బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్సీలు ఎంతో సహకారం అందించారు. ముఖ్యంగా ఇతర జిల్లాల నుండి బీజేపీ కార్యకర్తలు వచ్చి కరీంనగర్ లో బీజేపీ గెలుపు కోసం కష్టపడి పనిచేసిన తీరు అభినందనీయం అన్నారు.



# ప్రశాంతంగా నిజామాబాద్ మున్సిపల్ ప్రత్యేక సమావేశాలు

## నిజామాబాద్ నగర పాలక సంస్థ మేయర్ గా కూరగాయల ఉమారాణి

## డిప్యూటీ మేయర్ గా సల్మా తహసీన్ ఎన్నిక

**ప్రజా వీక్షణం న్యూస్ నిజామాబాద్, ఫిబ్రవరి 16 :**

నిజామాబాద్ జిల్లాలోని నగర పాలక సంస్థతో పాటు బోధన్, ఆర్మూర్, భీంగల్ మున్సిపాలిటీల ప్రత్యేక సమావేశాలు సోమవారం ప్రశాంతంగా ముగిసాయి. నూతనంగా ఎన్నికైన సభ్యుల ప్రమాణ స్వీకారం, మేయర్/డిప్యూటీ మేయర్, చైర్ పర్సన్/వైస్ చైర్ పర్సన్ ల ఎన్నిక కోసం నిర్వహించిన ఈ ప్రత్యేక సమావేశాలకు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఇలా త్రిపాఠి మార్గనిర్దేశంలో అధికారులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. నిజామాబాద్ నగరపాలక సంస్థ సమావేశానికి నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్రకుమార్ ప్రిసైడింగ్ అధికారిగా వ్యవహరించగా, బోధన్, ఆర్మూర్ లలో సబ్ కలెక్టర్లు వికాస్ మహతో, అభిగ్యాన్ మాల్వియ, భీంగల్ లో జెడ్పీ సీ.ఈ.ఓ సాయగౌడ్ పీ.ఓగా బాధ్యతలు నిర్వర్తించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్దేశించిన మేరకు ఉదయం 11.00 గంటలకు ప్రత్యేక సమావేశాలు ప్రారంభం అయ్యాయి. ఆయా పార్టీల వారీగా సభ్యులు సమావేశ మందిరాలలోకి చేరుకోగా, తెలుగు అక్షరమాలను అనుసరిస్తూ వరుస క్రమంలో నూతనంగా ఎన్నికైన సభ్యులతో ప్రిసైడింగ్ అధికారులు ముందుగా ప్రమాణ స్వీకారం చేయించారు. ఎక్స్ అఫీషియో సభ్యులుగా హోదా కలిగిన ఎం.పీ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు సైతం స్పెషల్ మీటింగ్ లకు హాజరై మేయర్/డిప్యూటీ మేయర్, చైర్ పర్సన్/ వైస్ చైర్ పర్సన్ ఎన్నికలో పాల్గొన్నారు. ఎన్నికల సాధారణ పరిశీలకులు సీహెచ్.సత్యనారాయణ రెడ్డి ఎన్నిక ప్రక్రియను నిశితంగా పర్యవేక్షణ జరిపారు. మధ్యాహ్నం 12.30 గంటలకు సరిపడా కోరం ఉందని నిర్ధారించుకున్న మీదట ఎన్నిక ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. నిజామాబాద్ నగర పాలక సంస్థ మేయర్ పదవి కోసం కాంగ్రెస్ అభ్యర్థిగా 49వ డివిజన్ నుండి ఎన్నికైన కూరగాయల ఉమారాణి పేరును ఆ పార్టీకి చెందిన సభ్యుడు అగ్గు బోజన్న ప్రతిపాదించగా, అబుద్ బిన్ అథర్ బలపర్చారు. అలాగే, భారతీయ జనతా పార్టీ మేయర్ అభ్యర్థిగా జి.స్రవంతి రెడ్డి పేరును వీరమాచినేని ప్రమోద్ కుమార్ ప్రతిపాదించగా, ఎర్రం సుధీర్ బలపర్చారు. డిప్యూటీ మేయర్ పదవి కోసం ఎ.ఐ.ఎం.ఐ.ఎం తరఫున సల్మా తహసీన్, బీజేపి అభ్యర్థిగా బంటు రాము పోటీ పడ్డారు. దీంతో అధికారులు చేతులెత్తే విధానం ద్వారా ఎన్నిక జరిపించారు. నగర పాలక సంస్థలో మొత్తం 60 కార్పొరేటర్ లతో పాటు నిజామాబాద్ ఎం.పీ ధర్మపురి అరవింద్, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, ఎమ్మెల్యేలు డాక్టర్ భూపతి రెడ్డి, ధనపాల్ సూర్యనారాయణ, పి.రాకేశ్ రెడ్డిలు ఎక్స్ అఫీషియో హోదాలో ఓటింగ్ ప్రక్రియలో పాల్గొన్నారు. మొత్తం 65 మంది సభ్యులకు గాను 34 మంది సభ్యులు కాంగ్రెస్ అభ్యర్థిని కూరగాయల ఉమారాణిని మేయర్ గా, ఎఐఎంఐఎం అభ్యర్థిని సల్మా తహసీన్ ను డిప్యూటీ మేయర్ గా మద్దతు తెలిపారు. బీజేపీ అభ్యర్థులుగా పోటీ పడిన జి.స్రవంతి రెడ్డి, బంటు రాములకు 31 మంది మద్దతు లభించింది. దీంతో నిజామాబాద్ నగర మేయర్ గా ఉమారాణి, డిప్యూటీ మేయర్ గా సల్మా తహసీన్ లు ఎన్నికైనట్లు ప్రిసైడింగ్ అధికారి ప్రకటించి వారితో





ప్రమాణ స్వీకారం చేయించారు. నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్ క్షేత్రస్థాయిలో స్వీయ పర్యవేక్షణ జరుపుతూ, ఎలాంటి గందరగోళానికి తావులేకుండా ఎన్నికల సంఘం నిబంధనలను తు.చ తప్పకుండా పాటిస్తూ, వీడియో చిత్రీకరణ నడుమ పూర్తి పారదర్శకంగా ఈ ఎన్నికల ప్రక్రియను జరిపించారు. ఇదే తరహాలో బోధన్ మున్సిపల్ చైర్ పర్సన్ గా తూము పద్మాశరత్ రెడ్డి, వైస్ చైర్ పర్సన్ గా ఇలియాస్ అలీని, ఆర్మూర్ లో మున్సిపల్ చైర్ పర్సన్ గా లహరి స్వామి, వైస్ చైర్ పర్సన్ గా కాటిపల్లి వెంకట్ రెడ్డిని, భీంగల్ లో మున్సిపల్ చైర్ పర్సన్ గా బి.నాగమణి స్వామి, వైస్ చైర్ పర్సన్ గా లతలను ఎన్నుకున్నారు. మేయర్/డిప్యూటీ మేయర్, చైర్ పర్సన్/ వైస్ చైర్ పర్సన్ ల ఎన్నికను పురస్కరించుకుని ఎలాంటి అవాంచనీయ సంఘటనలకు తావులేకుండా మున్సిపల్ కార్యాలయాల వద్ద కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. నిజామాబాద్ నగర పాలక సంస్థ కార్యాలయం వద్ద అదనపు డీ.సీ.పీ బస్వారెడ్డి, ఏ.సీ.పీ ప్రకాష్ ఇతర పోలీసు అధికారులు బందోబస్తును పర్యవేక్షించారు.

## మున్సిపల్ చైర్ పర్సన్ గా కావ్య, వైస్ చైర్మన్ గా గణేష్ చక్రవర్తి ప్రమాణ స్వీకారం

**ప్రజా వీక్షణం న్యూస్ నిర్మల్ బ్యూరో ఫిబ్రవరి 16.**

ప్రమాణ స్వీకార కార్యక్రమం అనంతరం నూతనంగా ఎన్నికైన మున్సిపల్ చైర్‌పర్సన్ అప్పాల కావ్య మరియు వైస్ చైర్‌పర్సన్ అప్పాల గణేష్ చక్రవర్తి ప్రెస్ గ్యాలరీలో సీనియర్ జర్నలిస్టులను కలిసి, ఇటీవల ముగిసిన మున్సిపల్ ఎన్నికల సందర్భంగా మీడియా పోషించిన పాత్రకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారానికి విస్తృతంగా మరియు సమతుల్యంగా కవరేజ్ ఇచ్చినందుకు వారు మీడియా ప్రతినిధులకు ధన్యవాదాలు తెలిపారు. ప్రజలను సమాచారం కలిగినవారిగా ఉంచడంలో మీడియా చేసిన సహకారాన్ని వారు ప్రశంసించారు. తమ పదవీకాలాన్ని ప్రారంభిస్తున్న ఈ సమయంలో భవిష్యత్తులో కూడా సహకారం మరియు సృజనాత్మక భాగస్వామ్యం కొనసాగాలని వారు ఆకాంక్షించారు.సీనియర్ జర్నలిస్టులు ఎం.ఏ. వసీం, మహమ్మద్ ముఖీముద్దీన్, ఇష్తిఖార్ అహ్మద్, ఎం.ఏ. రషీద్, వసియుల్లా ఖాన్ మరియు ఎం.ఏ. అజీమ్ అప్పాల కావ్య మరియు అప్పాల గణేష్ చక్రవర్తిని ఏకగ్రీవంగా చైర్‌పర్సన్ మరియు వైస్ చైర్‌పర్సన్‌గా ఎన్నికైనందుకు అభినందించారు. ప్రజాకేంద్రీకృత పరిపాలనను విజయవంతంగా నడపాలని వారికి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా సీనియర్ కాంగ్రెస్ నాయకుడు మరియు మాజీ కేంద్ర మంత్రి డా. వేణుగోపాల చారి, అలాగే జిల్లా లైబ్రరీల చైర్మన్ సయ్యద్ అర్జుమంద్ అలీ హాజరై కార్యక్రమానికి మరింత గౌరవాన్ని చేకూర్చారు.ఈ చిన్నదైనా అర్థవంతమైన సమావేశం నూతన మున్సిపల్ నాయకత్వం మరియు మీడియా వర్గాల మధ్య పరస్పర గౌరవ భావాన్ని ప్రతిబింబిస్తూ, నిర్మల్‌లో పారదర్శక పాలన మరియు సహకార ప్రజాసేవకు సానుకూల వాతావరణాన్ని సృష్టించింది.




## ఆదిలాబాద్ మున్సిపల్ చైర్మన్ గా అనూష బండారి సతీష్,వైస్ చైర్మన్ ముహమ్మద్ రోహిత్

### మూడు పార్టీలతో ఏర్పడిన ఆసక్తికరమైన కూటమి

**ప్రజా వీక్షణం న్యూస్ ఆదిలాబాద్ :**

ఆదిలాబాద్ జిల్లా కేంద్రం లోని మున్సిపల్ కౌన్సిల్ హాల్ లో సోమవారం జరిగిన మున్సిపల్ చైర్మన్ ఎన్నిక చివరి వరకు ఉత్కంఠ భరితంగా కొనసాగింది.వార్డు కౌన్సిలర్లు ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం జరిగిన చైర్మన్ ఎన్నికలో 27 కౌన్సిలర్ ల సహకారంతో ( కాంగ్రెస్ 11,బిఆర్ఎస్ 6, ఏఐఎంఐఎం 6, స్వతంత్రు 4) వార్డు నంబర్ 45 స్వతంత్ర అభ్యర్థి అనూష బండారి సతీష్ మున్సిపల్ చైర్మన్ గా ఎన్నిక కాగా,వైస్ చైర్మన్ గా వార్డ్ నెంబర్ 44 ఏఐఎంఐఎం అభ్యర్థి ముహమ్మద్ రోహిత్ ఎన్నికయ్యారు.ప్రథమంగా జిల్లాలో ఆసక్తికరంగా మూడు పార్టీల కూటమి ఏర్పడింది.ప్రమాణ స్వీకారం అనంతరం మున్సిపల్ కౌన్సిల్ హాల్ నుండి బయటకు వచ్చిన నూతన చైర్మన్ అనూష బండారి మాట్లాడుతూ తనకు సహకరించిన కాంగ్రెస్,బిఆర్ఎస్,ఎంఐఎం,ఇండిపెండెంట్ అభ్యర్థులకు కృతజ్ఞతలు తెలుపుతూ,తనపై విశ్వాసం ఉంచి గెలిపించిన ప్రజలకు సేవ చేసే అవకాశం కల్పించినందుకు ధన్యవాదాలు తెలియజేశారు. వాయిస్ చైర్మన్ రోహిత్ ఎంఐఎం పార్టీ అధినేత అసదుద్దీన్ ఓవైసీకి ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మరియు పార్టీ పట్టణ అధ్యక్షులు నజీర్ అహ్మద్ కు కృతజ్ఞతలు తెలిపారు.అలాగే ప్రతి వార్డు లో అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని ప్రజలకు అభినందనలు తెలిపారు.




## ఆత్మవిశ్వాసంతో ఆడి జిల్లా పేరు నిలబెట్టాలి.

### - జిల్లా కలెక్టర్ రాజర్షి షా

**ప్రజా వీక్షణం న్యూస్ ఆదిలాబాద్ :**

ప్రత్యేక అవసరాలున్న విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో క్రీడల్లో పాల్గొని రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చాటి జిల్లా కీర్తిని పెంచాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఆకాంక్షించారు.సోమవారం కలెక్టరేట్ ప్రాంగణంలో రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు బయలుదేరిన విద్యార్థుల బస్సును ఆయన జెండా ఊపి ప్రారంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,శారీరక,మానసిక వైకల్యాలను అధిగమించి క్రీడల్లో రాణించడం అభినందనీయమన్నారు.ప్రతి విద్యార్థిలో ప్రత్యేక ప్రతిభ దాగి ఉంటుందని,దానిని వెలికితీసి పట్టుదలతో శ్రమిస్తే ఉన్నత ఫలితాలు సాధ్యమని తెలిపారు.క్రమశిక్షణ,క్రీడాస్ఫూర్తితో పోటీల్లో పాల్గొని జిల్లాకు పతకాలు సాధించాలని సూచించారు.విద్యార్థులకు అవసరమైన సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో సెక్టోరల్ అధికారులు రఘు రమణ,షుజాత్ ఖాన్,ఇతర అధికారులు,పాఠశాలల ఉపాధ్యాయులు,తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



ప్రజావీక్షణం
దినపత్రిక
17 మంగళవారం, ఫిబ్రవరి 2026
SPORTS/ BUSINESS
www.prajaveekshanam.in

## పాక్ ఓటమిని శాసించింది వీరే..




టీ20 వరల్డ్ కప్ 2026లో భారత జట్టు పాకిస్థాన్‌పై మరో చిరస్మరణీయ విజయాన్ని నమోదు చేసింది. దాంతో సూపర్-8లో తన స్థానాన్ని దాదాపు ఖరారు చేసుకుంది. ఎంతో ఉత్కంఠ రేపుతుందని ఆశించిన ఫ్యాన్స్ కు నిరాశ కలిగిస్తూ ఏకపక్షంగా సాగిన మ్యాచులో భారత్ 61 పరుగుల తేడాతో పాకిస్థాన్‌ను చిత్తు చేసింది. కొలంబోలోని ఆర్. ప్రేమదాస స్టేడియంలో జరిగిన పోరులో కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ సారథ్యంలోని టీమ్ ఇండియా అటు బ్యాటింగ్, ఇటు బౌలింగ్ లో అద్భుత ప్రదర్శన చేసింది. టాస్ ఓడి ఫస్ట్ బ్యాటింగ్ చేసిన భారత్ 20 ఓవర్లలో 175 పరుగులు బోర్డుపై ఉంచింది. టీ20 వరల్డ్ కప్‌లో పాకిస్థాన్‌పై భారత్‌కు ఇదే అత్యధిక స్కోరు కావడం విశేషం. ఆరంభంలోనే షాక్ తగిలినప్పటికీ, ఆ తర్వాత మరో ఓపెనర్ ఇషాన్ కిషన్ తన ధనాధన్ బ్యాటింగ్‌తో మ్యాచ్ స్వరూపాన్ని మార్చేశాడు. ఇషాన్ వేగంగా పరుగులు రాబడుతూ 40 బంతుల్లో 77 పరుగులు చేశాడు. స్టేడియం నలుమూలలా షాట్లు ఆడుతూ పాకిస్థాన్ బౌలర్లపై ఒత్తిడి పెంచడంలో సక్సెస్ అయ్యాడు. తన పరుగులతో భారత విజయంలో కీలక పాత్ర పోషించి ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ దక్కించుకున్నాడు. ఇషాన్ కిషన్ అవుట్ అయిన తర్వాత కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ ఇన్నింగ్స్‌ను చక్కదిద్దాడు. మిడిల్ ఓవర్లలో ఆచితూచి బ్యాటింగ్ చేస్తూ తిలక్ వర్మతో కలిసి భాగస్వామ్యం నెలకొల్పి జట్టు స్కోరును 170 దాటించడంలో కీలకపాత్ర పోషించాడు. . సూర్య 29 బంతుల్లో 32 పరుగులు చేయగా.. చివర్లో ఆల్ రౌండర్ శివమ్ దూబె 158.82 స్ట్రైక్ రేట్‌తో 27 పరుగులు చేశాడు. దాంతో భారత్ ఈ పిచ్ మీద పాక్‌కు భారీ టార్గెట్ ఇవ్వగలిగారు. 175 పరుగుల టార్గెట్ కాపాడుకునే క్రమంలో బరిలోకి దిగిన భారత జట్టుకు బౌలర్లు అద్భుత ఆరంభాన్ని ఇచ్చారు. హార్దిక్ పాండ్యా తన మొదటి ఓవర్లోనే పాకిస్థాన్ ఓపెనర్‌ను అవుట్ చేసి తొలి దెబ్బ కొట్టాడు. 3 ఓవర్లలో కేవలం 16 పరుగులు ఇచ్చి 2 వికెట్లు తీశాడు. తన బౌలింగ్ లో పాక్ బ్యాటర్లకు స్వేచ్ఛగా ఆడే అవకాశం ఇవ్వలేదు. పాక్ స్పిన్నర్లతో ఇబ్బంది పెడితే భారత్ మాత్రం పేసర్లు, స్పిన్నర్లతో పాక్ ను కట్టడి చేసింది.భారత ఫాస్ట్ బౌలర్ జస్ప్రీత్ బుమ్రా తన స్పెల్‌లో సయీమ్ అయూబ్, పాక్ కెప్టెన్ సల్మాన్ అలీ ఆగా వికెట్లు తీసి పాకిస్థాన్ బ్యాటింగ్‌ను బ్యాక్‌ఫుట్‌లోకి నెట్టాడు. బుమ్రా బౌలింగ్ తో పాక్ బ్యాటర్లు పరుగులు చేయడానికి ఇబ్బంది పడ్డారు. మిడిల్ ఓవర్లలో స్పిన్నర్ అక్షర్ పటేల్ రాణించాడు. పాకిస్థాన్ కీలక బ్యాటర్లను అవుట్ చేసి మ్యాచ్‌పై భారత్ పట్టు బిగించేలా చేశాడు. వీరికి తోడు మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి కూడా ఒకే ఓవర్లో రెండు వికెట్లు తీశాడు. 176 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన పాకిస్థాన్ జట్టు భారత బౌలర్ల ధాటికి 114 పరుగులకే కుప్పకూలింది. ఈ విజయంతో భారత్ తన గ్రూపులో అగ్రస్థానాన్ని నిలుపుకుంది. టీ20 వరల్డ్ కప్‌లో పాక్ పై భారత్ ఆధిక్యం 8-1కి పెరిగింది. భారత్ నెక్స్ట్ మ్యాచ్‌ను ఫిబ్రవరి 18న నరేంద్ర మోదీ స్టేడియంలో నెదర్లాండ్స్‌తో ఆడనుంది.

## 19 ఏళ్ల తర్వాత చరిత్ర సృష్టించిన ఇషాన్ కిషన్..!

టీ20 వరల్డ్ కప్‌లో దాయాది దేశాల మధ్య జరిగిన హై-వోల్టేజ్ పోరులో టీమిండియా ఘనవిజయం సాధించింది. భారత బౌలర్లు నిప్పులు చెరిగే బంతులతో విరుచుకుపడటంతో.. పాక్ బ్యాటర్లు బెంబేలెత్తిపోయారు. ఏ దశలోనూ పోటీ ఇవ్వలేకపోయిన పాకిస్తాన్ జట్టును.. భారత్ 61 పరుగుల భారీ తేడాతో చిత్తు చేసి, తన అజేయమైన రికార్డును కొనసాగించింది. ముందుగా టాస్ గెలిచిన పాకిస్తాన్ జట్టు తొలుత బౌలింగ్ ఎంచుకుంది. దీంతో భారత జట్టు మొదట బ్యాటింగ్ చేసింది. ఓపెనర్లు ఇషాన్ కిషన్, అభిషేక్ శర్మ ఓపెనర్లుగా క్రీజులోకి వచ్చారు. అయితే, అభిషేక్ డకౌట్ రూపంలో మొదటి ఓవర్లోనే ఔట్ అయ్యాడు. దీంతో పాక్ ప్లేయర్లు సంబరాలు చేసుకున్నారు. అయితే, వారి ఆనందం ఎక్కువసేపు నిలవలేదు. టీమిండియా ఓపెనర్ ఇషాన్ కిషన్ పాకిస్తాన్ బౌలర్లపై బ్యాటుతో విరుచుకుపడ్డాడు. ఈ మ్యాచ్‌లో ఇషాన్ కిషన్ హిస్టరీ క్రియేట్ చేశాడు. ఐసీసీ టీ20 ప్రపంచ కప్ 2007 ఫైనల్ తరువాత పాకిస్తాన్ జట్టుపై హాఫ్ సెంచరీ బాదిన తొలి ఓపెనర్‌గా ఇషాన్ కిషన్ చరిత్రకెక్కాడు. టీ20 ప్రపంచ కప్ 2026లో భాగంగా ఆదివారం పాకిస్తాన్ జట్టుతో జరిగిన మ్యాచ్‌లో ఇషాన్ కిషన్ 40 బంతుల్లో 77 పరుగులు చేయడం




ద్వారా ఈ ఘనత సాధించాడు. పాకిస్తాన్ జట్టుపై జరిగిన మ్యాచ్‌లో దూకుడుగా ఆడిన ఇషాన్ కిషన్ 27 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఈ క్రమంలో గత 19 ఏళ్ల రికార్డును బద్దలు కొట్టాడు. గత 19 ఏళ్లలో ఏ భారత ఓపెనర్ కూడా పాక్‌పై టీ20 ప్రపంచ కప్‌లో హాఫ్ సెంచరీ సాధించలేదు. చివరి సారిగా 2007 టీ20 వరల్డ్ కప్ ఫైనల్లో గౌతమ్ గంభీర్ ఓపెనర్‌గా వచ్చి పాకిస్తాన్‌పై హాఫ్ సెంచరీ సాధించాడు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఏ భారత ఓపెనర్ హాఫ్ సెంచరీ సాధించలేదు. రోహిత్ శర్మ, శిఖర్ ధావన్, కేఎల్ రాహుల్ ఓపెనర్లుగా బరిలోకి దిగినా పాకిస్తాన్ జట్టుపై 50 పరుగులు చేయలేక పోయారు. తాజాగా.. ఆ ఘనతను ఇషాన్ కిషన్ సాధించాడు.




## 10వ తరగతి పరీక్షలకు వైభవ్ సూర్యవంశీ డుమ్మా!

టీమ్ ఇండియా అండర్-19 ప్రపంచ కప్ 2026 టైటిల్ గెలవడంలో కీలకపాత్ర పోషించాడు 14 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ. గత ఏడాది నుంచి నిత్యం వార్తల్లో నిలుస్తున్నాడు ఈ టీనేజ్ సంచలనం. ఇటీవల వైభవ్ సూర్యవంశీ 10వ తరగతి పరీక్ష రాయబోతున్నాడని వార్త వచ్చింది. తాజా సమాచారం ప్రకారం వైభవ్ సూర్యవంశీ పరీక్షలకు హాజరు కావడం లేదు. ఈ విషయాన్ని క్రికెటర్ వైభవ్ తండ్రి స్వయంగా తెలిపారు. తాజ్‌పూర్ లోని మోడెస్టీ పాఠశాల ప్రిన్సిపాల్ ఆదర్శ్ కుమార్ అలియాస్ పింటూ మాట్లాడుతూ వైభవ్ సూర్యవంశీ తండ్రితో మాట్లాడిన తర్వాత ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. భారత క్రికెట్ కంట్రోల్ బోర్డ్ బిజీ షెడ్యూల్ కారణంగా వైభవ్ పరీక్షలు రాయలేకపోతున్నాడని, అయితే అతని ప్రిపరేషన్స్, ఎగ్జాట్ సెంటర్ సంబంధించిన అన్ని ఫార్మాలిటీస్ పూర్తయ్యాయని ఆయన అన్నారు. మొదట తాను పరీక్షలకు హాజరు కావాలని బీసీసీఐని పర్మిషన్ అడిగాడని వార్తలు వచ్చాయి. కానీ అండర్ 19 టీం బిజీ షెడ్యూల్స్, మ్యాచ్‌లకు అందుబాటులో ఉండేందుకు టెన్త్ బోర్డ్ ఎగ్జామ్స్ రాయడం లేదని తెలుస్తోంది. తాజా సమాచారం ప్రకారం వైభవ్ సూర్యవంశీ ఎగ్జామ్ సెంటర్ పోద్దార్ ఇంటర్నేషనల్ స్కూల్, సమస్తిపూర్ లో ఉంది. స్కూల్ ప్రిన్సిపాల్ నీల్ కిషోర్ ఈ విషయాన్ని ధృవీకరిస్తూ వైభవ్ అడ్మిట్ కార్డు వచ్చిందని, అన్ని అవసరమైన డాక్యుమెంట్లు స్కూల్ యాజమాన్యం వద్ద భద్రంగా ఉంచామని చెప్పారు. వైభవ్ సాధారణ విద్యార్థిలాగే పరీక్షకు వస్తాడని, అతని కోసం ఎలాంటి ప్రత్యేక ఏర్పాట్లు చేయలేదని ఆయన స్పష్టం చేశారు.


## ఇంగ్లాండ్‌ను వణికించిన ఇటలీ

### 24 పరుగుల తేడాతో ఓడిన ఇటలీ

### సూపర్ 8 రేసు నుంచి ఇటలీ నిష్క్రమణ

### సూపర్ 8కు చేరిన ఇంగ్లాండ్ జట్టు

టీ20 వరల్డ్‌కప్‌లో ఇంగ్లాండ్ మూడో విజయం నమోదు చేసి సూపర్ 8కు దూసుకెళ్లింది. గ్రూప్ దశలో భాగంగా సోమవారం ఇటలీతో జరిగిన మ్యాచ్?లో 24 పరుగుల తేడాతో నెగ్గింది. ఇంగ్లాండ్ నిర్దేశించిన 203 పరుగుల టార్గెట్?ను ఇటలీ ఓవర్లన్నీ ఆడి 178 పరుగులకు ఆలౌట్ అయ్యింది. బెన్ మనెంటి (60 పరుగులు, 25 బంతుల్లో) మెరుపు ఇన్నింగ్స్ వృథా అయ్యింది. ఇంగ్లాండ్ బౌలర్లలో శామ్ కరన్, జెమీ ఒవర్టన్ చెరో 3, జోఫ్రా ఆర్చర్ 2, విల్ జాక్స్, ఆదిల్ రషీద్ చెరో 1 వికెట్ దక్కించుకున్నారు. తొలుత బ్యాటింగ్ చేసిన ఇంగ్లాండ్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 202 పరుగులు చేసింది. విల్ జాక్స్ (53 పరుగులు, 22 బంతుల్లో) మెరుపు హాఫ్ సెంచరీ సాధించాడు. టామ్ బంటన్ (30 పరుగులు), ఫిల్ సాల్ట్ (28 పరుగులు), శామ్ కరన్ (25 పరుగులు), జాకబ్ బెతెల్ (23 పరుగులు) ఆకట్టుకున్నారు. ఇటలీ బౌలర్లలో గ్రాంట్ స్టీవార్ట్, క్రిషన్ కలుగమానే చెరో 2, జేజే స్మట్స్, అలీ హసన్, బెన్ మనెంటి తలో 1 వికెట్ దక్కించుకున్నారు. కాగా, ఈ టోర్నీలో రెండో ఓటమితో గ్రూప్ సీ నుంచి ఇటలీ సూపర్ 8 రేసు నుంచి నిష్క్రమించింది. ఇప్పటిదాకా మూడు మ్యాచ్?లు ఆడగా, ఇటలీ ఒక మ్యాచ్? (నేపాల్?తో)లోనే నెగ్గింది. ఇక లీగ్ స్టేజ్?లో చివరిదైన నాలుగో మ్యాచ్ ఫిబ్రవరి 19న వెస్టిండీస్?తో జరగనుంది. ఈ గ్రూప్?లో ఇప్పటికే వెస్టిండీస్ సూపర్ 8కు అర్హత సాధించింది.




## ఎట్టకేలకు బోణీ కొట్టిన అఫ్ఘానిస్థాన్

### యూఏఈపై అఫ్గాన్ ఘన విజయం

### అఫ్గాన్ సూపర్ 8 ఛాన్స్ సజీవం

టీ20 ప్రపంచకప్?లో అఫ్గానిస్థాన్ ఎట్టకేలకు బోణీ కొట్టింది. ఈ టోర్నీలో తొలి రెండు మ్యాచ్?లో ఓటమిపాలైన అఫ్గాన్, తాజాగా యూఏఈపై ఘన విజయం సాధించింది. యూఏఈ నిర్దేశించిన 161 పరుగుల టార్గెట్?ను 19.2 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఇబ్రహీం జర్దాన్ (53 పరుగులు), అజ్మతుల్లా ఒమర్జాయ్ (40బి పరుగులు) రాణించారు. యూఏఈ బౌలర్లలో జునైద్ సిద్ధిఖీ 2, మహ్మద్ అర్ఫాన్ చెరో 2, మహ్మద్ జువాదుల్లా 1 వికెట్ దక్కించుకున్నారు.తొలుత బ్యాటింగ్ చేసిన యూఏఈ నిర్ణీత 20 ఓవర్లలో9 వికెట్ల నష్టానికి 160 పరుగులు చేసింది. షోయబ్ ఖాన్ (68 పరుగులు) హాఫ్ సెంచరీతో రాణించగా, అలిశన్ షరపు (40 పరుగులు) ఆకట్టుకున్నాడు. అఫ్గాన్ బౌలర్లలో అజ్మతుల్లా ఒమర్జాయ్ 4, ముజీబ్ అర్ రెహ్మాన్ 2, రషీద్ ఖాన్ 1 వికెట్ దక్కించుకున్నారు. కాగా, ఈ మ్యాచ్?లో అఫ్గాన్ కెప్టెన్ రషీద్ ఖాన్ అరుదైన ఘనత సాధించాడు. ఈ మ్యాచ్?లో అర్ఫాన్ వికెట్ తీయడంతో టీ20ల్లో 700 వికెట్లు పడగొట్టిన తొలి బౌలర్?గా నిలిచాడు. మొత్తం 513 టీ20ల్లో ఈ ఫీట్ అందుకున్నాడు. ఇందులో ఆయా దేశాల లీగులు, అంతర్జాతీయ టీ20 క్రికెట్?లో కలిపి ఈ వికెట్లు సాధించాడు. టీ20 క్రికెట్?లో 700 వికెట్ల మైలురాయి అందుకున్న ఏకైక బౌలర్?గా రషీద్ నిలిచాడు. ఇందులో అంతర్జాతీయ టీ20ల్లో 191 వికెట్లు పడగొట్టాడు. అత్యధిక వికెట్లు తీసిన అఫ్గాన్ బౌలర్?గానూ రషీద్ టాప్?లో కొనసాగుతున్నాడు. అటు ఐపీఎల్?లో అతడు 114 మ్యాచ్?ల్లో 158 వికెట్లు కూల్చాడు. ఇక ఓవరాల్?గా రషీద్ తర్వాత ఈ లిస్ట్?లో వెస్టిండీస్ మాజీ క్రికెటర్ డ్వేన్ బ్రావో 631 వికెట్లతో రెండో స్థానంలో ఉన్నాడు. అదే దేశానికి చెందిన సునీల్ నరైన్ 613 వికెట్లతో ఈ లిస్ట్?లో మూడో స్థానంలో కొనసాగుతున్నాడు. టీ20 వరల్డ్?కప్? హిస్టరీలో 140o పరుగుల ఛేదనలో అఫ్గాన్?కు ఘనమైన రికార్డేమీ లేదు. ఇప్పటిదాకా 15సార్లు 140o పరుగుల ఛేదనలో దిగిన అఫ్గాన్, ఈ మ్యాచ్?సహా విజయం సాధించింది కేవలం నాలుగు మ్యాచ్?ల్లోనే. అత్యధికంగా 10సార్లు ఓడింది. ఈ టోర్నీలోనే సౌతాఫ్రికాతో మ్యాచ్ టై అయ్యింది. ఇక ప్రస్తుత టోర్నమెంట్?లో గ్రూప్ డీలో ఉన్న అఫ్గాన్ తొలి మ్యాచ్?లో న్యూజిలాండ్?ను ఢీ కొట్టింది. ఆ మ్యాచ్?లో 5 వికెట్ల తేడాతో ఓడింది. తర్వాత సౌతాఫ్రికాతో మ్యాచ్?లో గెలుపు అంచులదాకా వెళ్లి బోల్తా కొట్టింది. ఆ మ్యాచ్? డ్రా అవ్వడంతో సూపర్ ఓవర్?కు వెళ్లింది. అయితే సూపర్ ఓవర్ కూడా డ్రా అవ్వడంతో రెండోసారి సూపర్ ఓవర్ నిర్వహించాల్సి వచ్చింది. ఇక రెండో సూపర్ ఓవర్?లో 5 పరుగుల తేడాతో సౌతాఫ్రికా నెగ్గింది. దీంతో అఫ్గాన్?కు వరుసగా రెండో ఓటమి ఎదురైంది. టోర్నీలో నిలవాలంటే తప్పక నెగ్గాల్సిన పరిస్థితిలో యూఏఈపై విజయం సాధించి సూపర్ 8 ఆశలు సజీవంగా ఉంచుకుంది. గ్రూప్ దశలో అఫ్గాన్ తమ ఆఖరి మ్యాచ్?లో కెనడాను ఢీ కొట్టాల్సి ఉంది.

## రోహిత్ శర్మ, వసీం అక్రమ్ ఆలింగనం..



ప్రపంచ క్రికెట్‌లో భారత్-పాకిస్తాన్ మ్యాచ్ అంటే కేవలం ఆట మాత్రమే కాదు, అదొక ఎమోషన్. శ్రీలంక వేదికగా జరుగుతున్న టీ20 వరల్డ్ కప్ 2026లో భాగంగా ఆదివారం (ఫిబ్రవరి 15) జరిగిన పోరులో టీమిండియా అద్భుత విజయం సాధించింది. అయితే ఈ మ్యాచ్‌లో ఆట కంటే కూడా మైదానం వెలుపల జరిగిన కొన్ని సంఘటనలు ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారాయి. ముఖ్యంగా ఇరు జట్ల ఆటగాళ్లు కనీసం చేతులు కూడా కలుపుకోకపోవడం ఒక ఎత్తైతే, టీమిండియా మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ, పాక్ దిగ్గజం వసీం అక్రమ్ ఒకరినొకరు ఆలింగనం చేసుకోవడం చర్చనీయాంశమైంది. 2025 ఆసియా కప్ నుంచి ఇరు దేశాల మధ్య నెలకొన్న ఉద్రిక్తతల కారణంగా ఆటగాళ్లు ఒకరికొకరు షేక్ హ్యాండ్ ఇచ్చుకోవడం మానేశారు. ఈ వరల్డ్ కప్ మ్యాచ్‌లో కూడా టాస్ సమయంలో సూర్యకుమార్ యాదవ్, పాక్ కెప్టెన్‌కు కనీసం చేయి కూడా కలపలేదు. మ్యాచ్ ముగిసిన తర్వాత కూడా ప్లేయర్లు నేరుగా డ్రెస్సింగ్ రూమ్‌కి వెళ్ళిపోయారు తప్ప గతంలోలా పలకరించుకోలేదు. అయితే, ఈ టీ20 ప్రపంచకప్‌కు అంబాసిడర్‌గా వ్యవహరిస్తున్న రోహిత్ శర్మ మాత్రం తన క్రీడా స్ఫూర్తిని చాటుకున్నాడు. మైదానంలో వసీం అక్రమ్‌ను చూడగానే దగ్గరకు వెళ్లి ఆత్మీయంగా హత్తుకున్నాడు. దీనికి సంబంధించిన వీడియో ఇప్పుడు ఇంటర్నెట్‌లో విపరీతంగా షేర్ అవుతోంది. మ్యాచ్ విషయానికి వస్తే.. టాస్ గెలిచిన పాకిస్తాన్ మొదట బౌలింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్‌కు దిగిన టీమిండియా నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 175 పరుగులు చేసింది. ఓపెనర్ ఇషాన్ కిషన్ కేవలం 40 బంతుల్లోనే 10 ఫోర్లు, 3 సిక్సర్లతో విరుచుకుపడి 77 పరుగులు చేశాడు. యువ బ్యాటర్ల మెరుపులతో భారత్ గౌరవప్రదమైన స్కోరును బోర్డుపై ఉంచింది. మెరుపు ఇన్నింగ్స్ ఆడిన ఇషాన్‌కే ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది. 176 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన పాకిస్తాన్ ఏ దశలోనూ భారత బౌలర్లకు పోటీ ఇవ్వలేకపోయింది. జస్ప్రీత్ బుమ్రా, హార్దిక్ పాండ్యా, అక్షర్ పటేల్, వరుణ్ చక్రవర్తి తలో రెండు వికెట్లతో పాక్ నడ్డి విరిచారు. పాక్ బ్యాటర్లలో ఉస్మాన్ ఖాన్ (44) తప్ప మిగిలిన వారందరూ పెవిలియన్‌కు క్యూ కట్టారు. ఆ జట్టులో ఏకంగా ఏడుగురు బ్యాటర్లు రెండంకెల స్కోరు (10 పరుగులు) కూడా చేయలేకపోవడమే వారి ఘోర వైఫల్యానికి నిదర్శనం. ఫలితంగా 18 ఓవర్లలోనే పాకిస్తాన్ 114 పరుగులకే ఆలౌట్ అయింది.రిటైర్మెంట్ తర్వాత కూడా రోహిత్ శర్మ క్రేజ్ ఏమాత్రం తగ్గలేదని కొలంబో స్టేడియంలో అర్థమైంది. వరల్డ్ కప్ అంబాసిడర్‌గా ఆయన రాకతో గ్యాలరీల్లో జోష్ పెరిగింది. ఒకవైపు ఆటగాళ్ల మధ్య గొడవలు, షేక్ హ్యాండ్స్ వివాదాలు నడుస్తున్నా.. రోహిత్ మాత్రం హుందాగా ప్రవర్తించి అందరి ప్రశంసలు అందుకుంటున్నాడు. సోషల్




## వ్యూవర్‌షిప్‌లో జియో హాట్‌స్టార్ ఆల్‌టైమ్ రికార్డ్!

ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026లో భాగంగా భారత్, పాకిస్థాన్ మధ్య జరిగిన హైఓల్టేజ్ మ్యాచ్‌తో అధికార బ్రాడ్‌కాస్టర్ జియో హాట్‌స్టార్ పంట పండింది. ఈ మ్యాచ్‌లో భారత్ ఆధిపత్యం చెలాయించి మ్యాచ్‌ను ఏకపక్షంగా .వ్యూయర్‌షిప్‌లో మాత్రం సరికొత్త రికార్డ్ నమోదైంది. ఈ మ్యాచ్‌కు 45.4 కోట్ల కాన్‌కరెంట్ వ్యూస్ వచ్చాయని జియో హాట్‌స్టార్ అధికారికంగా ప్రకటించింది. క్రికెట్ చరిత్రలోనే ఇది సరికొత్త రికార్డ్. క్రికెట్ లైవ్ మ్యాచ్‌లు డిజిటల్ ఫ్లాట్‌ఫామ్స్ వేదికగా అందుబాటులోకి వచ్చాక వ్యూస్ విపరీతంగా పెరిగాయి.ఇప్పటి వరకు క్రికెట్ చరిత్రలో ఒకే సమయంలో అత్యధికంగా చూసిన మ్యాచ్ 2023 వన్డే ప్రపంచ కప్ ఫైనల్ (భారత్ జం ఆస్ట్రేలియా). దీనికి 5.9 కోట్ల లైవ్ కాన్‌కరెంట్ వ్యూస్ వచ్చాయి. అయితే జియో హాట్ స్టార్ తాజాగా ప్రకటించిన వ్యూస్. మ్యాచ్ మొదలైనప్పటి నుంచి చివరి వరకు వచ్చి వెళ్లిన మొత్తం జనాభా సంఖ్య. కానీ లైవ్ కాన్‌కరెంట్ వ్యూయర్‌షిప్ అంటే ఒకే సమయంలో లైవ్‌లో ఉన్నవారు.

## బాబర్ ఆజామ్‌పై అశ్విన్ వ్యంగ్యాస్త్రాలు





పాకిస్థాన్ బ్యాటర్ బాబర్ ఆజామ్‌పై టీమిండియా స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ వ్యంగ్యాస్త్రాలు సంధించాడు. మెరుపు తీగలా వచ్చి వెళ్లిపోయాడని సెటైర్స్ వేసాడు. ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026లో భాగంగా ఆదివారం పాకిస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌లో భారత్ 61 పరుగుల తేడాతో విజయం సాధించిన సంగతి తెలిసిందే.భారత్ నిర్దేశించిన 176 పరుగుల లక్ష్య ఛేదనలో పాకిస్థాన్ 114 పరుగులకు ఆలౌటైంది. హార్దిక్ పాండ్యా, జస్‌ప్రీత్ బుమ్రా తొలి రెండు ఓవర్లలోనే పాకిస్థాన్ సైమ్ అయూబ్, సాహిబ్‌జా ఫర్హాన్, సల్మాన్ అలీ అఘా ఔటవ్వడంతో పాకిస్థాన్ తీవ్ర ఒత్తిడికి లోనైంది. ఈ పరిస్థితుల్లో జట్టును ఆదుకునే బాధ్యత బాబర్ ఆజంపై పడింది. కానీ 31 ఏళ్ల బాబర్ ఆజామ్ తీవ్రంగా నిరాశపర్చాడు. లెఫ్టార్మ్ స్పిన్నర్ అక్షర్ పటేల్ వేసిన ఐదో ఓవర్‌లో స్వీప్ షాట్ ఆడబోయి క్లీన్ బౌల్డ్ అయ్యాడు.దాంతో కేవలం ఏడు బంతుల్లో ఐదు పరుగులు మాత్రమే చేసి బాబర్ త్వరగానే పెవిలియన్ చేరాడు. బాబర్ ఆజామ్ ఔటైన తీరుపై రవిచంద్రన్ అశ్విన్ సోషల్ మీడియా వేదికగా స్పందించాడు. పాపులర్ కామెంటేటర్, టీమిండియా మాజీ హెడ్ కోచ్ రవిశాస్త్రి తన వ్యాఖ్యనంలో తరుచూ చెప్పే డైలాగ్‌తో బాబర్ ఆజామ్‌పై వ్యంగ్యాస్త్రాలు సంధించాడు.బాబర్ ఆజం నిష్క్రమణపై అభిమానులు కూడా తమదైన శైలిలో స్పందించారు. తెలుగు సినిమా సింహరాశిలోని ఫేమస్ డైలాగ్ అయిన 'మెరుపు తీగ వచ్చి పోమ్మా' అనే వ్యాఖ్యతో సెటైర్లు పేలుస్తున్నారు. బాలీవుడ్ చిత్రం 'దురందర్'లో భారత ఏజెంట్ పాకిస్థాన్‌ను నాశనం చేసినట్లుగా బాబర్ తన జట్టును నాశనం చేశాడని మరికొందరు ఫన్నీ కామెంట్స్ చేశారు. బాబర్ ఔటైన తర్వాత పాకిస్థాన్ ఇన్నింగ్స్ కుప్పకూలింది. ఉస్మాన్ ఖాన్(44) పోరాడినా ఫలితం లేకపోయింది. అతనికి ఇతర బ్యాటర్ల నుంచి మద్దతు లభించలేదు. దాంతో పాకిస్థాన్ 18 ఓవర్లలో 114 పరుగులకే కుప్పకూలి ఘోర పరాజయాన్ని మూటగట్టుకుంది. హార్దిక్ పాండ్యా, జస్‌ప్రీత్ బుమ్రా, వరుణ్ చక్రవర్తి, అక్షర్ పటేల్ రెండేసి వికెట్లతో పాకిస్థాన్ పతనాన్ని శాసించారు.

ప్రజావీక్షణం దినపత్రిక

# 26న ఉదయ్‌పూర్‌లో రష్మిక, విజయ్‌ల పెళ్లి

## మార్చి4న హైదరాబాద్‌లో రిసిప్షన్ అంటూ ప్రచారం

టాలీవుడ్‌లో హిట్ ఫెయిర్ హీరో విజయ్ దేవరకొండ- హీరోయిన్ రష్మిక మందన్న పెళ్లి వార్తలు ఇప్పుడు మరింత జోరందుకున్నాయి. వీరు వివాహ బంధంలోకి అడుగుపెట్టబోతున్నారనే ప్రచారం సోషల్ మీడియా, సినీ వర్గాల్లో వైరల్ అవుతోంది. ఫిబ్రవరి చివరి వారంలో వీరి పెళ్లి జరగనుందనే టాక్ ఇండస్ట్రీలో సెన్సేషన్ సృష్టిస్తోంది. రాజస్థాన్‌లోని అందమైన నగరం ఉదయ్‌పూర్ లోని ఓ రాయల్ ప్యాలెస్‌లో అత్యంత సన్నిహితులు, కుటుంబ సభ్యుల మధ్య సింపుల్‌గా పెళ్లి వేడుక జరపాలని ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఫిబ్రవరి 26 తేదీని ముహూర్తంగా ఖరారు చేసినట్లు ఇండస్ట్రీలో చర్చ నడుస్తోంది. ఈ వేడుకను గోప్యంగా ఉంచేందుకు ఎంత ప్రయత్నించినా సోషల్ మీడియాలో సమాచారం లీక్ అవుతూనే ఉండటం గమనార్హం. పెళ్లి వేడుక ఉదయ్‌పూర్‌లో సాదాసీదాగా జరిగినా, అసలు హంగామా మాత్రం హైదరాబాద్ లోనే ఉండబోతుందని టాక్. మార్చి 4న నగరంలోని ప్రముఖ వేదికలో సినీ, రాజకీయ ప్రముఖుల కోసం భారీ రిసెప్షన్ నిర్వహించనున్నట్లు సమాచారం. టాలీవుడ్‌తో పాటు బాలీవుడ్‌కు చెందిన పలువురు స్టార్ సెలబ్రిటీలు ఈ వేడుకకు హాజరవుతారని అంచనాలు వ్యక్తమవుతున్నాయి.ఇటీవల విజయ్ దేవరకొండ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని కలిసి ఆహ్వాన పత్రిక అందించారనే ప్రచారం ఈ పెళ్లి వార్తలకు మరింత బలం చేకూర్చింది. తాజాగా విజయ్ దేవరకొండ వెడ్డింగ్ కార్డ్ నెట్టింట వైరల్ అవుతుంది. ఇది చాలా సింపుల్‌గా కనిపిస్తుంది. ఈ ఇన్విటేషన్ ప్రకారం వారి వివాహం ఫిబ్రవరి 26న వివాహవం జరగనుందని అర్థమవుతుంది. రష్మిక - విజయ్‌లతో కలిసి పని చేసిన దర్శకులు, టెక్నీషియన్లు, సన్నిహితులు కూడా ఈ వేడుకలో పాల్గొనే అవకాశముందని సినీ వర్గాలు చెబుతున్నాయి. ఈ సెలబ్రిటీ వెడ్డింగ్ రిసెప్షన్‌కు ప్రముఖ దర్శకులు, నిర్మాతలు, స్టార్ హీరోలు హాజరవుతారనే అంచనాలు ఉన్నాయి.



# ఫౌజీ షూటింగ్‌లో ప్రభాస్‌కు గాయం

ప్రభాస్ నటిస్తున్న తాజా చిత్రం ఫౌజీ షూటింగ్‌లో స్వల్ప ప్రమాదం చోటుచేసుకున్నట్లు సమాచారం. గుర్రపు స్వారీ సన్నివేశం చిత్రీకరణ సమయంలో ప్రభాస్ కింద పడిపోవడంతో చేతులకు చిన్న గాయాలు అయినట్లు సినీ వర్గాలు వెల్లడించాయి. చిత్ర బృందం వెంటనే స్పందించి ప్రథమ చికిత్స అందించగా, గాయాలు తీవ్రంగా లేవని తెలిసింది. వైద్యులు ఒకటి రెండు రోజులు విశ్రాంతి తీసుకోవాలని సూచించారు.ప్రస్తుతం ప్రభాస్ సురక్షితంగానే ఉన్నారని, త్వరలోనే మళ్లీ షూటింగ్‌లో పాల్గొననున్నారని యూనిట్ తెలిపింది. ఈ వార్తతో అభిమానులు తొలుత ఆందోళన చెందగా, గాయాలు చిన్నవేనని తెలిసి ఊపిరి పీల్చుకున్నారు. 'ఫౌజీ' చిత్రానికి హను రాఘవపూడి దర్శకత్వం వహిస్తున్నారు. గతంలో సీతారామంతో ప్రశంసలు అందుకున్న ఆయన, ఈసారి మరింత ఎమోషన్‌తో కూడిన యాక్షన్ డ్రామాను భారీ స్థాయిలో తెరకెక్కిస్తున్నారని టాక్. ఈ సినిమాలో ప్రభాస్ బ్రిటిష్ సైనికుడి పాత్రలో కనిపించ నున్నారని సమాచారం. దేశభక్తి, ప్రేమ, త్యాగం వంటి అంశాలతో కథ నడుస్తుందని తెలుస్తోంది. గుర్రపు స్వారీతో కూడిన హై వోల్టేజ్ చేజింగ్ సన్నివేశం సినిమాకే హైలైట్‌గా నిలవనుందని, భారీ సెట్స్ మరియు విజువల్ ఎఫెక్ట్స్‌తో ఈ సన్నివేశాలను రూపొందిస్తున్నారని చిత్ర యూనిట్ చెబుతోంది. ఈ చిత్రంలో ఇమాన్వీ ఇస్మాయిల్ హీరోయిన్‌గా నటిస్తోంది.







## మార్చిలో రానున్న ఉస్తాద్ భగత్ సింగ్

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా తెరకెక్కుతున్న భారీ మాస్ ఎంటర్‌టైనర్ ఉస్తాద్ భగత్ సింగ్ విడుదలకు సన్నద్ధమవుతోంది. ఇప్పటికే ఈ చిత్రంపై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమాలో రాశి ఖన్నా, శ్రీలీల హీరోయిన్లుగా నటిస్తుండగా, మాస్ కమర్షియల్ చిత్రాలకు కేరాఫ్ గా ఉన్న ప్రముఖ దర్శకుడు హరీష్ శంకర్ దర్శకత్వం వహిస్తున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తోంది. సంగీత బాధ్యతలను రాక్ స్టార్ దేవి శ్రీ ప్రసాద్ చేపట్టారు. మార్చి 26న ఈ సినిమాను ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు మేకర్స్ ఇప్పటికే అధికారికంగా ప్రకటించారు. సినిమా విడుదల తేదీ దగ్గరపడుతున్న నేపథ్యంలో ప్రమోషన్ కార్యక్రమాలను చిత్రబృందం మరింత వేగవంతం చేసింది. ఇటీవల విడుదలైన 'దేఖ్ లేంగే సాలా' లిరికల్ వీడియో అభిమానులను విశేషంగా ఆకట్టుకుంది. సోషల్ మీడియాలో ఈ పాటకు భారీ స్పందన లభించగా, అనేక మంది అభిమానులు వాట్సాప్ స్టేటస్‌లుగా కూడా పెట్టుకున్నారు. పవన్ కళ్యాణ్ మాస్ స్క్రీన్ ప్రెజెన్స్‌కు దేవిశ్రీప్రసాద్ అందించిన ఎనర్జిటిక్ బీట్‌లు జత కావడంతో ఈ సాంగ్ ట్రెండింగ్‌లో నిలిచింది. మొదటి పాట సూపర్ హిట్ కావడంతో సినిమా మీద హైప్ మరింత పెరిగింది. ఇప్పటికే మొదటి సాంగ్ సక్సెస్ కావడంతో రెండో పాట కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలో చిత్రబృందం 'ఆరా ఆఫ్ ఉస్తాద్' అనే రెండో సాంగ్‌ను ఈ నెల 22న విడుదల చేయనున్నట్లు ప్రకటించింది. ఈ ప్రకటనతో పాటు విడుదల చేసిన పోస్టర్ ప్రత్యేక డిజైన్‌తో ఉండి సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. పవన్ కళ్యాణ్ స్టైలిష్ లుక్, మాస్ అటిట్యూడ్ పోస్టర్‌లో హైలైట్ కావడంతో అభిమానుల్లో ఉత్సాహం మరింత రెట్టింపైంది. గతంలో పవన్ కళ్యాణ్ ? హరీష్ శంకర్ కాంబినేషన్‌లో వచ్చిన గబ్బర్ సింగ్ బ్లాక్‌బస్టర్ విజయాన్ని సాధించిన సంగతి తెలిసిందే. ఆ చిత్రం బాక్సాఫీస్ వద్ద కలెక్షన్ల వర్షం కురిపించి పవన్ కెరీర్‌లో ప్రత్యేక స్థానం సంపాదించింది. అదే కాంబినేషన్ మళ్లీ రిపీట్ అవుతుండటంతో 'ఉస్తాద్ భగత్ సింగ్' కూడా మాస్ హిట్ అవుతుందనే నమ్మకం అభిమానుల్లో బలంగా కనిపిస్తోంది.

## ప్రమోషన్స్ పూర్తి చేసుకున్నాక టైటిల్ వివాదాలు

సినిమా ప్రమోషన్లన్నీ పూర్తి చేసుకున్నాక, సరిగ్గా సెన్సార్ సర్టిఫికేట్ వచ్చే సమయంలో టైటిల్ మార్చాల్సి రావడం నిర్మాతలకు పెద్ద తలనొప్పిగా మారింది. తాజాగా యంగ్ హీరో సుహాస్ నటించిన సినిమా కూడా ఇదే సమస్యను ఎదుర్కొంది. కేవలం సుహాస్ మాత్రమే కాదు, ఈ మధ్య కాలంలో మరికొన్ని చిన్న సినిమాలు కూడా సెన్సార్ అ÷-జబెక్షన్స్ వల్ల పేర్లు మార్చుకున్నాయి. సుహాస్, శివానీ నగరం జంటగా నటించిన చిత్రం 'హే భగవాన్'. ఈ నెల 20న విడుదలకు సిద్ధమైన ఈ సినిమాపై సెన్సార్ బోర్డు అభ్యంతరం వ్యక్తం చేసింది. దేవుడి పేరుతో ఉన్న టైటిల్ వల్ల కొన్ని వర్గాల సెంటిమెంట్స్ దెబ్బతినే అవకాశం ఉందని భావించిన బోర్డు, పేరు మార్చాలని సూచించింది. దీంతో మేకర్స్ చేసేదేమీ లేక చివరి నిమిషంలో టైటిల్‌ను 'హే బలవంత్!' గా మార్చారు. ప్రమోషన్లన్నీ పాత పేరుతోనే జరగడంతో ఈ మార్పు సినిమాపై ఎలాంటి ప్రభావం చూపుతుందోనని చిత్ర యూనిట్ ఆందోళన చెందుతోంది. ఇటీవల విడుదలైన 'వానర' చిత్రానికి కూడా ఇదే పరిస్థితి ఎదురైంది. ఈ చిత్రంలో కుల రాజకీయాలు మరియు సున్నితమైన అంశాలు ఉండటం, టైటిల్ ఏమో హనుమంతుడిని గుర్తు చేసేలా ఉండటంతో సెన్సార్ బోర్డు నో చెప్పింది. దీంతో ఈ సినిమాను 'వనవీర' పేరుతో విడుదల చేయాల్సి వచ్చింది. ప్రమోషన్ల కోసం ఖర్చు పెట్టిన డబ్బు, టైటిల్ రీచ్ అంతా వృథా అయిందని ఆ చిత్ర దర్శకుడు ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే శివ కందుకూరి నటించిన 'చాయ్ వాలా' సినిమాకు కూడా సెన్సార్ కష్టాలు తప్పలేదు. ఈ టైటిల్ వాడకూడదని బోర్డు పట్టుబట్టడంతో, చిత్ర యూనిట్ తమ వర్కింగ్ టైటిల్ అయిన 'నవాబ్ కేఫ్'ను ఖరారు చేసింది. తండ్రీ కొడుకుల మధ్య సాగే ఈ ఎమోషనల్ డ్రామా ఫిబ్రవరి 20న కొత్త పేరుతో థియేటర్లలోకి రానుంది. చిన్న సినిమాలకు టైటిల్ అనేది బ్రాండింగ్‌లో కీలక పాత్ర పోషిస్తుంది. ఇలాంటి సమయంలో సెన్సార్ బోర్డు నిబంధనలు చిన్న నిర్మాతలకు భారంగా మారుతున్నాయి.





# నేను ఇండియాలోనే ఉండాలనుకుంటున్నా తాప్సీ సెటైరికల్ కామెంట్స్ వైరల్

సౌత్ నుంచి బాలీవుడ్ వరకు వైవిధ్యమైన పాత్రలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న నటి తాప్సీ పన్ను మరోసారి తన వ్యాఖ్యలతో వార్తల్లో నిలిచారు. 2010లో కె. రాఘవేంద్రరావు దర్శకత్వంలో వచ్చిన ఝుమ్మంది నాదం సినిమాతో టాలీవుడ్‌లో ఎంట్రీ ఇచ్చిన ఆమె, 'మిస్టర్ పర్ఫెక్ట్', 'వీర', 'మొగుడు', 'దరువు', 'షాడో', 'గుండెల్లో గోదారి' వంటి చిత్రాల్లో నటించారు. అయితే తెలుగులో ఆశించిన స్థాయిలో విజయాలు అందుకోలేకపోవడంతో బాలీవుడ్‌పై దృష్టి సారించారు. హిందీ చిత్రసీమలో మాత్రం తాప్సీ తన కెరీర్‌ను పూర్తిగా మలుచుకున్నారు. గ్లామర్ పాత్రలకు భిన్నంగా కథా ప్రాధాన్యత గల పాత్రలను ఎంచుకుంటూ నటనతో ప్రత్యేక గుర్తింపు పొందారు.ముఖ్యంగా పింక్, నామ్ శభాన, థప్పడ్, ముల్క్ వంటి సినిమాలతో ఆమె నటిగా తన సామర్థ్యాన్ని నిరూపించుకున్నారు. లేడీ ఓరియెంటెడ్ కథలను ఎంచుకోవడం ఆమె ప్రత్యేకతగా మారింది. ఇటీవల ఓ ప్రముఖ న్యూస్ ఛానల్‌కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో తాప్సీ చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. రాపిడ్ ఫైర్ రౌండ్‌లో "మీకు ఇష్టమైన రాజకీయ నాయకుడు ఎవరు? నరేంద్ర మోదీనా? లేక రాహుల్ గాంధీనా?" అనే ప్రశ్న ఎదురవ్వగా తాప్సీ నవ్వుతూ మోదీ ఫోటో వైపు చేతులు జోడించి నమస్కారం చేశారు. వెంటనే "నాకు ఇంకా ఈ దేశంలోనే ఉండాలని ఉంది" అంటూ చమత్కారంగా సమాధానం ఇచ్చారు.ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో పెద్ద చర్చకు దారితీశాయి. కొందరు ఆమె చమత్కారాన్ని మెచ్చుకుంటూ స్మార్ట్‌గా హ్యాండిల్ చేసిందని అభిప్రాయపడుతుండగా, మరికొందరు ఈ వ్యాఖ్యలను రాజకీయ కోణంలో విశ్లేషిస్తూ ట్రోలింగ్‌కు దిగుతున్నారు. అభిమానులు మాత్రం తాప్సీ ఎప్పటిలాగే బోల్డ్‌గా మాట్లాడిందని ఆమెకు మద్దతు ఇస్తున్నారు. ఇక గతంలో కూడా తాప్సీ టాలీవుడ్‌పై చేసిన వ్యాఖ్యలు సంచలనంగా మారిన సంగతి తెలిసిందే. తెలుగులో హీరోయిన్‌లకు సరైన ప్రాధాన్యం ఉండదని, మహిళా పాత్రలకు కథలో బలం తక్కువగా ఉంటుందని ఆమె అభిప్రాయపడ్డారు. తాజాగా "నేను ఇండియాలోనే ఉండాలనుకుంటున్నా" అన్న ఒక్క మాటతో మళ్లీ సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లోకి వచ్చారు. ఆమె కామెంట్స్‌పై ఇంకా చర్చ కొనసాగుతూనే ఉంది.

Printed & published owned by K.SRAVAN KUMAR. Printed Published RK PRINTING PRESS at 6-1-948 Boyawada Street Nalgonda.Pin : 508001. Head office: 2-66-121/122 near ramky one Marvel gajullaramaram Quthbulapur medchal Malkajgiri district. RNI.NO.APTEL/2009/29433.(CELL ) 9866330400 prajaveekshanam@gmail.com